

'బీడుబడిన భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 177

శనివారం 17-9-2022



శుభాష్ ప్రణవ్ ఆనంద్
చెస్‌లో బెంగళూరు కుర్రాడికి గ్రాండ్ మాస్టర్ హోదా - 13లో



మార్కెట్‌లో మాంద్యం భయాలు
దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాలు ఫుల్. సెన్సెక్స్ 1,093 పాయింట్లు పతనం - 13లో

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



లిక్కర్ స్కాంలో ఈడీ తనిఖీలు
ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించి దేశ వ్యాప్తంగా ఈడీ అధికారులు సోదాలు చేసి.. కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.
వివరాలు 6లో



నిరుద్యోగం..45 ఏళ్ల గరిష్టానికి
గత 45 ఏళ్లలో దేశంలో రికార్డు స్థాయికి నిరుద్యోగం చేరుకుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు.
వివరాలు 6లో



యూపీలో విషాదం
ఉత్తరప్రదేశ్‌లో భారీ వర్షాల కారణంగా 22 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 9 మంది కూలీలు ఉన్నారు.
వివరాలు 6లో



ఉక్రెయిన్‌లో శవాల దిబ్బలు
ఉక్రెయిన్‌లో భారీగా శవాల దిబ్బలు బయట పడుతున్నాయి. ఇజియంలో 400కు పైగా మృతదేహాలను గుర్తించారు.
వివరాలు 6లో

న్యూస్‌రీల్

కాకినాడకు మణిహారం.. ఐఐఎఫ్‌టీ



దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన బీస్కూల్స్‌లో ఒకటైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ) సీఎం జగన్ చొరవతో కాకినాడ జేఎన్‌టీయూలో కొలువుదీరింది. ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి.
వివరాలు 5లో ▸

శ్రీవారి సేవలో ముకేశ్ అంబానీ



రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం అభిషేక సేవలో తనకు కాబోయే కోడలు రాధికతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా టీటీడీ ట్రస్టుకు ఆయన రూ.1.5 కోట్లను విరాళంగా అందించారు.
వివరాలు 5లో ▸

కోలగట్ల నామినేషన్ దాఖలు



శాసనసభ డిప్యూటీ స్పీకర్ పదవికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి నామినేషన్ దాఖలు చేశారు. గడువు ముగిసే సమయానికి కోలగట్ల మినహా ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. సోమవారం అసెంబ్లీలో ఎన్నిక నిర్వహించనున్నారు.
వివరాలు 2లో ▸

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి భేష్

ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యానికి ఢోకా లేదు.. అసెంబ్లీలో గణాంకాలతో వివరించిన సీఎం జగన్

- బాబు హయాంలో కంటే ఇప్పుడు మరింత మెరుగ్గా ఉంది
- ఇప్పుడు అప్పులు తక్కువ, క్యాపిటల్ వ్యయం ఎక్కువ
- కోవిడ్ విలయంలో కూడా మెరుగైన ఆర్థిక క్రమశిక్షణ.. ఒక పక్క సంక్షేమం, మరో పక్క అభివృద్ధి కొనసాగింపు
- మెరుగైన పాలన, చర్యల వల్లే దేశంలోనే జీడీపీ వృద్ధిలో ఏపీ అగ్రగామి
- ఇదంతా జీర్ణించుకోలేకే దుష్టచతుష్టయం తప్పుడు ప్రచారం.. దాన్ని నమ్మొద్దు
- తప్పుడు ప్రచారంతో అప్పులు పుట్టకుండా చేయాలన్నది వారి లక్ష్యం
- తద్వారా సంక్షేమాభివృద్ధి పథకాలు నిలిచిపోవాలని వారి తపన



“ అప్పులపై, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5తో పాటు దత్తపుత్రుడు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దు. గత చంద్రబాబు ప్రభుత్వం కన్నా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉంది. బాబు హయాంలో కన్నా అప్పులు తక్కువ, క్యాపిటల్ వ్యయం ఎక్కువగా చేశాం. చంద్రబాబుతో పాటు ఎల్లో మీడియా దీన్ని జీర్ణించుకోలేని స్థితిలో ఉంది. కోవిడ్ విసిరిన పెద్ద సవాళ్లు, విలయంలో కూడా మెరుగైన ఆర్థిక క్రమశిక్షణతో పాలన సాగిస్తున్నాం. తద్వారా అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగించగలిగాం. 5.3 కోట్ల ప్రజల కోసం ఇంటింటికి సంక్షేమం, అభివృద్ధి అందిస్తూ మేనిఫెస్టోలో చెప్పిన 98.4% హామీలను అమలు చేశాం. ఇదంతా గిట్టకే ఎలాగైనా ఈ పథకాలన్నీ నిలిచి పోవాలని వారు విష ప్రచారం చేస్తున్నారు.

\- అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యానికి ఎటువంటి ఢోకా లేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆరోగ్య పరంగా ఇబ్బందులు ఏమైనా ఉంటే, అవి చంద్రబాబునాయుడుకు ఉండి ఉండాలని అన్నారు. ఆర్థిక పరంగా రాష్ట్రం ఇబ్బందులు ఎదుర్కోవాలనేది చంద్రబాబుతో పాటు ఎల్లో మీడియా ఆశ అని చెప్పారు. అయితే ఆర్థికంగా రాష్ట్రం బాగుండటంతో దుష్టచతుష్టయం జీర్ణించుకోలేక పోతోందని దుయ్యబట్టారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాగోలా డబ్బులు రాకుండా ఆపేయాలనే దుర్బుద్ధితో అప్పులపై కేంద్రానికి, రిజర్వ్ బ్యాంకు, బ్యాంకులకు, ఆర్థిక సంస్థలకు తప్పుడు ఉత్తరాలు రాయడంతో పాటు కోర్టుల్లో తప్పుడు కేసులు కూడా వేస్తూ రాత్రీ పగలనక దుష్టచతుష్టయంశక్తులు కష్టపడుతున్నాయని చెప్పారు. ఆర్థిక వ్యవస్థ బాగుండక పోతే చంద్రబాబు, ఎల్లో మీడియాకు బాగుంటుందని, ఆర్థిక వ్యవస్థ బాగుండటం వారికి చేదువార్త అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, ఆర్థికాభివృద్ధిపై
మిగతా 2వ పేజీలో ▶

చెల్లింపుల్లోనూ ప్రగతి

- బాబు హయాంలో అదే బడ్జెట్.. ఇప్పుడూ అదే బడ్జెట్
- అప్పుడు ద్రవ్యలోటు 6.58%.. ఇప్పుడు 5.73 శాతం
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- వివరాలు 2లో

చంద్రబాబు కేరాఫ్ దుబారా

- అమరావతి సాధ్యం కాదని ఆయనకు ముందే తెలుసు
- బాబు ఆర్థిక విధానాలే రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టాయి
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి

10లో

వర్జీనియా బీచ్ ఐటీలా విశాఖ

- స్టార్టప్స్ హబ్‌గా సాగర తీరం
- దేశంలోనే అత్యధికంగా ఏపీ జీడీపీ గ్రోత్
- ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

10లో

ఆర్నెల్లలో రూ.41 వేల కోట్ల పెట్టుబడులు

- బాబు ఐదేళ్ల పాలనలో వచ్చినవి రూ.59,968 కోట్లు
- ఇప్పుడు మూడేళ్లలోనే రూ.80 వేల కోట్ల పెట్టుబడులు
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

10లో

దిగ్గజ కంపెనీల రాక

- మూడేళ్లలో 99 పెద్ద పరిశ్రమలు, రూ.56 వేల కోట్ల పెట్టుబడులు
- ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

10లో

అసెంబ్లీలో టీడీపీ రాద్ధాంతం

పోడియంపైకి ఎక్కి నినాదాలు

- స్పీకర్‌ని ఏకవచనంతో సంబోధిస్తూ దూర్భాషలు
- మార్షల్స్‌పైనా విరుచుకుపడి తిట్లపురాణం.. తాము చెప్పినట్లే సభ జరగాలని హంగామా
- టీడీపీ సభ్యుల్ని ఒకరోజు సస్పెండ్ చేసిన స్పీకర్


అసెంబ్లీలో స్పీకర్ తమ్మినేని సీతారాం పోడియంను చుట్టుముట్టిన టీడీపీ ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి: శాసనసభలో రెండో రోజు శుక్రవారం కూడా టీడీపీ సభ్యులు గందరగోళం సృష్టించారు. స్పీకర్ పోడియంపైకి ఎక్కి నినాదాలు చేస్తూ సభ జరగకుండా అడ్డుకునేందుకు విఫల యత్నం చేశారు. స్పీకర్ తమ్మినేని సీతారాంను ఏకవచనంతో సంబోధిస్తూ అవమానకరంగా మాట్లాడారు. సభలో ప్రభుత్వం ప్రారంభించిన చర్చ జరగకుండా అడ్డుకోవడం, గొడవ చేయడం ద్వారా సస్పెన్షన్ వేటు వేయించుకుని సభ నుంచి బయటకు వెళ్లిపోవడమే లక్ష్యంగా టీడీపీ ఎమ్మెల్యేలు హంగామా చేశారు. ప్రశ్నోత్తరాల తర్వాత తాము వాయిదా తీర్మానం ఇచ్చిన ధరల పెరుగుదలపై చర్చ జరగాలని టీడీపీ ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. దాన్ని తిరస్కరించినట్లు చెప్పిన స్పీకర్ బిల్లులు ప్రవేశపెట్టేందుకు అనుమతించారు. ఈ సమయంలో టీడీపీ ఎమ్మెల్యేలంతా ఒక్కసారిగా ప్లకార్డులు పట్టుకుని బాదుడే బాదుడు అంటూ నినాదాలు చేసుకుంటూ స్పీకర్ పోడియంపైకి ఎక్కారు. ఒకవైపు మంత్రులు బిల్లులు ప్రవేశపెడుతున్నా పట్టించుకోకుండా వారు మాట్లాడే విషయాలు వినపడకుండా పోడియంను కొడుతూ పెద్దగా నినాదాలు చేశారు. స్పీకర్‌ను తిడుతూ రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. ఈ సమయంలో శాసనసభా వ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ జోక్యం చేసుకుని ఉద్దేశపూర్వకంగా సభలో గందరగోళం సృష్టిస్తున్నారని సభను ఆర్డర్‌లో పెట్టాలని స్పీకర్‌ను కోరారు. స్పీకర్ ఎంతచెప్పినా వినకుండా
మిగతా 10వ పేజీలో ▶



గ్రామకంఠం ఆక్రమణలు ఖాళీ చేయాల్సిందే

- అవి ఎప్పటికీ ప్రైవేట్ భూములు కాలేవు: హైకోర్టు
- పంచాయతీనే వాటికి యజమాని
- 30-40 ఏళ్లుగా స్వాధీనంలో ఉన్నంత మాత్రాన యాజమాన్య హక్కులు సంక్రమించవు
- జీవోల ఆధారంగా సమగ్ర ఉత్తర్వులిస్తాం
- పశువుల దొడ్ల భూముల్లో ఆక్రమణలను తొలగించండి

సాక్షి, అమరావతి: గ్రామకంఠం భూముల్లో 30-40 ఏళ్లుగా ఉంటున్నప్పటికీ ఆక్రమణదారులు వాటిని ఖాళీ చేసి తీరాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. గ్రామ కంఠం భూములు ఎన్నటికీ ప్రైవేట్ వ్యక్తులకు చెందినవి కావని తేల్చి చెప్పింది. ఆ భూములకు పంచాయతీనే యజమాని అవుతుందని పేర్కొంది. గ్రామ కంఠం భూములను ఆక్రమించుకుని దశాబ్దాలుగా ఉంటున్నా
మిగతా 3వ పేజీలో ▶

అనుసంధానమే బలం

- ‘తయారీ’లో గ్లోబల్ హబ్‌గా భారత్ .. నవీన ఆవిష్కరణలకు ఊతం
- 70,000కు పైగా స్టార్టప్‌లు
- మా అనుభవాలను వాడుకోండి.. సప్లై చైన్లను అభివృద్ధి చేసుకుందాం
- ఎస్‌సీవో సభ్యదేశాలకు ప్రధాని మోదీ పిలుపు

6లో



యుద్ధానికి ముగింపు పలకండి

రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ప్రధాని మోదీ సూచన

విలీనం.. విమోచనం.. సమైక్యత!



- నేడు తెలంగాణలో పోటాపోటీ కార్యక్రమాలు.. హైదరాబాద్‌లో అమిత్‌షా, కేసీఆర్ సభలు
- లెఫ్ట్ ర్యాలీలు.. పాతబస్తీలో ఎంఐఎం సభ
- సెప్టెంబర్ 17పై ఎవరి దారి వారిదే

సాక్షి ప్రత్యేక ప్రతినిధి: తెలంగాణలో సెప్టెంబర్ 17 చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. హైదరాబాద్ సంస్థానం నిజాం నుంచి దేశంలో అంతర్భాగమైన తేదీకి ఒక్కో పార్టీ ఒక్కో భాష్యం చెబుతూ పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత ఇన్నేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించలేదు. ఈసారి మాత్రం పోటాపోటీ కార్యక్రమాలకు దిగాయి. నిజాం నుంచి తెలంగాణ ప్రాంతాన్ని భారత్‌లో విలీనం చేసింది కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రభుత్వమని ఆ పార్టీ నేతలు చెబుతుంటే.. నిజాం అరాచకాల నుంచి సర్దార్ వల్లభాయ్‌పటేల్
మిగతా 3వ పేజీలో ▶




తుంగభద్ర డ్యామ్‌కు భారీ వరద

66 రోజులుగా తుంగభద్ర డ్యామ్ గేట్లు ఎత్తివేత

- ఈ ఏడాది ఇప్పటికే డ్యామ్‌లోకి 487.76 టీఎంసీల ప్రవాహం
- గతేడాది ఇదే సమయానికి డ్యామ్‌లోకి 226.72 టీఎంసీలు
- ఇదే సమయానికి గత పదేళ్లలో డ్యామ్‌లోకి వచ్చిన సగటు ప్రవాహం 219.59 టీఎంసీలు
- 1992లో డ్యామ్‌లోకి 519.60 టీఎంసీల ప్రవాహం.. ఈ ఏడాది ఆ రికార్డు దాటే చాన్స్
- బచావత్ ట్రిబ్యునల్ అంచనా మేరకు ఈ ఏడాది 230 టీఎంసీల లభ్యత

మూడు దశాబ్దాల తర్వాత పెరిగిన ఉద్ధృతి



సాక్షి, అమరావతి: కృష్ణా ప్రధాన ఉపనది అయిన తుంగభద్ర గతంలో ఎన్నడూ లేనిరీతిలో ఈ ఏడాది వరద ప్రవాహంతో పరవళ్లు తొక్కుతోంది. తుంగభద్ర వరద ఉద్ధృతికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణల ఉమ్మడి ప్రాజెక్టు అయిన తుంగభద్ర డ్యామ్ జూలై 13 నాటికే నిండిపోవడంతో గేట్లు ఎత్తేసి వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. అప్పటి నుంచి శుక్రవారం వరకు అంటే 66 రోజులుగా గేట్లను దించలేదు. జూన్ 1 నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు డ్యామ్‌లోకి 487.76 టీఎంసీల ప్రవాహం వచ్చింది. ఇందులో 1,632.74 అడుగుల్లో 104.74 టీఎంసీలను నిల్వ చేస్తూ (గత నీటిసంవత్సరం ముగిసేనాటికి
మిగతా 3వ పేజీలో ▶

నాలుగో అతిపెద్ద వరద

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల ఉమ్మడి ప్రాజెక్టు తుంగభద్ర 1958లో పూర్తయింది. డ్యామ్ చరిత్రలో 1978లో 558.775 టీఎంసీల ప్రవాహమే అతి పెద్ద వరద. ఆ తర్వాత 1980లో వచ్చిన 553.1 టీఎంసీల ప్రవాహం రెండో అతిపెద్ద వరదగా నమోదైంది. 1992లో డ్యామ్‌లోకి వచ్చిన 519.60 టీఎంసీల ప్రవాహం మూడో అతిపెద్ద వరద. మూడు దశాబ్దాల తర్వాత ఈ ఏడాది తుంగభద్ర డ్యామ్‌లోకి శుక్రవారం వరకు వచ్చిన 487.76 టీఎంసీల ప్రవాహం నాలుగో అతిపెద్ద వరద. డిసెంబర్ వరకు డ్యామ్‌లోకి వరద ప్రవాహం కొనసాగే అవకాశం ఉన్న నేపథ్యంలో.. 1992 కంటే ఎక్కువ ప్రవాహం వస్తుందని అంచనా వేస్తున్నారు.



లక్ష కోట్ల దిశగా పతంజలి గ్రూప్

- 5-7 ఏళ్లలో సాకారం అవుతుంది
- బాబా రాందేవ్ ప్రకటన

13లో

నేటి నుంచి ప్రధాని బహుమతుల వేలం

- ఢిల్లీలో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి
- ఈ వేలంలో అందుబాటులో ఉన్న 1,222 జ్ఞాపికలు

6లో



నాలుగు బిల్లులకు ఆమోదం

సాక్షి, అమరావతి: నాలుగు బిల్లులకు శుక్రవారం శాసనసభ, శాసనమండలి ఆమోదం తెలిపాయి. ప్రస్తుత జెడ్పీ ఛైర్మన్ల పదవీకాలం ముగిసే వరకు ఉమ్మడి జిల్లాల ప్రకారమే పాత జిల్లా పరిషత్‌లు కొనసాగేందుకు వీలుగా ఏపీ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ఉభయ సభలు ఆమోదించాయి. ఆర్‌డీసీలో ఇకపై 16 మంది సభ్యులు ఉండేలా ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చట్ట సవరణ బిల్లుకు, ఏపీ సివిల్ సర్వీసెస్ (డిసిప్లినరీ ప్రొసీడింగ్ బిల్లు) చట్ట సవరణ బిల్లుకు, సవరించిన మార్కెట్ సెస్ నుంచి కొంత మొత్తాన్ని కేంద్ర మార్కెట్ నిధికి జమ చేయడానికి ఉద్దేశించిన ఏపీ అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ అండ్ లైవ్‌స్టాక్ మార్కెట్ చట్ట సవరణ బిల్లుకు శాసనసభ, శాసన మండలి ఆమోదం తెలిపాయి. ఈ బిల్లులను గురువారం ఉభయ సభల్లో ప్రవేశపెట్టగా, శుక్రవారం ఆమోదించాయి.



చెల్లింపుల్లోనూ ప్రగతి

అసెంబ్లీ వేదికగా ప్రజలకు వాస్తవాలు వివరించిన సీఎం జగన్

- బాబు హయాంలో అదే బడ్జెట్.. ఇప్పుడూ అదే బడ్జెట్
- అప్పుడు ద్రవ్యలోటు 6.58 శాతం.. ఇప్పుడు 5.73 శాతం
- గత ప్రభుత్వంలో 2018–19లో రుణం, వడ్డీ రూ.28,886.69 కోట్లు చెల్లింపు
- మన ప్రభుత్వంలో 2021–22లో రుణం, వడ్డీ రూ.36,008 కోట్లు చెల్లింపు
- కోవిడ్‌తో ఆదాయానికి గండి.. అయినా గ్రోత్ రేటు పరుగులు
- బాబు జమానాలో మూల ధన వ్యయం ఏటా సగటున రూ.15,228 కోట్లు
- ఈ మూడేళ్లలో ఏటా సగటున రూ.18,362.07 కోట్లు
- కేంద్రం పన్నుల వాటాలో తగ్గుదల.. అయినా నవరత్నాలు, విప్లవాత్మక కార్యక్రమాలు
- పారదర్శక పాలనతో నేరుగా ప్రజల ఖాతాల్లోకి నగదు
- అప్పులపై దుష్టచతుష్టయం ప్రచారం అంతా పచ్చి అవాస్తవాలే
- ఈ విషయాలన్నీ ప్రజలు గమనించాలి



సాక్షి, అమరావతి: చేసిన అప్పులు చెల్లించే విషయంలో, ద్రవ్య లోటు విషయంలో దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోలిస్తే మనం మంచి పరిస్థితిలో ఉన్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ఈ మూడేళ్లలో చాలా మెరుగ్గా ఉందన్నారు. పన్నుల ఆదాయంలో అధిక భాగం రుణాల చెల్లింపులకే సరిపోతోందని దుష్ప్రచారం చేస్తున్నారని, నిజానికి గత ప్రభుత్వం కంటే, ఈ ప్రభుత్వం అప్పుల చెల్లింపులో చాలా సమర్థవంతంగా వ్యవహరిస్తోందని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాల సగటు ద్రవ్యలోటుతో పోలిస్తే, ఆంధ్రప్రదేశ్ సగటు ద్రవ్యలోటు 6.58 శాతంగా తేలిందని, ఈ మూడేళ్లలో (2019 - 2022) 5.73 శాతం మాత్రమేనని చెప్పారు. రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధిపై శుక్రవారం ఆయన అసెంబ్లీలో జరిగిన చర్చలో మాట్లాడుతూ.. అప్పుల చెల్లింపులో వాస్తవాలను ప్రజలముందుంచారు. 2018–19లో చంద్రబాబు హయాంలో గత ప్రభుత్వం రుణాల తిరిగి చెల్లింపులో వడ్డీ కింద రూ.15,342 కోట్లు, అసలు కింద రూ.13,545 కోట్లు.. మొత్తంగా రూ.28,886.69 కోట్లు చెల్లించిందని చెప్పారు. అదే మన ప్రభుత్వం వచ్చాక 2021–22లో వడ్డీ కింద రూ.21,449 కోట్లు, అసలు కింద రూ.14,559 కోట్లు.. మొత్తంగా రూ.36,008 కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు. రాష్ట్ర సొంత ఆదాయం 2018–19లో రూ.62,426 కోట్లు అయితే.. అందులో రూ.28,886.69 కోట్లు.. 46.3 శాతం అప్పుల కోసం చెల్లించాల్సి వచ్చిందని తెలిపారు. 2021–22లో రూ.75,696 కోట్లు ఆదాయం ఉంటే.. అందులో 47.6 శాతం అప్పులు చెల్లించడానికి ఖర్చు చేశామన్నారు. కోవిడ్ సమయంలో అంటే 2021–22 ఏప్రిల్, మే నెలలో లాక్‌డౌన్ వల్ల మనకు రావాల్సిన ఆదాయానికి గండి పడిందని, అయినప్పటికీ ఇవాళ ఎకానమీ బాగుందని.. గ్రోత్ రేట్ పరుగులు తీస్తోందని తెలిపారు. ఈ ఐదేళ్లు ముగిసేసరికి గత ప్రభుత్వం కన్నా మన ప్రభుత్వం కచ్చితంగా మెరుగైన పని తీరు చూపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ చర్చలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

మూల ధన వ్యయం మనమే ఎక్కువ

- రాష్ట్ర ప్రభుత్వం ఆస్తులు, సంపద సృష్టి కోసం కాకుండా ప్రజాకర్షక పథకాలు, కార్యక్రమాలకే నిధులు వ్యయం చేస్తోందని చంద్రబాబు, ఎల్లో మీడియా విష ప్రచారం చేస్తోంది. ఇది కూడా పూర్తిగా అవాస్తవం. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో కంటే, మనందరి ప్రభుత్వం ఈ మూడేళ్లలో చాలా ఎక్కువ మొత్తాన్ని (క్యాపిటల్ ఇన్వెస్టిమెంట్) మూల ధన వ్యయం కింద ఖర్చు చేసింది.
- విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న మనందరి ప్రభుత్వం వాటి కోసం పెద్ద ఎత్తున ఖర్చు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వైద్య రంగంలో గణనీయ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇవన్నీ రాష్ట్ర ప్రజల మంచి కోసం మనం చేస్తున్నాం.
- మూలధన వ్యయం కింద గత ప్రభుత్వం 2014–15లో రూ.7265 కోట్లు, 2015–16లో రూ.15,042 కోట్లు, 2016–17లో రూ.15,707 కోట్లు, 2017–18లో రూ.16,280 కోట్లు, 2018–19లో రూ.21,845 కోట్లు ఖర్చు చేసింది. ఐదేళ్లలో మొత్తం రూ.76,139 కోట్లు ఖర్చు చేసింది. ఏటా అది సగటున రూ.15,228 కోట్లు.
- మనందరి ప్రభుత్వం వచ్చాక 2019–20లో మూలధన వ్యయంగా చేసిన ఖర్చు రూ.17,601 కోట్లు. 2020–21లో రూ.20,690 కోట్లు, 2021–22లో రూ.16,795 కోట్లు. ఈ మూడేళ్లలో ఏటా సగటున రూ.18,362.07 కోట్ల చొప్పున మొత్తం రూ.55,086 కోట్లు ఖర్చు చేసింది.
- ఇదే సమయంలో కేంద్ర స్థాయిలో మూలధన వ్యయం (గ్రాస్ ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఫార్మేషన్ జీఎఫ్‌సీఎఫ్) చూస్తే అంతకు ముందు నాలుగేళ్ల కంటే, గత మూడేళ్లలో తగ్గుతూ వస్తోంది.

కేంద్రం నుంచి పన్నుల వాటా తగ్గుదల

- కేంద్రం వసూలు చేసే పన్నుల్లో రాష్ట్రాలకు వచ్చే వాటా, అందులో మన రాష్ట్రానికి వచ్చే వాటా కూడా మూడేళ్లుగా తగ్గుతూ వస్తోంది. 14వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు, కేంద్రం వసూలు చేసే పన్నుల్లో 2015 నుంచి 2020 వరకు సెస్, సర్‌చార్జ్ మినహాయించి 42 శాతం మొత్తాన్ని రాష్ట్రానికి ఇవ్వాల్సి ఉంది.
- 15వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు ఆ పన్నుల్లో 2025 వరకు 41% రాష్ట్రాలకు ఇవ్వాలి. కానీ కేంద్రం ఏనాడూ ఆ మొత్తంలో రాష్ట్రాలకు తమ పన్నుల ఆదాయాన్ని పంచలేదు.
- 2019 నుంచి మన రాష్ట్రానికి ఆ ఆదాయం ఇంకా తగ్గింది. 2015–16లో కేంద్రానికి రూ.14,49,958 కోట్ల ఆదాయం రాగా, అందులో రాష్ట్రాలకు ఇచ్చింది రూ.5,06,193 కోట్లు. అంటే 42 శాతం ఇవ్వాల్సిన చోట 34.91 శాతం మాత్రమే ఇచ్చింది. ఐదేళ్లలో సరాసరి 34, 35 శాతం ఇస్తున్నారు. అందులో మన రాష్ట్రానికి 4.30 శాతం వస్తుంది. ఈ మూడేళ్లలో 35 శాతం కూడా రావడం లేదు.
- 2015–16లో 34.91 శాతం, 2016–17లో 35.57 శాతం 2017–18లో 35.13 శాతం 2018–19లో 36.63 శాతం వస్తే.. మన ప్రభుత్వం వచ్చాక 2019–20లో 32.41 శాతం, 2020–21లో 29.35 శాతం, 2021–22లో 32.56 శాతం వచ్చింది. అయినప్పటికీ దేవుడి దయతో మెరుగైన ఆర్థిక క్రమశిక్షణ తీసుకురాగలిగాం.

> “బాబు హయాంలో అదే బడ్జెట్.. ఇప్పుడూ అదే బడ్జెట్. అయినా బాబు హయాంలో వైఎస్సార్ ఆసరా, చేయూత, అమ్మఒడి, రైతు భరోసా పథకాలు ఎందుకు లేవు? ఇప్పుడు ఆ పథకాలు ఎందుకు ఉన్నాయని ప్రజలంతా ఆలోచించాలి. బాబు హయాంలో దోచుకో పంచుకో తినుకో పద్ధతి ఉన్నా, ఈనాడుతో పాటు మిగతా ఎల్లో మీడియా రాయలేదు.. చూపించ లేదు. ఎందుకంటే మా బాబు మంచి వాడనేది వారి ధోరణి. ఈ రోజు లంచాలు, వివక్ష లేకుండా విశ్వసనీయత, పారదర్శకంగా బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నాం. దుష్టచతుష్టయం తప్పుడు ప్రచారం నమ్మకుండా, ఈ ప్రభుత్వం చేసే మంచిని చూడండి.”
> – సీఎం వైఎస్ జగన్

మన మనిషి సీఎం స్థానంలో లేడని విష ప్రచారం

- వాళ్ల మనిషి ముఖ్యమంత్రి స్థానంలో లేడు కాబట్టి ఈ ప్రభుత్వం మీద బురదజల్లాలన్న మైండ్‌సెట్‌తో కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు. 2018–19లో ఆపద్ధర్మ సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబు ప్రవేశ పెట్టిన బడ్జెట్ రూ.2.28 లక్షల కోట్లు. మూడేళ్ల తర్వాత మనం ప్రవేశపెట్టిన బడ్జెట్ రూ.2.50 లక్షల కోట్లు. దాదాపు అదే బడ్జెట్. చంద్రబాబు కన్నా మనమే తక్కువ అప్పులు చేశాం.
- మరి బాబు హయాంలో అమ్మఒడి, చేయూత, ఆసరా వంటి పథకాలు లేవు. అప్పుడు పెన్షన్ కేవలం ముష్టి వేసినట్టు.. రూ.1,000 ఇచ్చారు. ఇవాళ రూ.2,500 ఇస్తున్నాం. ఇవన్నీ కాకుండా మూలధన వ్యయం కూడా వాళ్ల కన్నా మన ప్రభుత్వమే ఎక్కువ చేసింది.
- అప్పట్లో దోచుకో, పంచుకో, తినుకో ఒక్కటే స్కీం. చంద్రబాబు, ఆంధ్రజ్యోతి, టీవీ5, దత్తపుత్రుడు. ఎవరెవరికి ఎంత వాటాలు రావాలో అంత పంచుకుంటారు. ఎవరూ రాయరు, ఎవరూ చూపరు. అప్పుడప్పుడూ చంద్రబాబు మీద మా బాబు మంచోడనే రాతలు రాస్తారు.
- ఇవాళ అవినీతి లేదు, లంచాలు, వివక్ష కూడా లేదు. పాలనలో పారదర్శకత ఉంది. రాష్ట్ర ప్రజలందరూ ఇవన్నీ ఆలోచించాలని, వారి తప్పుడు మాటలు, అబద్ధాలను నమ్మవద్దని, ప్రభుత్వం చేసే మంచిని చూడమని ఈ సభ ద్వారా విన్నవిస్తున్నా.

విశాఖకు రెడీ!

- వచ్చే విద్యా సంవత్సరానికి సిద్ధంగా ఉండాలి: మంత్రి గుడివాడ
- త్వరలోనే అసెంబ్లీలో అన్ని ప్రొసీడింగ్స్‌తో బిల్లు పెడతాం
- మూడు రాజధానుల విధానంలో ఎలాంటి మార్పు ఉండదు



సాక్షి అమరావతి: వచ్చే విద్యా సంవత్సరానికి విశాఖ వచ్చేందుకు సిద్ధం కావాలని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మీడియా ప్రతినిధులతో పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. రాజధాని తరలింపుపై మీడియా ప్రతినిధులు గుచ్చిగుచ్చి ప్రశ్నించడంపై ఆయన స్పందిస్తూ వచ్చే విద్యా సంవత్సరానికి రెడీ కావాలని సూచించారు. విశాఖకు పరిపాలన రాజధానిని తరలించేందుకు త్వరలో అన్ని ప్రొసీడింగ్స్‌తో అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెడతామని తెలిపారు. దాని ప్రకారం అన్నీ జరుగుతాయన్నారు. రాజధాని కోసం విశాఖలో ఒక్క సెంటు ప్రైవేట్ భూమి కూడా తీసుకోబోమన్నారు. కర్నూలు కేంద్రంగా హైకోర్టు ఉండాలని రాయలసీమ డిక్లరేషన్‌లో ప్రకటించిన బీజేపీ ఇప్పుడెందుకు టీడీపీతో అంటకాగుతోందని నిలదీశారు. విశాఖ పరిపాలన రాజధానిగా, కర్నూలు న్యాయ రాజధానిగా, అమరావతి శాసన రాజధానిగా ఉంటుందని స్పష్టం చేశారు. మూడు రాజధానులే తమ విధానమని, అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయమని చెప్పారు. తమ ప్రభుత్వ పాలసీలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు.

ఫిబ్రవరిలో విశాఖలో పెట్టుబడుల సదస్సు

గత మూడేళ్లలో సంక్షేమంపై దృష్టి పెట్టినప్పటికీ గత ప్రభుత్వం కంటే ఎక్కువగా పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. 2024 ఎన్నికల్లో అభివృద్ధి సంక్షేమ పథకాలే రిఫరెండం కానున్నాయన్నారు. అభివృద్ధిపై టీడీపీ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. విశాఖపట్నాన్ని బీచ్ ఐటీ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని, వచ్చే ఫిబ్రవరిలో విశాఖలో పెట్టుబడుల సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దేశంలో టాప్ టెన్ నగరాల్లో ఒకటిగా నిలిచిన విశాఖకు ఎగ్జిక్యూటివ్ రాజధాని రావడం వల్ల మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. రాజధానికి కావాల్సిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంతా విశాఖలో సిద్ధంగా ఉందన్నారు. కేవలం 29 గ్రామాలకే అమరావతిలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తే సంక్షేమ పథకాలు అమలు చేయవద్దా అని ప్రశ్నించారు.

ఇంగితం లేకుండా విమర్శలా?

- పెట్రోల్, డీజిల్, గ్యాస్, ధరలు కేంద్రం పరిధిలోనే: మంత్రి కారుమూరి
- ఢిల్లీలో ప్రశ్నించకుండా ఇక్కడ బాదుడే బాదుడా?
- మిడిమిడి జ్ఞానంతో టీడీపీ నేతలు అభాసుపాలు



సాక్షి, అమరావతి: పెట్రోల్, డీజిల్, గ్యాస్, ధరలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటాయన్న కనీస ఇంగిత జ్ఞానం లేకుండా టీడీపీ ఎమ్మెల్యేలు శాసనసభలో విమర్శలకు దిగడం దారుణమని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. అది రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని అంశం కాదని, కేంద్రానికి సంబంధించిందని విపక్ష సభ్యులకు తెలుసని చెప్పారు. కేంద్రానికి సంబంధించిన అంశాలపై ఢిల్లీలో ప్రశ్నించకుండా ఇక్కడ బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించడం ఏమిటన్నారు. టీడీపీ నేతలు మిడిమిడి జ్ఞానంతో ప్రజల్లో అభాసు పాలవుతున్నారని చెప్పారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

అక్రమ నిల్వలపై దాడులు

రష్యా – ఉక్రెయిన్ యుద్ధం కారణంగా సన్‌ఫ్లవర్ ఆయిల్, మలేషియా నుంచి దిగుమతి అవుతున్న పామ్ ఆయిల్ ధరలు పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం వంట నూనెలను తక్కువ ధరకే ప్రజలకు అందచేస్తోంది. సీఎం యాప్ ద్వారా గుర్తిస్తూ అక్రమ నిల్వలపై దాడులు నిర్వహిస్తున్నాం. సీఎం జగన్ పలుమార్లు సమీక్షించి ధరలను నియంత్రించేలా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కర్ణాటక, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిశా కంటే మన రాష్ట్రంలోనే తక్కువ ధరకు నిత్యావసరాలు అందుబాటులో ఉన్నాయి. చంద్రబాబు హయాంలో నిత్యావసరాల రేట్లు పెరిగితే ఏ చర్యలు తీసుకున్నారు? పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే ఏం చేశారు? అనుభవజ్ఞుడైన చంద్రబాబు గతంలో అమ్మఒడి ఎందుకు ఇవ్వలేదు? 31 లక్షల ఇళ్ల పట్టాలు ఎందుకు ఇవ్వలేకపోయారు? రైతు భరోసా, ఆసరా పథకాలు పెట్టాలన్న ఆలోచన ఏనాడైనా చేశారా? నాడు – నేడు ద్వారా స్కూళ్లు, ఆస్పత్రులను అభివృద్ధి చేయాలనే ఆలోచన కనీసం తట్టిందా? అసలు ఒకటో తారీఖున ఠంఛనుగా పింఛన్ ఏనాడైనా చంద్రబాబు ఇచ్చారా?

వృద్ధి రేటు ప్రకారం రాష్ట్ర ర్యాంకు			
	సంవత్సరం	వృద్ధి రేటు	ర్యాంక్
	2018-19	5.36%	21
	2019-20	6.89%	6

2020-21లో (కోవిడ్ సమయంలో) వివిధ రాష్ట్రాల జీఎస్‌డీపీ వృద్ధి			
	రాష్ట్రం	వృద్ధి రేటు	ర్యాంకు
	మణిపూర్	3.19%	1
	పశ్చిమబెంగాల్	1.06%	2
	తమిళనాడు	0.14%	3
	ఆంధ్రప్రదేశ్	0.08%	4
	కర్ణాటక	-0.52%	5
	గుజరాత్	-1.35%	6

2021-22 జీడీపీ వృద్ధి రేటులో ఏపీ ఫస్ట్

రాష్ట్రం	వృద్ధి రేటు
ఆంధ్రప్రదేశ్	11.43%
రాజస్థాన్	11.04%
బీహార్	10.98%
తెలంగాణ	10.88%
ఢిల్లీ	10.23%
ఒడిశా	10.19%

చంద్రబాబు హయాంలో అప్పులు (రూ.కోట్లలో)

వివరం	విభజన సమయానికి	2019 మే నాటికి
రాష్ట్ర ప్రభుత్వ అప్పు	1,20,556.00	2,69,462.00
ప్రభుత్వ గ్యారంటీతో పీఎస్‌యూల అప్పు	14,028.23	59,257.31
మొత్తం అప్పులు	1,34,584.23	3,28,719.00

టీడీపీ కాలంలో అప్పు పెరిగిన శాతం **144.25%** | ఐదేళ్ల కాలంలో అప్పుల నగటు వార్షిక వృద్ధి రేటు **19.55%**

ప్రస్తుత ప్రభుత్వంలో అప్పులు (రూ.కోట్లలో)

వివరం	2019 మే	2022 మార్చి
రాష్ట్ర ప్రభుత్వ అప్పు	2,69,462.00	3,82,165
ప్రభుత్వ గ్యారంటీతో పీఎస్‌యూల అప్పు	59,257.31	1,17,730.33
మొత్తం అప్పులు	3,28,719	4,99,895

ప్రస్తుత ప్రభుత్వ కాలంలో అప్పు పెరిగిన శాతం **52.07%** | మూడేళ్లలో అప్పుల నగటు వార్షిక వృద్ధి రేటు **15.46%**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి భేష్

▶ మొదటి పేజీ తరువాయి



శుక్రవారం ఆయన అసెంబ్లీలో జరిగిన చర్చలో మాట్లాడారు. మెరుగైన ప్రభుత్వ పాలన, చర్యల వల్లే దేశంలోనే 2021–22 ఆర్థిక ఏడాదిలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీడీపీ) వృద్ధిలో ఏపీ అగ్రగామిగా ఉందని తెలిపారు. దుష్టచతుష్టయం పదే పదే అప్పులపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడుతూ వాస్తవ పరిస్థితిని కాగ్ గణాంకాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడిన వివరాలు ఇలా ఉన్నాయి.

శ్రీలంక అంటూ ఊహాజనిత వార్తల సృష్టి

- రాష్ట్రం అన్ని రకాలుగా బాగున్నా కూడా.. బాగో లేదని, అన్ని రకాలుగా ఇబ్బందుల్లో పడిందని, చంద్రబాబు ఆయనతో పాటు ఉన్న ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5, తోడుగా ఉన్న దత్తపుత్రుడు దుష్ప్రచారం చేస్తున్నారు. వీళ్లంతా ఒక బ్యాచ్. దోచుకో, పంచుకో, తినుకో అనే దొంగల ముఠా. వీళ్లంతా రాష్ట్రం శ్రీలంక అయిపోయిందని రకరకాల ఊహాజనిత వార్తలు ప్రజల్లో సృష్టించే కార్యక్రమం చేస్తున్నారు.
- వీళ్ల చేతుల్లో పేపర్లు, టీవీలు ఉన్నాయి. వీళ్లు రాయాలనుకున్నది రాస్తారు. చూపాలనుకున్నది చూపిస్తారు. ఒక అబద్ధాన్ని నిజం చేయడానికి వీళ్ల దగ్గరున్న పత్రికలు, టీవీల ద్వారా గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు.

గతం కన్నా బాగున్న జీడీపీ

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ప్రధాన సూచిక అయిన జీడీపీ (గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్) గమనిస్తే.. గతంలో కంటే చాలా బాగుంది. దేవుడి దయ వల్ల కోవిడ్ దాడిని కూడా మనం తట్టుకుని నిలబడ్డాం. 2018–19లో అంటే చంద్రబాబు హయాంలో రాష్ట్ర జీడీపీలో పెరుగుదల 5.36 శాతం కాగా.. మన హయాంలో 2019–20లోకి వచ్చేసరికి 6.89 శాతంతో దేశంలో 6వ స్థానానికి చేరుకుంది. గత ప్రభుత్వ హయాంలో జీడీపీ పరంగా 21వ స్థానంలో ఉన్నాం. ఈ మూడేళ్లలో మనం టాప్ మూడు రాష్ట్రాల్లో కనిపిస్తున్నాం.
- 2021–22లో ఇప్పటి దాకా కేంద్రం విడుదల చేసిన, అందుబాటులో ఉన్న గణాంకాల మేరకు రాష్ట్ర స్థూల ఉత్పత్తి 11.43 శాతం పెరుగుదలతో దేశంలోనే ఇప్పటి వరకు ప్రకటించిన రాష్ట్రాలలో మొదటి స్థానంలో ఉన్నాం. దేశ జీడీపీలో రాష్ట్ర జీడీపీ వాటాను పోల్చి చూస్తే...2014–19 మధ్య.. అంటే గత ప్రభుత్వ హయాంలో 4.45 శాతమే ఉంటే ఇప్పుడు అది మన హయాంలో 2019–22 మధ్య మూడేళ్లలోనే 5 శాతానికి పెరిగింది. గత ప్రభుత్వం కంటే మెరుగైన పనితీరు కనపర్చాం. అంటే దేశ జీడీపీలో మన వాటా పెరిగింది. ఈ లెక్కన సహజంగానే రాష్ట్ర ప్రజల తలసరి జీడీపీ కూడా పెరుగుతుంది.

కోవిడ్ విలయంలోనూ జీడీపీ పెరుగుదల

- గత రెండేళ్లుగా కోవిడ్ సృష్టించిన విలయం నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల జీడీపీ, ప్రపంచ వ్యాప్తంగా స్థూల ఉత్పత్తి తగ్గిపోవటం చూస్తున్నాం. అందుకు భిన్నంగా, దేశంలో కేవలం నాలుగు రాష్ట్రాల్లోనే జీడీపీ పడిపోకుండా పెరుగుదల నమోదైంది. ఆ నాలుగింటిలో ఏపీ ఒకటి. మణిపూర్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, ఏపీలో మాత్రమే పెరుగుదల కనిపిస్తుంది.
- ఇందుకు ముఖ్య కారణం ప్రజల కొనుగోలు శక్తి పడిపోకుండా, వస్తువులకు డిమాండ్ పడిపోకుండా కాపాడేలా మన ప్రభుత్వం అమ్మఒడి, చేయూత ,ఆసరా, సామాజిక పెన్షన్లు వంటి ఇతర కార్యక్రమాల ద్వారా పేద వర్గాలను ఆదుకోగలిగాం. నాడు–నేడు వంటి కార్యక్రమాలు, జలయజ్ఞం ద్వారా పెట్టుబడి వ్యయం (క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్) చేయగలిగాం. వీటన్నింటి వల్ల మనం మాత్రం పాజిటివ్ గ్రోత్ రేట్ నమోదు చేయగలిగాం.

అప్పుల పెరుగుదల తక్కువే

- 2014లో రాష్ట్ర విభజన నాటికి ఉన్న అప్పు రూ.1,20,556 కోట్లు అయితే.. 2019 మే నెలలో గత ప్రభుత్వం దిగిపోయే నాటికి ప్రభుత్వానికి ఉన్న అప్పు రూ.2,69,462 కోట్లు. ఇవన్నీ కాగ్ రిపోర్ట్స్ ప్రకారం. అంటే ఆ ఐదేళ్లలో రాష్ట్ర రుణం 123.52 శాతం పెరిగింది. అదే 'కాంపౌండెడ్ యాన్యువల్ గ్రోత్ రేట్' (సీఏజీఆర్) ప్రకారం చూస్తే ఆ ఐదేళ్లలో పెరిగిన రాష్ట్ర రుణం 17.45 శాతంగా కనిపిస్తోంది.
- 2019 మే నెలలో మనందరి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నాటికి ఉన్న గత ప్రభుత్వం చేసిన అప్పులు రూ.2,69,462 కోట్లు. ఈ మూడేళ్లలో, అంటే ఈ ఏడాది మార్చి నాటికి ఉన్న ప్రభుత్వ రుణం రూ.3,82,165 కోట్లు. అంటే ఈ మూడేళ్లలో పెరిగిన రాష్ట్ర రుణం 41.83 శాతం. అదే సీఏజీఆర్ ప్రకారం చూస్తే, మూడేళ్లలో పెరిగిన రాష్ట్ర అప్పులు 12.73 శాతం మాత్రమే.
- మరి ఇంతగా ఆక్రందనలు చేసే ఈనాడు, టీవీ5.. చంద్రబాబు హయాంలో చేసిన అప్పులు, మన హయాంలో చేసిన అప్పుల గురించి ఎందుకు రాయరు అన్నది ఆలోచించాలి. గత ప్రభుత్వ హయాంలో కంటే, మన ప్రభుత్వం వచ్చాక ఈ మూడేళ్లలో పెరిగిన అప్పులు చాలా తక్కువ. ఈ గణాంకాలన్నీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలో స్పష్టంగా ఉన్నాయి.

గ్యారెంటీలూ బాబు హయాంలోనే ఎక్కువ

- ప్రభుత్వ గ్యారెంటీలు కూడా గత ప్రభుత్వ హయాంలోనే ఎక్కువ. 2014లో రాష్ట్ర విభజన నాటికి ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)లు, ప్రభుత్వ గ్యారెంటీతో చేసిన రుణాలు రూ.14,028.23 కోట్లు. 2019 మే నెలలో చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయే నాటికి ప్రభుత్వ గ్యారెంటీతో చేసిన రుణాలు ఎగబాకి మొత్తం రూ.59,257.31 కోట్లు.
- దీంతో గత ప్రభుత్వం దిగిపోయే నాటికి ఉన్న మొత్తం రుణాలు రూ.3,28,719 కోట్లు. అంటే ఆ ఐదేళ్లలో పెరిగిన రుణాలు ఏకంగా 144.25 శాతం. ఇక సీఏజీఆర్ పరంగా చూస్తే ఆ ఐదేళ్లలో పెరిగిన రాష్ట్ర రుణం సాలీనా 19.55 శాతం.

గత ప్రభుత్వ హయాంలో 144 శాతం.. ఇప్పుడు 52 శాతం

- 2019 మే నెలలో మన ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నాటికి ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)లు, ప్రభుత్వ గ్యారెంటీతో చేసిన రుణాలు రూ.59,257.31 కోట్లు ఉంటే.. ఈ మూడేళ్లలో, అంటే ఈ ఏడాది మార్చి నాటికి ప్రభుత్వ గ్యారెంటీతో చేసిన రుణాల మొత్తం రూ.1,17,730.33 కోట్లు. అంటే ఈ మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ మొత్తం రుణాలు రూ.4,99,895 కోట్లు. అంటే ఈ మూడేళ్లలో పెరిగిన రాష్ట్ర రుణం 52.07 శాతం.
- అదే సగటున ఏడాదికి సీఏజీఆర్ ప్రకారం చూస్తే, మూడేళ్లలో సాలీనా పెరిగిన రాష్ట్ర అప్పు 15.46 శాతం మాత్రమే. అంటే గత ప్రభుత్వ హయాంలో 144 శాతం పెరిగితే... మన ప్రభుత్వ హయాంలో 52 శాతం పెరుగుదల. గత ప్రభుత్వం హయాంలో సాలీనా పెరుగుదల 19.55 శాతం అయితే మన ప్రభుత్వ హయాంలో 15.46 శాతం మాత్రమే.

కేంద్రంతో పోల్చి చూస్తే ఇప్పుడు మనం ఎంతో మెరుగు

- స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)తో పోలిస్తే కేంద్రం చేసిన అప్పులు (డెట్ టు జీడీపీ) పతాక స్థాయికి చేరుకున్నాయి. కోవిడ్ సమయంలో దాని ప్రభావం ఎలా పడిందో కనిపిస్తోంది. 2020-21తో పాటు, 2021-22లో డెట్ టు జీడీపీ దేశ ఆర్థిక వ్యవస్థ మీద ప్రభావం చూపే స్థాయికి చేరుకుంది. 2014–15లో స్థూల దేశీయ ఉత్పత్తి రూ.124 లక్షల కోట్లు అయితే, ఆ ఏడాది కేంద్రానికి ఉన్న అప్పులు రూ.62,42,220 కోట్లు. ఈ అప్పులు కేంద్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చి తీసుకున్న అప్పులు పరిగణనలోకి తీసుకోకుండా చెప్పినవి. అంటే డెట్ టు జీడీపీ 50.07 శాతం.
- 2020–21లో జీడీపీ రూ.198,00,913 కోట్లు కాగా, ఆ ఏడాది కేంద్రం అప్పులు రూ.120,79,018 కోట్లు. అంటే డెట్ టు జీడీపీ ఏకంగా 61 శాతానికి పెరిగింది. దేశానికే ఈ రకమైన తల్లడిల్లే పరిస్థితి వచ్చింది. ఆ తర్వాత ఏడాది 2021–22లో జీడీపీ రూ.236,64,636 కోట్లు కాగా, అప్పుల మొత్తం రూ.135,88,193 కోట్లు. అంటే డెట్ టు జీడీపీ 57.42 శాతం. ఈ విషయం బడ్జెట్ డాక్యుమెంట్లతో పాటు, గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (ఎంఓఎస్‌పీఐ) నివేదికలో స్పష్టంగా ఉంది.
- రాష్ట్ర విభజనకు ముందు నుంచి కేంద్రంతో పోలిస్తే, రాష్ట్ర రుణాల పెంపు తక్కువగానే ఉంది. రాష్ట్ర విభజనకు ముందే, అంటే 2014 మే 31 నాటికి, కేంద్రానికి ఉన్న రుణాలు రూ.59,09,965.48 కోట్లు. 2019 మే 31 నాటికి ఆ రుణం రూ.94,49,372.03 కోట్లకు చేరింది. అంటే ఐదేళ్లలో కేంద్రం అప్పులు 59.88% పెరిగాయి. 'కాంపౌండెడ్ యాన్యువల్ గ్రోత్ రేట్' (సీఏజీఆర్) ప్రకారం చూస్తే ఆ ఐదేళ్లలో పెరిగిన కేంద్ర రుణం 9.84 శాతం.
- కేంద్రంతో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వం చాలా తక్కువ అప్పు (కరోనా సమస్యను ఎదుర్కొంటూనే) చేసింది. అదే చంద్రబాబు హయాంలో చూస్తే అప్పటి కేంద్ర ప్రభుత్వం కన్నా ఎక్కువ అప్పులు చేసింది. పైగా బాబు హయాంలో కరోనా కూడా లేదు. ఈ పరిస్థితిలో ఎవరి హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడి తప్పి.. దోచుకో, పంచుకో, తినుకో అని దోచేశారో ప్రజలకు తెలియాల్సి ఉంది. ఇవన్నీ స్పష్టంగా కనిపిస్తున్నా ఎల్లో మీడియా, చంద్రబాబు పనికట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారు.

డిప్యూటీ స్పీకర్ అభ్యర్థిగా కోలగట్ల నామినేషన్

- ఆయన నామినేషన్ ఒక్కటే దాఖలు
- ఎన్నిక లాంఛనమే...

సాక్షి, అమరావతి: శాసనసభ డిప్యూటీ స్పీకర్ పదవికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన అసెంబ్లీ కార్యదర్శి పి.బాలకృష్ణమాచార్యులకు ఆయన నామినేషన్ పత్రాలను అందజేశారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో కోలగట్ల వెంట బీసీ సంక్షేమం, పౌర సంబంధాల శాఖ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, చీఫ్‌విప్ ముదునూరి ప్రసాద రాజు, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, పుష్పశ్రీ వాణి, శంబంగి చిన్నప్పలనాయుడు తదితరులున్నారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం కోలగట్ల స్పీకర్ తమ్మినేని సీతారాంను మర్యాదపూర్వకంగా కలిశారు. గడువు ముగిసే సమయానికి కోలగట్ల మినహా ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. ఈ నేపథ్యంలో కోలగట్ల వీరభద్రస్వామి డిప్యూటీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు స్పీకర్ తమ్మినేని సోమవారం లాంఛనంగా ప్రకటించనున్నారు. డిప్యూటీ స్పీకర్ పదవికి కోన రఘుపతి గురువారం రాజీనామా చేయడంతో ఆ పదవికి ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శాసనసభలో శుక్రవారం స్పీకర్ ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలవరకు నామినేషన్లు దాఖలు చేయడానికి గడువుగా తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు శాసనసభలో ఎన్నిక నిర్వహిస్తామని ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.






నవరాత్రోత్సవాలకు సీఎం జగన్‌కు ఆహ్వానం

దుర్గాదేవి శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించాల్సిందిగా విజయవాడ దుర్గగుడి అధికారులు సీఎం వైఎస్‌ జగన్‌ను శుక్రవారం ఆహ్వానించారు. అలాగే, శ్రీశైలంలో ఈ నెల 26 నుంచి జరగనున్న దసరా నవరాత్రోత్సవాలకు కూడా సీఎంను ఆహ్వానించారు. శుక్రవారం శాసనసభలోని సీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి (దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి) కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇరు ఆలయాల ఈవోలు, స్థానిక ఎమ్మెల్యేలు, వేద పండితులు, దేవదాయ శాఖ కమిషనర్‌ హరిజవహర్‌లాల్‌ తదితరులు సీఎం జగన్‌ను కలిసి ఆహ్వానపత్రికలను, ప్రసాదాలను, స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలను అందజేశారు. -సాక్షి,అమరావతి/శ్రీశైలం టెంపుల్‌

● ఒక ప్రాంతం అభివృద్ధి కన్నా.. అన్ని ప్రాంతాల అభివృద్ధి మిన్న



నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు



''ఒక రాజధాని వద్దు మూడు రాజధానులు ముద్దు.. 29 గ్రామాల మనమే బాగుపడదామా, 26 జిల్లాల అభివృద్ధితో తెలుగు జాతిని నిడబెడదామా.. మా దగ్గర అసెంబ్లీ, ఉత్తరాంధ్రకు సచివాలయం, రాయలసీమకు హైకోర్టు అని మనమే స్వాగతిస్తే అది కూడా నిజమైన త్యాగమే. దీనివల్ల మన ప్రాంతం మీద గౌరవం కూడా పెరుగుతుంది. దయచేసి ఆలోచించండి'' అంటూ అమరావతి ప్రాంత రైతులను ఉద్దేశించి బాపట్ల జిల్లా నగరంలో ఫ్లెక్సీలు వెలిశాయి. అమరావతి రైతులు చేపట్టిన పాదయాత్ర శనివారం నగరం మండలం చేరుకోనున్న నేపథ్యంలో స్థానిక ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య ఈ ఫ్లెక్సీలను నగరం, బొరమాదిగపల్లి, బెల్లంవారిపాలెం, ఏలేటిపాలెం, చిరకాలవారిపాలెం, సజ్జావారిపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేశారు. -నగరం (రేపల్లె)

క్లుప్తంగా

ఉద్యోగులపై క్రమశిక్షణ కేసులను వెంటనే పరిష్కరించాలి

సీఎస్‌ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులపై గల క్రమశిక్షణ కేసుల విచారణలో తీవ్ర జాప్యం జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. కొన్ని కేసుల్లో విచారణ చాలాకాలంగా పెండింగ్‌లో ఉండటంతో ఈలోగా సంబంధిత ఉద్యోగులు పదవీవిరమణ కూడా చేస్తున్నారని, దీంతో తప్పుచేసిన ఉద్యోగులు కూడా ఎలాంటి చర్యల్లేకుండా తప్పించుకుంటున్నారని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. ఈ నేపథ్యంలో ఉద్యోగులపైగల సాధారణ క్రమశిక్షణ కేసులను వెంటనే విచారణ ప్రారంభించి మూడునెలల్లో, సంక్షిప్త క్రమశిక్షణ కేసుల విచారణను ఐదారు నెలల్లోగా పూర్తిచేయాలని ప్రభుత్వం పేర్కొంది. నిర్దేశించిన సమయంలో క్రమశిక్షణ కేసులు విచారణ పూర్తిచేస్తున్నారా లేదా అనే విషయాన్ని సంబంధిత కార్యదర్శులు సమీక్షలు చేయాలని ఆదేశించింది. గడువులోగా విచారణ పూర్తికాని క్రమశిక్షణ కేసుల వివరాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ముఖ్యమంత్రికి నోట్‌ సమర్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ సమీర్‌శర్మ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

రాష్ట్రంలో మూడు పార్టీల గుర్తింపు రద్దు

సాక్షి, అమరావతి: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రం నుంచి నమోదైన మూడు రాజకీయ పార్టీల గుర్తింపు రద్దు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్‌ మీనా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నమోదైన భారతదేశం పార్టీ, ఇండియన్స్‌ ఫ్రంట్‌, జాతీయ తెలుగు అభివృద్ధి సేవా సమూహం పార్టీలను గుర్తింపు పొందిన పార్టీల జాబితా నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే 30 రోజుల్లోపు తగిన ధ్రువీకరణపత్రాలతో కేంద్ర ఎన్నికల సంఘాన్ని సంప్రదించాలని సూచించారు.

'నిమ్మల' వినతిపై ఉత్తర్వులివ్వండి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తదితరులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: తన నియోజకవర్గంలో కరోనా కట్టడికి చర్యలు తీసుకోవడంలో విఫలమైన, ప్రొటోకాల్‌ ఉల్లంఘనలకు పాల్పడిన అధికారులపై చర్యలు చేపట్టేలా ఉన్నతాధికారులను ఆదేశించాలన్న అభ్యర్థనతో పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సమర్పించిన వినతిపత్రంపై హైకోర్టు స్పందించింది. దానిపై తగిన నిర్ణయం వెలువరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి తదితరులను ఆదేశించింది. ఆ నిర్ణయాన్ని రామానాయుడుకు తెలియజేయాలని అధికారులకు సూచించింది. తదుపరి విచారణను అక్టోబర్‌ 10కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్‌ దొనడి రమేశ్‌ ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు.

వరద తగ్గుముఖం

సాక్షి, అమరావతి/శ్రీశైలంటెంపుల్‌/విజయపురిసౌత్‌/సత్రశాల/పోలవరంరూరల్‌/ధవళేశ్వరం: పరీవాహక ప్రాంతాల్లో (బేసిన్‌లో) వర్షాలు తగ్గడంతో కృష్ణా, గోదావరి నదుల్లో వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం ప్రాజెక్టు లోకి 3,10,689 క్యూసెక్కుల వరద చేరు తోంది. స్పిల్‌వే పదిగేట్లను ఎత్తి, విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా 3,68,337 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. నాగార్జున సాగర్‌లోకి 3,10,764 క్యూసెక్కులు చేరుతుండగా.. స్పిల్‌వే 18 గేట్లు, విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 2,98,464 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. పులిచింతలలోకి 3,09,127 క్యూసెక్కులు చేరుతుండగా అదే రీతిలో దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్‌లోకి 3,18,519 క్యూసెక్కులు చేరుతుండగా.. 3,04,500 క్యూసెక్కులను సముద్రంలోకి వదులుతున్నారు. గోదావరిలో పోలవరం ప్రాజెక్టుకు వచ్చిన వరదను వచ్చినట్టుగా వదిలేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్‌ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. బ్యారేజ్‌ నుంచి 9,91,879 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు.

గ్రామకంఠం ఆక్రమణలు ఖాళీ చేయాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

యాజమాన్య హక్కులు సంక్రమించవని పేర్కొంది. గ్రామ కంఠం భూముల ఆక్రమణల విషయంలో వివిధ సందర్భాల్లో ప్రభుత్వం జారీ చేసిన జీవోలుంటే వాటన్నింటినీ తమ ముందుంచాలని జెడ్పీపీ, ఎంపీపీ, గ్రామ పంచాయతీల తరఫు న్యాయవాది ఐ.కోటిరెడ్డిని ఆదేశించింది. వాటి ఆధారంగా గ్రామ కంఠాల భూముల్లో ఆక్రమణల తొలగింపుపై సమగ్ర ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపింది. ఏలూరు జిల్లా కలిదిండి మండలం పెదలంక గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ కంఠం భూముల్లో ఉంటున్న వారిని ఖాళీ చేయించే విషయంలో జారీ చేసిన నోటీసులకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని పంచాయతీరాజ్‌, రెవిన్యూ శాఖ అధికారులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్‌ 17కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్‌ ప్రశాంత్‌ కుమార్‌ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్‌ డీవీఎస్‌ఎస్‌ సోమయాజులతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. చాలాచోట్ల భూముల ఆక్రమణలకు అధికారుల తీరే కారణమవుతోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆక్రమించుకున్న భూములని తెలిసి కూడా అందులో చేపట్టిన నిర్మాణాలకు ఇంటి నెంబర్లు, కరెంట్‌ కనెక్షన్లు ఇవ్వడం, ఇంటి పన్ను వసూలు చేస్తున్నారని, దీంతో ఆక్రమణదారులు వీటన్నింటినీ చూపుతూ యాజమాన్య హక్కులు కోరుతున్నారని పేర్కొంది. ఇంటి పన్ను చెల్లించినంత మాత్రాన ఆ ఇంటిపై యాజమాన్య హక్కులు కలగవని ధర్మాసనం స్పష్టం చేసింది.

అంత మాత్రాన యాజమాన్య హక్కులు సంక్రమించవు...

ఏలూరు జిల్లా పెదలంక పరిధిలోని ఆర్‌ఎస్‌ నెంబర్‌ 445 భూముల్లో ఉంటున్న తమను ఖాళీ చేయించేందుకు అధికారులు జారీ చేసిన నోటీసులను సవాలు చేస్తూ గ్రామానికి చెందిన కుడిపూడి చంద్రరావు మరో 26 మంది హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్‌ తరఫు న్యాయవాది ఎం.విద్యావతి వాదనలు వినిపిస్తూ 30–40 ఏళ్లుగా ఆ భూముల్లో ఉంటున్నారని తెలిపారు. అవి గ్రామ కంఠం భూములని, ప్రభుత్వ భూములు కాదన్నారు. వారికి ఆ భూములే జీవనాధారమన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఏళ్ల తరబడి స్వాధీనంలో ఉన్నంత మాత్రాన గ్రామ కంఠం భూములపై ఆక్రమణదారులకు యాజమాన్య హక్కులు సంక్రమించవని, వాటిని ఖాళీ చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ భూముల నుంచి పిటిషనర్లను ఖాళీ చేయించవద్దని అధికారులను ఆదేశిస్తూ సింగిల్‌ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయం ధర్మాసనం దృష్టికి రావడంతో ఇలా ఆదేశాలిస్తుండటం వల్లే ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలవుతున్నాయని వ్యాఖ్యానించింది. ఈ కేసులో కౌంటర్లు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణను అక్టోబర్‌ 17కి వాయిదా వేసింది.

పశువుల దొడ్డి భూమిలో నిర్మాణాలా..?

గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పాలడుగు గ్రామంలో పశువుల దొడ్డి కోసం ఉద్దేశించిన గ్రామ కంఠం భూములను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారంటూ ఆ గ్రామానికి చెందిన గుంటుపల్లి రామారావు 2019లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్‌) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై కూడా సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పశువుల దొడ్డి కోసం ఉద్దేశించిన భూముల్లో నిర్మాణాలు చేపట్టడంపై ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. ఆ భూముల నుంచి ఆక్రమణదారులను ఖాళీ చేయించాలని, ముందుగా నోటీసులు జారీ చేసి వివరణ తీసుకున్న తరువాత తగిన ఆదేశాలు జారీ చేయాలని అధికారులను ఆదేశించింది.



మూడు రాజధానులకు జేజేలు

మూడు రాజధానుల ప్రతిపాదనకు విశాఖ వాసులు జేజేలు పలికారు. దుర్గాలమ్మ జంక్షన్‌ వద్ద పూర్ణామార్కెట్‌ వాసులు ప్లకార్డులు చేతబట్టి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. 35వ వార్డు కార్పొరేటర్‌ విల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. - సాక్షి, విశాఖపట్నం

తుంగభద్ర డ్యామ్‌కు భారీ వరద

▶ మొదటి పేజీ తరువాయి

అంటే మే 31 నాటికి డ్యామ్‌లో 37.63 టీఎంసీల నీరు ఉంది).. ఆయకట్టుకు నీళ్లందిస్తూ, దిగువకు 390 టీఎంసీల మేర విడుదల చేశారు. తుంగభద్ర డ్యామ్‌లోకి సహజసిద్ధ ప్రవాహం డిసెంబర్‌ వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో డ్యామ్‌లో ఈ ఏడాది బచావత్‌ ట్రిబ్యునల్‌ అంచనా వేసిన మేరకు 230 టీఎంసీల లభ్యత ఉంటుందని, మూడు రాష్ట్రాలకు వాటా మేరకు నీటిని సరఫరా చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయని తుంగభద్ర బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు.

నీటి లభ్యతపై ఆనందోత్సాహాలు

తుంగభద్ర డ్యామ్‌లో 230 టీఎంసీల లభ్యత ఉంటుందని అంచనా వేసిన బచావత్‌ ట్రిబ్యునల్‌ ఆంధ్రప్రదేశ్‌కు72 (హెచ్చెల్సీ 32.5, ఎల్లెల్సీ 29.5, కేసీ కెనాల్‌కు అసిస్టెన్స్‌), తెలంగాణకు 6.51 (ఆర్డీఎస్‌కు అసిస్టెన్స్‌), కర్ణాటకకు 151.49 టీఎంసీలను పంపిణీ చేసింది. 1980లో మాత్రమే బచావత్‌ ట్రిబ్యునల్‌ కేటాయించిన దానికంటే 1.383 టీఎంసీలు అధికంగా అంటే 231.383 టీఎంసీలను తుంగభద్ర డ్యామ్‌ ద్వారా మూడు రాష్ట్రాలు వినియోగించుకున్నాయి. డ్యామ్‌లో పూడిక పేరుకుపోతుండటంవల్ల నిల్వ సామర్థ్యం తగ్గడంతో.. నీటిలభ్యత ఆధారంగా దామాషా పద్ధతిలో మూడు రాష్ట్రాలకు తుంగభద్ర బోర్డు వాటా జలాలను పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది 1980 తరహాలోనే నీటిలభ్యత ఉంటుందని తుంగభద్ర బోర్డు వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీనిపై మూడు రాష్ట్రాల ఆయకట్టు రైతులు ఆనందోత్సాహాలను వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర డ్యామ్‌పై నేరుగా ఆధారపడి ఆంధ్రప్రదేశ్‌లో ఎల్లెల్సీ (దిగువ కాలువ) 1,57,062, హెచ్చెల్సీ (ఎగువ కాలువ) 2,84,992.. కర్ణాటకలో 8,96,456.. కలిపి 13,38,510 ఎకరాల ఆయకట్టు ఉంది. డ్యామ్‌ దిగువన రాయబసవన చానల్స్‌, విజయనగర చానల్స్‌ కింద కర్ణాటకలో 30,368, ఆంధ్రప్రదేశ్‌లో కేసీ కెనాల్‌ కింద 2,78,000, తెలంగాణలో ఆర్డీఎస్‌ కింద 87,000.. కలిపి 3,95,368 ఎకరాల ఆయకట్టు ఉంది. అంటే.. డ్యామ్‌పై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన 17,33,878 ఎకరాల ఆయకట్టు ఈ ఏడాది సస్యశ్యామలం కానుంది.

నలుగురిని మింగిన ఊటబావి

- పూడిక తీస్తూ ఊపిరాడక ఆగిన గుండెలు
- కృష్ణాజిల్లా బంటుమిల్లిలో విషాదం
- మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి జోగి రమేష్‌



ప్రాణాలు తీసిన బావి. (ఇన్‌సెట్‌లో) బాధితుల్ని పరామర్శిస్తున్న మంత్రి రమేష్‌

బంటుమిల్లి: ఊటబావి నాలుగు నిండుప్రాణాలను బలితీసుకుంది. పూడిక తీసేందుకు బావిలో దిగినవారు ఒకరి తర్వాత మరొకరు ఊపిరి ఆడక ప్రాణాలు విడిచారు. ఈ విషాద ఘటన కృష్ణా జిల్లా బంటుమిల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. బంటుమిల్లి గ్రామానికి చెందిన కొండా నాగేశ్వరరావు అడితి (కర్రలు) వ్యాపారి. తన నివాసం వద్ద ఉన్న ఊటబావి పూడిక తీయడానికి తన కుమారుడు కొండా రంగా(35) ద్వారా గ్రామంలోని బీఎస్‌ఆర్‌ కాలనీకి చెందిన కూలీ వంజల రామారావు (60)తో ఒప్పందం కుదుర్చుకున్నారు. రామారావు తనకు సహాయంగా కుమారుడు వంజల లక్ష్మణ్‌(35), శ్రీనివాసరావు(53)ను తీసుకుని వచ్చాడు. పూడిక తీసేందుకు శుక్రవారం మధ్యాహ్నం బావిలోకి దిగారు. ముందుగా శ్రీనివాసరావు దిగి నాలుగు బకెట్ల మట్టిని తోడాక ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరయ్యాడు. అతను కేకలు వేయగా.. రామారావు, లక్ష్మణ్‌ తాడువేసి పైకి లాగే ప్రయత్నం చేశారు. అయితే, శ్రీనివాసరావుకు ఆక్సిజన్‌ అందకపోవడంతో పట్టుకున్న తాడును వదిలి బావిలో పడిపోయాడు. ఆ వెంటనే రామారావు బావిలోకి దిగి ఊబిలో పడిపోయాడు. తన తండ్రి పడిపోయాడని తెలుసుకున్న లక్ష్మణ్‌ హడావుడిగా వచ్చి బావిలోకి దిగి ఇరుక్కుపోయాడు. ముగ్గురు ప్రమాదంలో చిక్కుకున్నారని రక్షించేందుకు రంగా బావిలోకి దిగాడు. ఒకరి కోసం మరొకరు బావిలోకి దిగి ఊపిరాడక నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

బంటుమిల్లిలో విషాదం..

ఊటబావిలో ఊపిరి ఆడక మృతి చెందిన నలుగురి మృతదేహాలను గ్రామస్తులు అతికష్టంపై వెలికి తీశారు. అప్పటి వరకు మాట్లాడుతున్న వారు కళ్ల ఎదుటే మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుల భార్యలు, పిల్లల ఆర్తనాదాలు చూసి స్థానికులు చలించిపోయారు. మృతిచెందిన వారిలో రంగాకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు, లక్ష్మణ్‌కు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఏమైందో తెలియని పసిపిల్లలు తమ తండ్రుల మృతదేహాలను చూపిస్తూ 'అమ్మా... నాన్న..' అంటూ కన్నీరు పెట్టుకోవడం అందరినీ కలచివేసింది. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే జోగి రమేష్‌ హుటాహుటిన బంటుమిల్లికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

విలీనం.. విమోచనం.. సమైక్యత!

▶ మొదటి పేజీ తరువాయి

విమోచనం కలిగించారని బీజేపీ పేర్కొంటోంది. విలీనం, విమోచనం కాకుండా టీఆర్‌ఎస్‌ దీన్ని తెలంగాణ జాతీయ సమైక్యతా దినంగా ప్రకటించింది. ఎంఐఎం కూడా సమైక్యతా దినోత్సవంగా పరిగణించాలని కోరింది. వామపక్షాలు దీన్ని విలీనంగా భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం తెలంగాణలో ఆయా పార్టీలు నిర్వహించే కార్యక్రమాలు ఇలా ఉన్నాయి.

- విమోచన దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం పరేడ్‌ గ్రౌండ్స్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సాయుధ బలగాల గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. హైదరాబాద్‌ సంస్థానంలో భాగంగా ఉన్న కర్నాటక, మహారాష్ట్రలోని ప్రాంతాలు కూడా విమోచనం పొందినందున ఆయా రాష్ట్రాల సీఎంలు పాల్గొంటున్నారు.
- టీఆర్‌ఎస్‌ ప్రభుత్వం తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలను నిర్వహిస్తోంది. ఉదయం పబ్లిక్‌గార్డెన్స్‌లో సీఎం కేసీఆర్‌ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. మధ్యాహ్నం నెక్లెస్‌రోడ్డు నుంచి ఎన్టీఆర్‌ గ్రౌండ్స్‌ వరకు ర్యాలీ నిర్వహిస్తారు. అక్కడ బహిరంగ సభలో ప్రసంగిస్తారు.
- కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ తల్లి నమూనాను కూడా ఆవిష్కరించనున్నారు.
- వామ పక్ష పార్టీలు ర్యాలీలు నిర్వహించనున్నాయి.
- ఎంఐఎం ఆధ్వర్యంలో పాతబస్తీలో బహిరంగ సభ నిర్వహించనున్నారు.

పర్యావరణహిత సాగుకు ఏపీ అనుకూలం

- రాష్ట్రంలో పర్యటించిన ఐఏఆర్‌ఐ, గ్రో ఇండిగో బృందాలు
- పొలంబడి క్షేత్రాల పరిశీలన.. వ్యవసాయశాఖ అధికారులతో భేటీ

సాక్షి, అమరావతి: పర్యావరణంలో కర్బన ఉద్గారాల నియంత్రణ సాగు(కార్బన్‌ ఫార్మింగ్‌)కు ఆంధ్రప్రదేశ్‌ అనువైనదని భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐఏఆర్‌ఐ) ప్రిన్సిపల్‌ సెక్రటరీ డాక్టర్‌ వినయ్‌ సెహగల్‌, గ్రో–ఇండిగో సంస్థ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ ఉషా బెర్వాలే జెప్రో, సంస్థ ముంబై హెడ్‌ ఉమాంగ్‌ అగర్వాల్‌ పేర్కొన్నారు. ఏపీలో కార్బన్‌ ఫార్మింగ్‌ సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసేందుకు శుక్రవారం ఈ బృందం గుంటూరు జిల్లాలోని ఇప్పటం గ్రామంలో పర్యటించింది. పొలంబడి క్షేత్రాలను పరిశీలించింది. రైతులతో సమావేశమై వారు పాటిస్తున్న ఉత్తమ యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకుంది. అనంతరం సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్‌ సీఎస్‌ పూనం మాలకొండయ్యతో పాటు వ్యవసాయ, ఉద్యాన శాఖ కమిషనర్లు చేవూరు హరికిరణ్‌, ఎస్‌ఎస్‌ శ్రీధర్‌, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ గెడ్డం శేఖర్‌బాబులతో ఆ బృందం భేటీ అయ్యింది. ఏపీలో పెద్దఎత్తున ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేలా రైతులను ప్రోత్సహిస్తున్నామని ఈ సందర్భంగా వారికి పూనం మాలకొండయ్య తెలిపారు. డాక్టర్‌ వినయ్‌ సెహగల్‌, ఉషా బెర్వాలే జెప్రో మాట్లాడుతూ.. ఈ కార్బన్‌ ఫార్మింగ్‌ ప్రస్తుతం పంజాబ్‌, హరియాణ రాష్ట్రాల్లో 10 వేల ఎకరాల్లో పైలెట్‌ ప్రాజెక్టుగా గ్రో ఇండియా అమలు చేస్తోందన్నారు. 2026 నాటికి దేశ వ్యాప్తంగా 42 లక్షల ఎకరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వ్యవసాయపరంగా చూస్తే వెదజల్లు సాగు, గొర్రు, డ్రమ్‌ సీడర్‌, శ్రీవరి సాగు తదితర పద్ధతులతో గాలిలో కర్బన ఉద్గారాలను తక్కువగా విడుదల చేయ వచ్చునన్నారు. గాలిలో విడుదల చేసే కార్బన్‌ గ్యాస్‌లను వీసీఎస్‌(వెరిఫైడ్‌ కార్బన్‌ స్టాండర్డ్స్‌) ప్రకారం లెక్కగట్టి రాబోయే కాలంలో రైతులకు ఆమేరకు ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అధికారంలో అన్ని వర్గాల భాగస్వామ్యం ఉండాలి

- అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుంది
- ఏ ఒక్క కులం చేతిలోనో అధికారం ఉండకూడదు
- నా జీవితం బడుగు, బలహీనవర్గాల సేవకు అంకితం
- కులాలవారీ జనగణన జరగాలి.. దాని ఆధారంగా రిజర్వేషన్లు ఉండాలి
- 5 శాతం ఉన్న అగ్రవర్ణాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్‌ కోటా అశాస్త్రీయం
- జస్టిస్‌ వి.ఈశ్వరయ్య



జస్టిస్‌ ఈశ్వరయ్యను సన్మానిస్తున్న మంత్రులు బొత్స సత్యనారాయణ, సురేష్‌

సాక్షి, అమరావతి: అధికారంలో అన్ని కులాలు, వర్గాలకు భాగస్వామ్యం ఉండాలని, అప్పుడే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని, అందరికీ న్యాయం జరుగుతుందని రాష్ట్ర ఉన్నత విద్యా నియంత్రణ పర్యవేక్షణ కమిషన్‌ చైర్మన్‌ జస్టిస్‌ వి.ఈశ్వరయ్య చెప్పారు. ఏ ఒక్క కులం లేదా వర్గం చేతిలో అధికారం ఉండటం మంచిది కాదన్నారు. చైర్మన్‌గా మూడేళ్ల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా జస్టిస్‌ ఈశ్వరయ్యకు శుక్రవారం కమిషన్‌ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవితాన్ని బడుగు, బలహీనవర్గాల సేవకు అంకితం చేస్తున్నానని, వారి హక్కుల సాధనకు పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. దేశంలో కులాలవారీగా సమగ్ర జనగణన జరగాలని, దాని ఆధారంగా ఆయా వర్గాలకు తగినట్లుగా రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. 10 శాతం ఈడబ్ల్యూఎస్‌ కోటాను 5 శాతంగా ఉన్న అగ్రవర్ణాలకే కేటాయించడం అశాస్త్రీయమని, దీనిపై పోరాటం చేస్తున్నానని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వేల కోట్లు ఖర్చు చేసి విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేస్తున్నారని, దేశంలో ఏ రాష్ట్రమూ ఏపీకి సాటిరాదని అన్నారు. ఇంగ్లిష్‌ మాధ్యమం ద్వారానే ఎస్సీ, ఎస్టీ, బీసీల పురోగతి సాధ్యమవుతుందని, ఆ దిశగా ప్రభుత్వ కృషి అమోఘమని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో విద్య పూర్తిగా వ్యాపారమయంగా మారిందన్నారు. విద్యా సంస్థలను తమ కమిషన్‌ నియంత్రించి, ఫీజులను క్రమబద్ధం చేసిందని వివరించారు. ఈనాడు దినపత్రికకు, రామోజీరావుకు సమాజం పట్ల ఎలాంటి నిబద్ధత లేదని విమర్శించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పూర్తిగా వ్యతిరేకమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారు న్యాయమూర్తులుగా పనికిరారంటూ సుప్రీం కోర్టుకు చంద్రబాబు లేఖ రాశారన్నారు. విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కునారిల్లిన విద్యా వ్యవస్థను కమిషన్‌ చైర్మన్‌గా జస్టిస్‌ ఈశ్వరయ్య గాడిలో పెట్టారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్‌ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌, ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ ప్రొఫెసర్‌ కె.హేమచంద్రారెడ్డి, ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జానకిరాం రెడ్డి, హైకోర్టులో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది కాసా జగన్‌మోహన్‌రెడ్డి, కమిషన్‌ సభ్య కార్యదర్శి, సీఈవో డాక్టర్‌ ఎస్‌.రాజశేఖరరెడ్డి, కమిషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

"నకల భూతముల యందు సమదృష్టి కలిగినవాడు,
అన్ని భూతములు తన యందునూ, తనను అన్ని
భూతముల యందునూ చూచుచుండును.
– భగవద్గీత

సాక్షి

శనివారం, సెప్టెంబర్, 17

నిష్క్రమించిన దిగ్గజం

బరిలోకి దిగిన ప్రతిసారీ ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తూ వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేసిన టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ ఆటకు వీడ్కోలు పలకబోతున్నట్టు చేసిన ప్రకటన ప్రపంచ వ్యాప్తంగా ఉన్న టెన్నిస్ అభిమానులను దిగ్భ్రాంతి పరిచింది. వచ్చేవారం లండన్‌లో జరిగే లేవర్ కప్‌తో ఇక గ్రౌండ్‌నుంచి నిష్క్రమించబోతున్నానని ఆ ప్రకటన సారాంశం. నిజానికి ఇది ఊహించని పరిణామ మేమీ కాదు. ఆయన రేపో, మాపో ఆటకు గుడ్‌బై చెబుతాడని మూడు నాలుగేళ్లుగా ఊహాగానాలు వెలువడుతున్నాయి. అభిమానులను కలవరపెడుతూనే ఉన్నాయి. వింబుల్డన్, ఆస్ట్రేలియన్ ఓపెన్, యూఎస్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్‌లలో ఫెదరర్‌కు గాయాలూ, శస్త్ర చికిత్సలూ రివాజయ్యాయి. పర్యవసానంగా అప్పుడప్పుడు ఆటకు విరామం ప్రకటించక తప్పలేదు. వాస్తవానికి నిరుడు జూలైకి ముందు 14 నెలలుగా అతను ఆడింది లేదు. ఆ నెలలో జరిగిన వింబుల్డన్ క్వార్టర్స్‌లో దారుణమైన ఓటమి చవిచూశాడు. అందుకే ఫెదరర్ ఏం చెబుతాడోనన్న సందేహం అభిమానులను నిత్యం వేధించేది. అలాగని టెన్నిస్‌లో అతనేమీ అత్యున్నత స్థానాన్ని అధిరోహించిన మేటి ఆటగాడు కాదు. టెన్నిస్ దిగ్గజ త్రయంలో ఫెదరర్‌తోపాటున్న రాఫెల్ నాదల్, జోకోవిచ్‌లిద్దరూ గ్రాండ్ స్లామ్ సింగిల్స్ టైటిల్ రేస్‌లో అతన్నెప్పుడో అధిగమించారు. ఆ త్రయంలో అతనిది మూడో స్థానమే. కానీ ఎప్పుడూ అంకెలే వీక్షకుల్ని చకితుల్ని చేయలేవు. తన ఆటకు సృజనాత్మకతను జోడించడం, అందరూ కొట్టే షాట్లే అయినా ప్రతిసారీ తన ప్రత్యేకతను ప్రదర్శించడం, చురుకైన తన కదలికలతో వీక్షకుల్ని కట్టిపడేయడం ఫెదరర్‌కే సాధ్యం. ఆ కదలికల్లో ఒక్కటైనా అనవసరమైనది కనబడదు. తనవైపు దూసుకొచ్చిన బంతిని ప్రత్యర్థి అంచనాకు అందని రీతిలో కొట్టి వారితో తప్పులు చేయించడం, పాయింట్ సాధించడం అతనికి అలవోకగా అబ్బిన విద్య. బ్యాక్‌హ్యాండ్, ఫోర్‌హ్యాండ్ షాట్లు రెండింటికీ అతనే కేరాఫ్ అడ్రస్. ఫుట్‌వర్క్, అటాకింగ్ గేమ్ అతనికే సొంతం. ఒక్కోసారి కొన్ని షాట్లు విఫలం కావొచ్చుగాక... గెలుపోటములతో నిమిత్తం లేకుండా అవి మళ్లీ మళ్లీ నెమరేసుకునే దృశ్యాలుగానే ఎప్పటికీ మిగిలాయి. అందుకే ఆటలో ప్రత్యేక ప్రతిభ తన సొంతమని అతను చేసిన ప్రకటన ఎవరికీ అతిశయోక్తి అనిపించలేదు. 2002లోనే అతను టాప్–50 ర్యాంకింగ్స్‌లోకి ప్రవేశించాడు. ఈ ఏడాది జూన్ వరకూ చెక్కు చెదరకుండా అక్కడే నిలిచాడు. పురుషుల టెన్నిస్‌లో 2004లో నంబర్ వన్ ప్లేయర్ అయ్యాడు. 2008 వరకూ నిరంతరాయంగా కొనసాగాడు. అనేకసార్లు మళ్లీ ఆ స్థానాన్ని దక్కించుకున్నాడు.

ఎంచుకున్న రంగంలో ఏకాగ్రతతో పనిచేయడం, ఎదురయ్యే అవరోధాలను అధిగమించేందుకు ఎప్పటికీ ప్రయత్నిస్తూనే ఉండటం ఫెదరర్ ఆటలో కనబడుతుంది. ఈ లక్షణమే అతన్ని ఇప్పటికీ యోధుడిగా నిలిపింది. ఓడిన సందర్భాల్లో సైతం క్రీడాభిమానులు అతనికి నీరాజనాలు పట్టేలా చేసింది. 41 ఏళ్ల వయసంటే... దాదాపు రెండున్నర దశాబ్దాల అనుభవమంటే... 1,500కు మించిన మ్యాచ్‌లంటే ఏ క్రీడాకారుడికైనా నిష్క్రమించక తప్పని సమయమని చెప్పాలి. ఎందుకంటే ఎప్పటికప్పుడు సరికొత్త తారలు దూసుకొస్తుంటాయి. ఆటను కొత్తపుంతలు తొక్కిస్తుంటాయి. నాదల్, జోకోవిచ్‌ల సంగతలా ఉంచి హ్యూబర్ట్ హుర్కజ్‌లాంటి సరికొత్త మెరుపు ముందు ఫెదరర్ తలవంచక తప్పని సందర్భమూ వచ్చింది. అందుకే కావొచ్చు... తన శరీర సామర్థ్యంపై మదింపు వేసుకున్నాడు. తన పరిమితులేమిటో తెలుసుకున్నాడు.

ఫెదరర్ వదిలిపోతున్న వారసత్వం అత్యుత్తమమైనది. ఒక ఆటగాడు వ్యక్తిగా ఎలా ఉండాలో, ఎలాంటి ప్రమాణాలు పాటించాలో తన సద్వర్తన ద్వారా అతను చూపాడు. ఓటమి ఎదురైతే ప్రత్యర్థులపై నిప్పులు కక్కడం ఏ ఆటలోనైనా ఇప్పుడు రివాజు. గెలుపు సాధించినవారు విర్రవీగుతున్న ఉదంతాలూ లేకపోలేదు. ఇక టెన్నిస్‌లో ఓటమి ఎదురైతే సహనం కోల్పోయి రాకెట్లు విరగ్గొడుతున్నవారూ ఉంటున్నారు. ఎన్నడో కెరీర్ మొదట్లో ఫెదరర్ కూడా సహనం కోల్పోయిన సందర్భాలున్నాయి. కానీ అతి త్వరలోనే తన ప్రవర్తన మార్చుకున్నాడు. ప్రశాంతంగా, ఏకాగ్రతతో ఆడితే సత్ఫలితం సాధించడం సాధ్యమేనని తెలుసుకున్నాడు. సేవా కార్యక్రమాల్లో సైతం ఎందరికో ఆదర్శప్రాయుడయ్యాడు. తన పేరిట ఉన్న ఫౌండేషన్ ద్వారా చదువుల్లో రాణించే నిస్సహాయ పిల్లలకు చేయూతనందించడం, ప్రకృతి వైపరీత్యాలు విరుచుకు పడినప్పుడు ఎగ్జిబిషన్ మ్యాచ్‌లతో విరాళాలు సేకరించి ఆపన్న హస్తం అందించడం అతని ప్రత్యేకత. ఆటాడుతున్నప్పుడు నాదల్, జోకోవిచ్‌లతో నువ్వా నేనా అన్న రీతిలో తలపడటం షరా మామూలే అయినా ఎప్పుడూ అవి వ్యక్తిగత వివాదాలుగా ముదరలేదు. చెప్పాలంటే ఆ ముగ్గురూ కలిసి టెన్నిస్‌కు కనీవినీ ఎరుగని జనాదరణను తెచ్చారు. ఆ ఆట స్థాయిని పెంచారు. జోకోవిచ్‌పై ఒక సందర్భంలో డోపింగ్ ఆరోపణలు వచ్చాయి. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పాల్గొనడానికి వెళ్లినప్పుడు వ్యాక్సిన్ వేయించుకోని కారణంగా ఆటంకాలెదురయ్యాయి. ఫ్రెంచ్ ఓపెన్ ఆడుతున్నప్పుడు కాలికి సమస్య ఏర్పడటంతో కొన్ని ఇంజెక్షన్లు తీసుకున్నానని నాదల్ ప్రకటించి వివాదంలో చిక్కుకున్నాడు. కానీ ఇలాంటి వివాదాలేవీ ఫెదరర్‌కు ఎదురుకాలేదు. టెన్నిస్ ప్రపంచంలో చివరంటా ధ్రువతారగా కొనసాగిన ఫెదరర్ మిగిల్చిన జ్ఞాపకాలు ఎన్నటికీ చెక్కుచెదరనివి. అభిమానులకు ఎప్పటికీ అపురూపమైనవి.


గ్రహం అనుగ్రహం

శ్రీశుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
భాద్రపద మాసం, **తిథి:** బ.సప్తమి ప.2.43 వరకు
తదుపరి అష్టమి, **నక్షత్రం:** రోహిణి ప.2.02 వరకు
తదుపరి మృగశిర, **వర్జ్యం:** రా.8.09 నుండి 9.54 వరకు
దుర్ముహూర్తం: ఉ.5.52 నుండి 7.29 వరకు
అమృతఘడియలు: ఉ.10.33 నుండి 12.15 వరకు.

సూర్యోదయం : 5.51
సూర్యాస్తమయం: 6.00
రాహుకాలం : ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

బాబాసాహెబ్ కలల సాకారంలో...

సందర్భం



రామ్‌నాథ్ కోవింద్
భారత మాజీ రాష్ట్రపతి

అంబేడ్కర్ తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ ఆర్టికల్ 370 మన రాజ్యాంగంలో భాగమైంది. మోదీ బలమైన సంకల్పం ఫలితంగా ఆర్టికల్ 370 రద్దు సాధ్యమై, ఇవాళ భారతదేశంతో జమ్ము–కశ్మీర్ ఏకీకరణ స్వప్నం సాకారమైంది. మోదీ చేపట్టిన చర్యలు, కార్యక్రమాలు, విధానాలన్నింటిలోనూ అంబేడ్కర్ ప్రభావం సుస్పష్టం. మోదీ అనేకమంది నాయకుల నుంచి స్ఫూర్తి పొందినప్పటికీ, అంబేడ్కర్ ముద్ర ఆయన పాలనా శైలిలో సర్వత్రా కనిపిస్తుంది. 'భారతీయతే మన నిజమైన గుర్తింపు. బలమైన దేశ నిర్మాణం కోసం మనమంతా కుల, మత, జాతి భేదాలను పక్కకునెట్టి ముందడుగు వేయాలి' అన్న మన భారతరత్న అంబేడ్కర్‌కు మోదీ నిజమైన వారసుడన్నది నా అభిప్రాయం.

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో మన సమాజ భాగస్వాములైన బడుగు, బలహీన వర్గాల వారి ఆశలు, ఆకాంక్షలకు రెక్కలు తొడిగిన రాజ్యాంగ పితామహుడు బాబాసాహెబ్ డాక్టర్ భీమ్‌రావ్ అంబేడ్కర్‌ను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉంది. స్వాతంత్ర్యం తర్వాత దేశ ప్రగతికి వివిధ ప్రభుత్వాలు తమ వంతు కృషి చేసినప్పటికీ అంబేడ్కర్ కన్న కలల్లో ఏళ్ల తరబడి నెరవేరని ఎన్నో స్వప్నాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం సాకారం చేసింది. ఈ రోజు మన ప్రియతమ ప్రధానమంత్రి పుట్టినరోజు. ఆయనతో నాది చాలా సుదీర్ఘ, చిరస్మరణీయ అనుబంధం. సంస్థలో ఒకరిగా, ముఖ్యమంత్రిగా, ఇవాళ ప్రధానమంత్రిగా ఆయన పనిచేయడం నేను చూస్తూ వచ్చాను.

దళితులు, ఆదివాసీలు, మహిళల సాధికారతలో ఆయన ప్రదర్శించిన శ్రద్ధాసక్తులు నన్నెంతో ఆకట్టుకున్నాయి. ఆ మేరకు బాబాసాహెబ్‌కు నిజమైన శిష్యుడిగా భారతదేశాన్ని సమసమాజంగా రూపుదిద్దడానికి మోదీ ముమ్మర కృషి చేస్తున్నారు. మోదీ చేపట్టిన చర్యలు, కార్యక్రమాలు, విధానాలు తదితరాలన్నింటిలోనూ అంబేడ్కర్ ప్రభావం సుస్పష్టం. ఒక సంస్థలో సభ్యుడిగా, ముఖ్యమంత్రిగా, నేడు ప్రధానమంత్రిగానూ మోదీ సదా బాబాసాహెబ్ బాటలోనే నడుస్తున్నారు. తదనుగుణంగా దేశానికేగాక ప్రపంచం మొత్తానికీ చిరకాలం గుర్తుండిపోయే బహుమతిని 'పంచతీర్థం' రూపంలో మోదీ అందించారు. బాబాసాహెబ్ జయంతిని 'సమతా దినోత్సవం'గా నిర్వహించాలని నిర్ణయించడమేగాక నవంబర్ 26ను భారత 'రాజ్యాంగ దినోత్సవం'గానూ మోదీ ప్రకటించారు. ప్రధాని మోదీ చూపిన ఈ చొరవతో ఐక్యరాజ్య సమితి కూడా బాబాసాహెబ్ 125వ జయంతి వేడుకను నిర్వహించింది.

అంబేడ్కర్ కృతనిశ్చయంతో ఉన్నప్పటికీ నెరవేరని– ఆర్టికల్ 370 రద్దు, స్వయం సమృద్ధ భారతం స్వప్నాలను మోదీ ప్రభుత్వం పటిష్ఠ చర్యలతో సాకారం చేయగలిగింది. కాగా, ఆనాడు అంబేడ్కర్ తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ ఆర్టికల్ 370 మన రాజ్యాంగంలో భాగమైంది. దీంతో భారతదేశంలో జమ్ము–కశ్మీర్ విలీనానికి అడ్డుకట్ట పడింది. అయితే, మోదీ బలమైన సంకల్పం, దీక్ష ఫలితంగా ఆర్టికల్ 370 రద్దు సాధ్యమై, ఇవాళ భారతదేశంతో జమ్ము–కశ్మీర్ ఏకీకరణ స్వప్నం సాకారమైంది. అదేవిధంగా శక్తిమంతమైన స్వయం సమృద్ధ భారతదేశ నిర్మాణం దిశగా ప్రధానమంత్రి మోదీ ఉద్యమ సంకల్పంతో శ్రమిస్తున్నారు. 'స్వయం సమృద్ధం' కావడం ద్వారానే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించగలదని అంబేడ్కర్ గట్టిగా విశ్వసించారు. కానీ, భారతదేశాన్ని స్వావలంబన మార్గంలో నడిపించడంలో మునుపటి ప్రభుత్వాలకు సంకల్పం, చిత్తశుద్ధి లోపించాయి. కానీ, మోదీ ఈ పరిస్థితిని చక్కదిద్ది, భారత ప్రగతి రథాన్ని పరుగులు పెట్టించడం ద్వారా ప్రపంచానికి మన శక్తిని చాటారు. కాబట్టే మన బలమేమిటో ప్రపంచం ఇవాళ గుర్తించింది.



రాష్ట్రపతి హోదాలో నేను పలు సామాజిక సమస్యలు, పాలనా వ్యవహారాలపై ప్రధానితో సంభాషించినప్పుడల్లా వ్యవస్థలో లోతుగా పాతుకుపోయిన అవినీతి గురించి ఎక్కువగా ఆందోళన వ్యక్తం చేసేవారు. ఈ జాడ్యం కారణంగా ఎక్కువగా నష్టపోతున్నది పేదలేనని చెప్పేవారు. ఈ నేపథ్యంలో గడచిన ఎనిమిదేళ్లుగా మోదీ అవినీతిపై అలుపెరుగని నిర్ణయాత్మక పోరాటం చేస్తున్నారు. తదనుగుణంగా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలన్నీ నిరుపేదలందరికీ అందేలా ఆయన చేసిన కృషిని మనమంతా ప్రత్యక్షంగా చూశాం. పర్యవసానంగా ఇవాళ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు బదిలీ సాఫీగా సాగిపోతోంది. నరేంద్ర మోదీ ప్రభుత్వ పథకాలన్నీ నిరుపేదలపై కరుణను ప్రతిబింబించేవి కావడం గమనార్హం.

మన ప్రజాస్వామ్య వ్యవస్థను అనువంశిక రాజకీయాలు నియంత్రించడం మోదీకి తీవ్ర ఆందోళన కలిగించిన మరో అంశం. ఈ అనువంశిక రాజకీయాలు చిత్తశుద్ధితో, శ్రమించి పనిచేసే రాజకీయ కార్యకర్తల హక్కులను ఏ విధంగా లాగివేసుకుంటాయనే అంశంపై ఆయన సదా గళం విప్పుతూనే వచ్చారు. మోదీ ఎల్లప్పుడూ అర్హత ప్రాతిపదికగానే నాయకులను, కార్యకర్తలను ప్రోత్సహిస్తూ వస్తున్నారు. అనువంశిక రాజకీయాలపై మోదీ చేసిన యుద్ధం ఇప్పటికే తన ప్రభావం చూపుతోంది. ఈ మేరకు మన ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠం, మరింత శక్తిమంతం చేసేది ప్రతిభ ఆధారిత రాజకీయాలే తప్ప అనువంశిక రాజకీయాలు కావన్నది స్పష్టమైంది.

మోదీ పాలన శైలికి మరో నిలువెత్తు నిదర్శనం 'పద్మ' పురస్కారాలు. ఒకనాడు సంపన్న, పలుకుబడిగల వర్గాలకు 'విశేష పరిగణన' ఇచ్చేవిగా భావించబడిన ఈ పురస్కారం నేడు 'సామాన్యుడి'తో తన అనుబంధాన్ని పునరుద్ధరించుకుంది. ఈ మేరకు ఇవాళ 'జన సామాన్యం'తో మమేకమైన వారికి అంకితం చేయబడ్డాయి.

అత్యంత వెనుకబడిన రంగాలలో అభివృద్ధి, తదనుగుణంగా అట్టడుగు వర్గాల జీవితాల్లో కొత్త అధ్యాయం లిఖించే విధంగా ప్రభుత్వం చేపట్టిన రెండు కీలక చర్యల గురించి ఈ సందర్భంగా నేను ప్రస్తావించదలిచాను. ఇందులో ఒకటి 'ఆకాంక్షాత్మక జిల్లాల కార్యక్రమం' కాగా, రెండోది 'ఆదర్శ గ్రామాల పథకం'. మోదీ విశిష్ట ఆలోచన శైలికి ఇదే నిదర్శనం. వేలెత్తి చూపలేని పటిష్ఠ ప్రణాళికలు, లోపరహితంగా వాటిని అమలు చేయడం వల్ల నిరుపేదల జీవితాల్లో సుస్పష్టమైన మార్పులు వచ్చాయి. అనేక సాంఘిక సంక్షేమ పథకాలే ఇందుకు తిరుగులేని ఉదాహరణలు. వీటిలో ప్రపంచంలోనే అత్యంత భారీ ఉచిత రేషన్ పథకమైన 'ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన' అత్యంత విశిష్టమైనది. భారతీయులు కరోనా మహమ్మారిపై సాహసోపేత పోరాటం సలుపుతున్న నేపథ్యంలో ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా 80 కోట్ల మందికిపైగా ప్రజలు ప్రయోజనం పొందారు. మహమ్మారి వైరస్‌పై భారత్ పోరాటాన్ని ప్రధాని మోదీ ఏ విధంగా ముందుండి నడిపారో నేను ప్రత్యక్షంగా చూశాను. మన శాస్త్రవేత్తలు, వైద్యులు ఒకటికి రెండు 'దేశీయ' (మేడ్ ఇన్ ఇండియా) టీకాలను రూపొందించడంలో ఆయనిచ్చిన చేయూత, మద్దతు నిరుపమానం. దీంతో మనందరికీ భద్రత లభించడమేగాక అనేక ఇతర దేశాల ప్రజానీకం సంక్షేమానికీ మనమంతా తోడ్పడినట్లయింది. మరోవైపు మహమ్మారి గరిష్ఠ స్థాయిలో విజృంభించే నాటికి 100 కోట్ల మంది భారతీయులకు టీకాలు వేసే బృహత్తర కార్యాచరణను కూడా ప్రధానమంత్రి చేపట్టారు. తద్వారా ప్రపంచంలోనే అత్యంత భారీ, వేగవంతమైన టీకా కార్యక్రమాన్ని ప్రారంభించి, విజయవంతం చేశారు. అనేక అభివృద్ధి చెందిన దేశాలను కోవిడ్ ఊపిరాడకుండా చేసిన సమయంలో ప్రధాని మన ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడమేగాక విస్తరించారు. సమయస్ఫూర్తితో కూడిన విధానపరమైన కార్యక్రమాల ద్వారా ఆర్థిక వృద్ధి స్తంభించకుండా ఎంతో జాగ్రత్త వహించారు.

మోదీ గత ఎనిమిదేళ్ల పాలన అత్యద్భుతం. మోదీ అనేకమంది నాయకుల నుంచి స్ఫూర్తి పొందినప్పటికీ, అంబేడ్కర్ ముద్ర ఆయన పాలన శైలిలో సర్వత్రా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 'భారతీయతే మన నిజమైన గుర్తింపు. బలమైన దేశ నిర్మాణం కోసం మనమంతా కుల, మత, జాతి భేదాలను పక్కకునెట్టి ముందడుగు వేయాలి' అన్న మన భారతరత్న అంబేడ్కర్‌కు మోదీ నిజమైన వారసుడన్నది నా అభిప్రాయం. అంబేడ్కర్ అడుగుజాడల్లో మన ప్రధాని 'దేశమే ప్రథమం' అనే నినాదాన్ని తారకమంత్రంగా స్వీకరించారు. మరోవైపు సుపరిపాలన, సామాజిక సమన్వయం, క్రమశిక్షణలనే విశిష్ట లక్షణాలతో ఆయన ప్రభుత్వం దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోంది.

(నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజు)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



బతకనీయండి



కేరళలో మూకుమ్మడిగా కుక్కలను చంపుతుండటం భయానకం. ఇలాంటి చర్యల గురించి తిరిగి ఆలోచించి, ఇలా క్రూరంగా చంపడాన్ని ఆపేయాలని అభ్యర్థిస్తున్నాను.

– శిఖర్ ధవన్, క్రికెటర్

రాజుకు నివాళి



'అన్న గారు', మాజీ కేంద్ర మంత్రి కృష్ణంరాజుకు హైదరాబాద్‌లో జరిగిన సంతాప సభలో నివాళులు అర్పించాను. తెలుగు పరిశ్రమలో ఆయన పెద్ద నటుడు అయినప్పటికీ తన మూలాలను మరిచిపోలేదు. తన ప్రజలతో ఎప్పుడూ సత్సంబంధాలు నెరిపారు. ఆయన మరణం నాకు వ్యక్తిగత నష్టం.

– రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ మంత్రి


ఎన్నికలు లేవుగా!



ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని తప్పించుకోవడానికి దేశానికి తిరిగివచ్చిన వేలాది మంది వైద్య విద్యార్థులకు చేర్చుకోవడానికి భారత ప్రభుత్వం తిరస్కరిస్తోంది. ఇదే పాలక పక్షం ఈ విద్యార్థులను ఖాళీ చేయించినప్పుడు వారితో పరేడ్ చేయించింది; దీన్ని మీడియా గొప్పగా చూపించింది. ఇదంతా కూడా ఉత్తర ప్రదేశ్‌లో ఓట్లు పొందడానికి!

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

విరమించిన దిగ్గజం



ప్రియమైన స్నేహితుడు, ప్రత్యర్థి రోజర్ (ఫెదరర్)కు! ఇలాంటి ఒక రోజు ఎప్పటికీ రాకూడదని అనుకున్నాను. వ్యక్తిగతంగానూ, ప్రపంచంలోని ఇతర క్రీడలకు కూడా ఇది బాధాకరం. (టెన్నిస్) కోర్టులోనూ, కోర్టు బయటా ఇన్నేళ్లపాటు ఎన్నో అద్భుతమైన క్షణాలను పంచుకోవడం ఆనందంతోపాటు గర్వంగా కూడా ఉంది.

– రఫేల్ నాదల్, టెన్నిస్ క్రీడాకారుడు

ముందే పంపాలి



నేననుకోవడం మనం ఎన్నో ప్రపంచ కప్‌లు గెలవగలం. అది ఎప్పుడంటే క్రీడాకారులను ప్రపంచ కప్ ముగిసిన తర్వాత కాకుండా ప్రారంభానికి ముందు రిటైర్ చేయించినప్పుడు.

– రమేశ్ శ్రీవత్స్, వ్యంగ్య వ్యాఖ్యాత

కోవిడ్ యుగం



కోవిడ్ అనేది ఎందుకు ఫ్లూ లాంటిది కాదంటే: అది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో ఎక్కువమందిని చంపుతోంది. అది ఆయు ప్రమాణాన్ని తగ్గిస్తోంది. ఊపిరితిత్తులు, గుండె, మెదడు, మూత్రపిండాలు, ఇంకా రోగ నిరోధక వ్యవస్థ మీద దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతోంది. లాంగ్ కోవిడ్ మూకుమ్మడిగా శారీరక, మానసిక శక్తుల్ని తగ్గిస్తోంది.

– శైలజ పటేల్, రచయిత్రి

దేశానికి ఇబ్బంది



విదూషకుడు రాజభవనంలోకి ప్రవేశించగానే అతడు రాజు అయిపోలేదు. రాజభవనం కాస్తా సర్కస్ అయిపోతుంది. ఇదొక టర్కీ దేశపు సామెత. (రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్‌తో భేటీ సమయంలో పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఎదుర్కొన్న ఇబ్బందికర పరిస్థితిని చూపే వీడియోను షేర్ చేశారు.)

– తైమూర్ హెచ్.అజ్మల్, పాక్ ఇన్వెస్ట్‌మెంట్ కన్సల్టెంట్

తెలుగును వెదజల్లే దిశలో...

అభిప్రాయం



ఆచార్య అయ్యగారి సీతారత్నం

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతుల అభివృద్ధి కోసం పాటుపడుతున్న సంస్థల్లో ఎన్నదగినది. అయితే రాష్ట్ర విభజన తర్వాత 2014లో తెలుగు అకాడమీని పదవ షెడ్యూల్ సంస్థల జాబితాలో చేర్చటం వలన దీని కేంద్ర కార్యాలయం హైదరాబాదులో ఉండిపోయింది. దీంతో అకాడమీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ కిందకు వచ్చింది. దీనివల్ల అకాడమీ సేవలు తెలంగాణ రాష్ట్రం వరకే పరిమితం అయ్యాయి.

రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో వచ్చిన ప్రభుత్వం తెలుగు అకాడమీని విస్మరించిందనే చెప్పాలి. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం తెలుగు భాషాభిమానులకి ఆనందాన్ని కలగజేస్తూ తెలుగు అకాడమీని ఏర్పాటు చేసింది. దీనికి డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతిని సంచాలకులుగా నియమించారు.

అప్పటినుండి ఆమె అకాడమీ పనులు కోసం ఎంతో శ్రమ పడవలసి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు అకాడమీని 2020 జూన్ నెలలో ఏర్పాటు చేసిన తర్వాత... ఉమ్మడి అకాడమీ నిధులు, సిబ్బందిని జనాభా ప్రాతిపదికన అకాడమీకి కేటాయించాలని అనేకమార్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వానికి లేఖలు రాసింది. ఈ లేఖలపై తెలంగాణ ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోర్టులకెక్కి తనకు అనుకూలంగా తీర్పులు పొందింది.

దీంతో అకాడమీ పూర్తిస్థాయిలో పని చేసేందుకు వీలు కుదిరింది. ఇప్పటికే తెలుగు భాషా చైతన్య సదస్సులు అన్ని యూనివర్సిటీల్లో నిర్వహించారు. 2020–21లో ఇంటర్ పాఠ్య పుస్తకాలు ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో కరోనా నేపథ్యంలో కూడా సకాలంలో ముద్రించి విద్యార్థులకు అందజేశారు. అలాగే అకాడమీ తరఫున 2021, 22 సంవత్సరాల్లో ఉగాది వేడుకలు, ఉగాది పురస్కార ప్రదాన ఉత్సవం నిర్వహించారు. 2021 ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి భాషా సేవకులను ఎంపిక చేసి గిడుగు రామ్మూర్తి భాషా పురస్కారంతో సత్కరించారు.

ఉన్నత విద్యలో తెలుగు బోధనా మాధ్యమంగా కుదురుకోవడానికి ఇంటర్, డిగ్రీ, బీఈడీ, పీజీ పాఠ్యపుస్తకాలు ముద్రించటం; తెలుగు భాషను ఆధునికీకరించి, తెలుగు భాషా వ్యాప్తికి కృషి చేయడం; తెలుగు భాషలో పాలన సాగించటానికి ప్రభుత్వానికి సహకరించటం వంటివి ప్రధాన లక్ష్యాలుగా అకాడమీ ముందుకు సాగుతోంది. సంస్కృత అకాడమీని కూడా తెలుగు అకాడమీలో కలిపి వేయడంతో... లక్ష్మీపార్వతి సంచాలకత్వంలో రెండు భాషలూ అభివృద్ధి పథంలో సాగుతాయని ఆశిద్దాం.

వ్యాసకర్త తెలుగు ప్రొఫెసర్,
ఆంధ్ర యూనివర్సిటీ, విశాఖపట్నం

ఉచితాలు కావవి... సంక్షేమ పథకాలు

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

ప్రజాస్వామ్య వ్యవస్థలో సంక్షేమ పథకాలు అనేవి బలహీన వర్గాలకెంతో మేలు చేసేవి. ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పథకాలు రూపొందించడం. ఆ పనిని తెలంగాణలో కేసీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ దేశంలోనే అందరికంటే మేలైన రీతిలో అమలు చేస్తున్నారు. రైతును ఆదుకునే పథకాలు, విద్యా సంబంధమైన ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు, రుణ మాఫీలు, వృద్ధాప్య పెన్షన్లు, వివిధ వృత్తుల వారి ఆదాయాలను పెంచే పథకాలెన్నో రూపొందించి ప్రజల హృదయాలను గెలుచుకుంటున్నాయి ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు. ఇవి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడాలేవు. తెలుగు రాష్ట్రాల్లో అధికారంలోకి రావడానికి ఉవ్విళ్లూరుతున్న బీజేపీ ఈ పథకాలను ఉచితాలంటూ, ఉచితాలు ఇవ్వకూడదంటూ విమర్శలు చేస్తున్నది. పేదల కడుపు కొట్టాలని చూస్తున్నది.



ఉచిత కరెంటు, గ్రామీణ పేదలకు లక్షల్లో ఇళ్లు కట్టించడం, రైతుబంధు, ఇంగ్లిష్ మాధ్యమం ద్వారా నాణ్యమైన విద్యను పేదలకు అందించడం, రుణమాఫీ, దళితుల దీన పరిస్థితులను మార్చే దళితబంధు, వ్యవసాయాన్ని లాభసాటి చేయడానికి రైతును ఆదుకోవడం, మహిళలను ఆదుకోవడం... ఇలాంటివన్నీ బీజేపీ దృష్టిలో ఉచితాలే. ఈ ఉచితాల వల్ల నష్టం జరుగుతుందట.

సర్వ సంపదలు సృష్టించే ఉత్పత్తి కులాల వారి బతుకుల్లో వెలుగు నింపడానికి అమలు చేసే సంక్షేమ పథకాలు ఉచితాలు ఎలా అవుతాయి? ప్రజాస్వామ్యంలో సంక్షేమ పథకాలు అమలు చేయడమనేది ప్రభుత్వ అతి ముఖ్యమైన బాధ్యతల్లో ఒకటి. సంక్షేమ పథకాలను బాగా అమలు చేయడం వల్ల ప్రజల్లో హింసాయుత తిరుగుబాటు ధోరణి తగ్గుతుందన్నది వాస్తవం. అందుకే ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా ఏ ఒక్క విప్లవమూ విజయవంతం కాలేదు. సంక్షేమ పథకాలతో పాటు ఉపాధిహామీ, ఉపాధి కల్పన వంటివి ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తగ్గించి దేశం పట్ల ప్రేమను పెంచుతాయి.

ప్రజలకిచ్చే సంక్షేమ పథకాలను ఉచితాలనడం ప్రజావ్యతిరేకతకు నిదర్శనం. ఇన్‌కంటాక్స్ పేయర్స్ డబ్బుల నుంచి ఈ డబ్బు వస్తుందట. ఈ కార్పొరేట్ శక్తుల ఆదాయం వేలు, లక్షల కోట్లలో పెరుగడానికి కారణం ఈ దేశ సాధారణ ప్రజలే. వీళ్ళు వాళ్ళ వస్తువులను కొనకుంటే వారికి ఆదాయమెక్కడిది? పారిశ్రామిక వేత్తలకు, కార్పొరేట్ శక్తులకు, ఇన్‌కంటాక్స్ పేయర్స్‌కు వచ్చే ఆదాయంలోని ప్రతి రూపాయిలో కోట్లాది మంది ప్రజలు రోజూ కొంటున్న వస్తువులపై వేసే పన్నుందనేది వీరు మరచిపోతున్నారు.

ఇంతకీ కార్పొరేట్ శక్తులు, పారిశ్రామిక వేత్తలు, ఇతర ఆదాయ పన్ను చెల్లింపుదారులు విదేశాల్లోలా పన్ను చెల్లిస్తే దేశ పరిస్థితి ఇలా ఉండేదా? పేదరికం ఈ స్థాయిలో బుసలు కొడుతుందా? ఈ శక్తులు అక్రమ సంపాదనను బ్లాక్ మనీగా ఉంచడం, విదేశీ బ్యాంకుల్లో దాచుకోవడం వల్లనే కదా లక్షల కోట్ల దేశ సంపద లెక్కల్లోకి రాకుండా పోతోంది! ఆ డబ్బునంతా వైట్ మనీగా మారిస్తే దేశంలో పేదరికం ఉంటుందా? కార్పొరేట్లు... బ్యాంకుల రుణాలను కట్టలేమంటే రుణమాఫీ పేరుతో ఇచ్చే వెసులుబాటు ఉచితం కాదు కానీ ప్రజా సంక్షేమ పథకాలు మాత్రం ఉచితాలా? పేదలకిచ్చే ఉచితాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటుందా? పన్ను ఎగవేతదారులను సగౌరవంగా విదేశాలకు పంపించడం దేశానికి మేలు చేయడమవుతుందా?

పేదలను ఆదుకొనే ప్రభుత్వాలే అసలు సిసలైన సంక్షేమ ప్రభుత్వాలు. వాటిని విమర్శించేవారు ఎప్పటికీ ప్రజావ్యతిరేకులే!

వ్యాసకర్త ప్రముఖ కథారచయిత, విమర్శకులు
మొబైల్: 91829 18567

వారసులు

మనుషులు సంపదల్ని పోగు చేసేది తమ వెంట పట్టుకు పోవడానికి కాదు. పట్టుకు పోలేమని అందరికీ తెలుసు. అది తమ వారసులకు అందివ్వడానికే భోగులు తాము అనుభవించి, మిగిలింది వారసులకు పంచుతారు. పిసినార్లు తాము అనుభవించకుండానే అందించి పోతారు. కొందరు త్యాగులు కొంత దానం చేసి ఎంతో కొంత కీర్తిని మిగిల్చిపోతారు. తమ పెద్దలు కూడబెట్టిన సంపదను పంచుకునే విషయంలో తగాదాలు పడకుండా, తన్నుకోకుండా పంచుకునేవారు దాదాపుగా అరుదే! సంపద, తాను ముక్కలవుతూ కుటుంబాల్నీ ముక్కలు చేస్తుంది. తల్లిదండ్రుల సంపద అనేది వారసత్వపు హక్కుగా పొందేందుకు చట్టం కూడా ఒప్పుకొంటుంది. అయితే తల్లిదండ్రుల ధార్మిక ఆశయాలకు అనుగుణంగా వారసులు ఏ కొద్దిమంది మాత్రమో ఉంటారు. నిజానికి వారసులు తల్లిదండ్రుల భౌతిక సంపదతో పాటూ ధార్మిక సంపదనూ పంచుకోవాలి.

జ్యోతిర్మయం

బౌద్ధ సంఘానికి బుద్ధుడు తండ్రిలాంటి వాడు. భిక్షువులందరూ ఆయన బిడ్డలే! ధర్మసంపదకు వారసులే! ఒక రోజు ఇద్దరు భిక్షువులు బుద్ధుని దగ్గరకు వచ్చారు. ఆయన అప్పుడే భోజనం ముగించాడు. పాత్రలో ఇంకా కొంత ఆహారం ఉంది. 'భిక్షువులారా! నేను మిగిలిన ఈ ఆహారాన్ని మొక్కలు లేని చవిటి నేలలో లేదా జీవులు లేని నీటిలో పారవేయాలనుకుంటున్నాను. లేదంటే మీరు ఎవరైనా దీన్ని స్వీకరించవచ్చు' అని అన్నాడు. అందుకు ఆ ఇద్దరిలో ఒకడు: 'భగవానుడు దీన్ని వృథా చేయడం ఎందుకు? నేను ఇంతకుముందే ఆహారం తీసుకున్నప్పటికీ ఈ ఆహారాన్ని నేను స్వీకరిస్తాను' అని దాన్ని తీసుకుంటాడు. ఇంకో భిక్షువు భగవానుని నుండి నాకు కావలసింది శరీరాన్ని పెంచే ఆహారం కాదు. మనస్సుని క్షాళన చేసే జ్ఞానం. నేను ఆ ధర్మ ప్రబోధాన్నే స్వీకరిస్తాను' అనుకుంటాడు. ఆ ఇద్దరి భిక్షువుల్లో మొదటివాడు తండ్రిలాంటి గురువు ప్రాపంచిక సంపదకు వారసుడు. రెండో భిక్షువు ధర్మ సంపదకు వారసుడు అయ్యాడు.

– బొర్రా గోవర్ధన్

కుల రాజ్య స్థాపనే ఆ యాత్ర లక్ష్యం

719వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు



రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ : కుల రాజ్య స్థాపనే ధ్యేయంగా ఒక రాజధాని పేరుతో కుల వాదులు పాదయాత్రలు చేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నేతలు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 719వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో శుక్రవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అన్ని ప్రాంతాల సమానాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం మూడు ప్రాంతాల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందని, అమరావతితో పాటు అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేస్తుంటే.. ఓ సామాజిక వర్గం మాత్రం తమ బినామీ ఆస్తులకు ధరలు రావాలని పట్టుబడుతుండటం సిగ్గుచేటన్నారు. కోర్టులను సైతం తప్పుదారి పట్టించేలా బాబు అండ్ కో తప్పుడు పిటిషన్‌లు వేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి రాజకీయంగా లబ్ధి పొందేందుకు బాబు అండ్ కో చేస్తున్న ఆగడాలు అన్నీ ఇన్నీ కావని, వీరిని నిలువరించకపోతే ఎంతకైనా బరితెగిస్తారని దుయ్యబట్టారు. అసెంబ్లీ సమావేశాలకు వెళుతున్న సీఎం వైఎస్ జగన్.. మూడు రాజధానుల దీక్ష శిబిరం వద్ద తన వాహన శ్రేణి వేగాన్ని తగ్గించి నాయకులకు చిరు మందహాసంతో అభివాదం చేయడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, ఇందుపల్లి సుభాషిణి, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పెరికే వరప్రసాద్, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

జేసీ..వరినాట్లు వేసి!



అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) కల్పనాకుమారి రైతులతో కలిసి వరినాట్లు వేశారు. శుక్రవారం మునగపాక మండలంలో పర్యటించేందుకు వెళుతూ మంగళవరపుపేట గ్రామ సమీపంలో పొలాల వద్ద కారును ఆపారు. పొలం పనుల్లో ఉన్న రైతులను పలకరించి, ఆమె కూడా పొలంలోకి దిగి నాట్లు వేశారు. రైతులకు ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాల గురించి ఆరా తీసి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

– మునగపాక

అభాగ్యురాలని చేరదీస్తే.. బిడ్డనే అపహరించింది!

- కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు
- తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

చీరాల : 'నాకు ఎవరూ లేరు. మీ వద్ద తలదాచుకుంటాను..' అని చెప్పి ఆశ్రయం పొంది ఇంటి బిడ్డనే కిడ్నాప్ చేసింది ఓ మహిళ. పోలీసులు ఆమెను పట్టుకుని బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. ప్రకాశం జిల్లా కంభానికి చెందిన సీహెచ్ అంజలి, చెంచయ్య దంపతులకు ఒక కుమార్తె ఉంది. నాలుగు నెలల కిందట చెంచయ్య తన కుమార్తెను తీసుకుని మరో మహిళతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో అంజలి తన భర్త, కూతురుని వెతుక్కుంటూ చీరాల రూరల్ మండలం ఈపురుపాలెం కరకట్టపై నివాసం ఉంటున్న యానాదుల వద్దకు చేరుకుంది. తన సమస్యలను వారికి చెప్పడంతో జాలిచూపి ఆమెను చేరదీశారు. కావూరి సత్యరాణి అనే మహిళ తన ఇంట్లో ఉండాలని చెప్పింది. అంజలి అక్కడే ఉంటూ వారితో కలిసి చిత్తుకాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తోంది. సత్యరాణి కుమారుడు 11 నెలల బాలుడు మోషేపై అంజలి ప్రేమను పెంచుకుంది. తనకు బిడ్డలేని లోటును మోషేతో తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఈ నెల 6 వ తేదీ రాత్రి బాలుడిని తీసుకుని వెళ్లిపోయింది. ఉదయానికి మోషే, అంజలి కనిపించకపోవడంతో ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌లో సత్యరాణి ఫిర్యాదు చేసింది. ఈ కేసు విచారణ కోసం ఆరు బృందాలను ఏర్పాటు చేశారు. దర్యాప్తు బృందాలకు ఆమె గురువారం రాత్రి పర్చూరు బస్టాండ్ ప్రాంతంలో దొరికింది. ఆమెను అదుపులోకి తీసుకుని బాలుడు మోషేను తల్లిదండ్రులకు అప్పగించారు. ఏ ఆధారం లేని తాను, ఆ బాలుడిని పెంచుకుని జీవనం సాగించాలనే కిడ్నాప్ చేశానని నిందితురాలు పోలీసులకు తెలిపిందని ఎస్పీ చెప్పారు. ఈ కేసును త్వరితంగా ఛేదించిన ఆరుబృందాల పోలీసులను ఎస్పీ అభినందించి ప్రశంస పత్రాలు అందించారు. డీఎస్పీ శ్రీకాంత్, సీఐలు మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ముకేశ్ అంబానీ



మహాలక్ష్మి ఏనుగు ఆశీర్వాదం తీసుకుంటున్న అంబానీ

తిరుమల: రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం అభిషేక సేవలో తనకు కాబోయే కోడలు రాధికతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వాదాన్ని అందించారు. ఆలయాధికారులు స్వామివారి శేషవస్త్రాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు. టీటీడీ గోశాలలో మహాలక్ష్మి ఏనుగుకు అంబానీ పళ్ళు అందించారు. ఆ తర్వాత శ్రీకృష్ణ అతిథి గృహానికి చేరుకున్నారు. దర్శనానంతరం అంబానీ ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. శ్రీవారి ఆశీస్సులు పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. శ్రీవారి ఆలయంలో రోజు రోజుకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు.

టీటీడీ ట్రస్ట్‌కు రూ.1.5 కోట్ల విరాళం: టీటీడీ ట్రస్టుకు ముకేశ్ అంబానీ రూ.1.5 కోట్లను విరాళంగా అందించారు. సంబంధిత డీడీని శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ ఈవో ధర్మారెడ్డికి అందజేశారు. ఎంపీలు విజయసాయిరెడ్డి, గురుమూర్తి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20వ తేదీ ఎస్ఈడీ టికెట్ల విడుదల నేడే



ఆలయం వెలుపల పీవీ సింధు

తిరుమల: ఈ నెల 20వ తేదీకి సంబంధించి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం (ఎస్ఈడీ) టికెట్లను టీటీడీ ఆన్‌లైన్‌లో ఈ నెల 17న ఉదయం 9 గంటలకు విడుదల చేయనుంది. 20న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం దృష్ట్యా టీటీడీ శనివారం ఎస్ఈడీ ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తోంది.

సర్వ దర్శనానికి 18 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. సర్వ దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూలైన్ ఎస్ఎంసీ జనరేటర్ రూము వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 65,634 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 31,419 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.4 కోట్లు వేశారు. కాగా, శ్రీవారిని శుక్రవారం ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆలయం వెలుపల సింధు మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వారిని ప్రార్థించినట్లు చెప్పారు. కాలికి గాయం కావడంతో ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నట్లు చెప్పారు.

కాకినాడకు మణిహారం.. ఐఐఎఫ్‌టీ

దేశంలో కాకినాడలో మూడో క్యాంపస్

- ఢిల్లీ, కోల్‌కతాల్లో మాత్రమే ప్రస్తుతం క్యాంపస్‌లు
- జాతీయస్థాయిలో ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్లు
- ప్రస్తుతం ఐదేళ్ల ఐపీఎం కోర్సు ప్రారంభం
- వచ్చే ఏడాది నుంచి ఎంబీఏ
- కోర్సులు పూర్తిచేసినవారికి ప్రారంభంలోనే రూ.లక్షల ప్యాకేజీలతో ఉద్యోగాలు



సాక్షి ప్రతినిధి, కాకినాడ: దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన బీస్కూల్స్‌లో ఒకటి.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ). దేశవ్యాప్తంగా వివిధ సంస్థలు బీస్కూళ్లకు ఇచ్చే ర్యాంకుల్లో ఐఐఎఫ్‌టీ టాప్‌లో ఒకటిగా నిలుస్తోంది. ప్రస్తుతం న్యూఢిల్లీ, కోల్‌కతాలో మాత్రమే ఐఐఎఫ్‌టీ క్యాంపస్‌లు ఉండగా ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ చొరవతో మన రాష్ట్రంలోని కాకినాడలోనూ కొలువుదీరింది. ఇంటర్నేషనల్ బిజినెస్‌లో ఎంబీఏ, ఎంఏ (ఎకనామిక్స్), ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం), డాక్టోరల్, సర్టిఫికెట్ కోర్సులను ఐఐఎఫ్‌టీ అందిస్తోంది. కోర్సులు పూర్తి చేసినవారికి ప్రారంభంలోనే ఏడాదికి కనీసంగా రూ.12 లక్షల నుంచి రూ.65 లక్షల వరకు వేతనాలు లభిస్తాయని ఐఐఎఫ్‌టీ ఓఎస్డీ టి. బాబూరావు నాయుడు చెబుతున్నారు. దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలకు ఇంటర్నేషనల్ బిజినెస్ కోర్సు ఎంతో దోహదపడుతోంది. తాత్కాలికంగా కాకినాడ జేఎన్‌టీయూలో ఐఐఎఫ్‌టీ క్యాంపస్ ఏర్పాటైంది. ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఐదేళ్ల వ్యవధి ఉన్న ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం–బిజినెస్ ఎనలిటిక్స్ అండ్ ఇంటర్నేషనల్ బిజినెస్) కోర్సును ప్రవేశపెట్టారు.

ఐపీఎం కోర్సులో ప్రవేశమిలా..

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) – ఇండోర్ నిర్వహించే ప్రవేశపరీక్ష ఆధారంగా ఐపీఎం కోర్సులో ప్రవేశం ఉంటుంది. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు ఈ కోర్సుకు అర్హులు. కోర్సు వ్యవధి.. ఐదేళ్లు. ఇందులో తొలి మూడేళ్లు బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ), అనంతరం రెండేళ్లు ఎంబీఏ చేయాల్సి ఉంటుంది. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. శాశ్వత క్యాంపస్ ఏర్పాటయ్యే లోపు కాకినాడ జేఎన్‌టీయూలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఐపీఎం కోర్సును ప్రారంభించారు. వచ్చే విద్యా సంవత్సరం రెండేళ్ల ఎంబీఏ కోర్సుకు శ్రీకారం చుడతారు. ఆ తర్వాత పీహెచ్‌డీ, ఆరు నెలల డిప్లొమా తదితర తొమ్మిది రకాల కోర్సులను దశల వారీగా ప్రవేశపెడతారు.

సీఎం జగన్ కృషితోనే ఐఐఎఫ్‌టీ సాకారం



సీఎం వైఎస్ జగన్ కృషితోనే ఐఐఎఫ్‌టీ సాకారమైంది. దీనికోసం మూడేళ్లుగా చేస్తున్న ప్రయత్నం ఫలించింది. సీఎం జగన్ కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లో 25 ఎకరాలను క్యాంపస్ కోసం కేటాయించారు. రెండేళ్లలో శాశ్వత భవనాలు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం.

– వంగా గీత, ఎంపీ, కాకినాడ.

ఉపాధి అవకాశాలు విస్తృతం..



ఐఐఎఫ్‌టీ కోర్సు అభ్యసించిన విద్యార్థులకు విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయి. ఏడాదికి గరిష్టంగా రూ.65 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించిన వారు ఉన్నారు. కాకినాడ క్యాంపస్‌లో 40 మంది విద్యార్థులతో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సును సెప్టెంబర్ మొదటి వారం నుంచి ప్రారంభించాం.

–వల్లమూడి రవీంద్రసారథి, క్యాంపస్ హెడ్, ఐఐఎఫ్‌టీ, కాకినాడ

బోధన విధానం బాగుంది



ఐఐఎఫ్‌టీలో అడ్మిషన్ పొందడం చాలా సంతోషంగా ఉంది. కాకినాడ వాతావరణంతో పాటు అధ్యాపకుల బోధన, తరగతులు, ల్యాబ్స్, చర్చావేదిక.. ఇలా అన్ని సదుపాయాలు కల్పించారు.

– కృషి మల్లిక్, ఐఐఎఫ్‌టీ మొదటి సంవత్సర విద్యార్థిని, హరియాణా

అనంతపురం బీఈఎల్‌కు లైన్ క్లియర్

- పెనాల్టీ లేకుండా యూనిట్ ఏర్పాటుకు ఏపీఐఐసీ అనుమతి
- మరికొన్ని కంపెనీలకు సమయం ఇచ్చిన బోర్డు

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేయనున్న రక్షణరంగ ఉత్పత్తుల తయారీ యూనిట్‌కు లైన్ క్లియర్ అయింది. శుక్రవారం ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అధ్యక్షతన జరిగిన ఏపీఐఐసీ బోర్డు సమావేశంలో ఎటువంటి పెనాల్టీలు లేకుండా యూనిట్ ఏర్పాటుకు అనుమతిస్తూ నిర్ణయం తీసుకుంది. రాడార్ టెస్ట్ బెడ్ ఫెసిలిటీ, రక్షణరంగ ఉత్పత్తుల (మిస్సైల్ మాన్యుఫాక్చరింగ్) యూనిట్ కోసం ఏపీఐఐసీ 2016లో 914 ఎకరాల భూమిని కేటాయించింది. గత ప్రభుత్వ హయాంలో అనుమతుల జాప్యం వల్ల యూనిట్ ఏర్పాటుకు అడుగులు ముందుకు పడలేదు. సకాలంలో యూనిట్ పనులు ప్రారంభించకపోవడంతో ఏపీఐఐసీ నోటీసులు జారీచేసింది. దీంతో బీఈఎల్ ప్రతినిధులు ఇటీవల ఏపీఐఐసీ ఎండీ జవ్వాది సుబ్రమణ్యాన్ని కలిసి యూనిట్ ఏర్పాటుకు అన్ని అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

భూములు కేటాయించినా పనులు మొదలుపెట్టని మరికొన్ని కంపెనీలకు సమయం ఇస్తూ బోర్డు నిర్ణయం తీసుకున్నట్లు గోవిందరెడ్డి చెప్పారు. రూ.50 కోట్లలోపు పెట్టుబడి ఉన్న చిన్న, మధ్య తరగతి పరిశ్రమలను ప్రోత్సహించే విధంగా రాష్ట్రవ్యాప్తంగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా తన సొంత జిల్లా అనంతపురం నుంచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. బోర్డు సమావేశంలో ఎండీ సుబ్రమణ్యం ఏపీఐఐసీ మూడేళ్ల ప్రగతిని వివరించారు. గత మూడేళ్లలో కరోనా విపత్తు వచ్చినప్పటికీ 93 పారిశ్రామిక హబ్‌ల ఏర్పాటు కోసం రూ.1,708 కోట్లు ఖర్చు పెట్టిందని చెప్పారు. మే 2019 నుంచి నేటివరకు 8,616 ఎకరాల భూమిని సమీకరించినట్లు తెలిపారు. గత మూడేళ్లలో 2,450 ఎంఎస్ఎంఈలకు భూమి కేటాయించినట్లు చెప్పారు. ఆ భూముల్లో 377 యూనిట్లు ఉత్పత్తి ప్రారంభించాయన్నారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో జరిగిన భూ కేటాయింపుల ద్వారా రూ.52,161 కోట్ల పెట్టుబడులు, 2,31,309 మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయని తెలిపారు.

ఫైర్ స్టార్టప్ కార్యక్రమానికి ఏయూ ఆచార్యులు

అమెరికాలో పర్డ్యూ వర్సిటీలో నిర్వహణ



ఆచార్యులను అభినందిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు అమెరికాలోని ప్రఖ్యాత పర్డ్యూ వర్సిటీని సందర్శించనున్నారు. ఈ నెల 18 నుంచి అక్టోబర్ 1 వరకు వీరు అక్కడ నిర్వహించే ఫైర్ స్టార్టర్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌తో పాటు ఫార్మసీ కళాశాల నుంచి ఆచార్య జి.గిరిజాశంకర్, ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, సివిల్ ఇంజనీరింగ్ నుంచి ఆచార్య సీఎన్‌వీ సత్యనారాయణ రెడ్డి, మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం నుంచి ఆచార్య పి.జానకీ రామ్, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో టీవీ రవి ఈశ్వరపు హాజరవుతున్నారు. వీరిని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు.

పశువుల మేత భూముల్లో మైనింగా?

తక్షణమే ఆపేయాలని గనుల శాఖకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: పశువుల మేత కోసం ఉద్దేశించిన మేత బీడు భూముల్లో మైనింగ్ కార్యకలాపాలకు అనుమతినివ్వడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఆ భూముల్లో మైనింగ్ కార్యకలాపాలు తక్షణమే ఆపేయాలని, ఆ ప్రాంతాన్ని వెంటనే ఖాళీ చేయాలని గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌ను ఆదేశించింది. ఈ విషయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌కు పూర్తి సహాయ సహకారాలు అందించాలని రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారులను ఆదేశించింది. ఈ ఆదేశాల అమలులో ఉల్లంఘనలు జరిగితే అందుకు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పింది. తదుపరి విచారణను అక్టోబర్ 13కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు జిల్లా సత్యవేడు మండలం కదిరివీడు గ్రామంలోని పలు మేత బీడు భూముల్లో మైనింగ్‌కు జీవీవీ ఎంటర్‌ప్రైజెస్‌కు తాత్కాలిక అనుమతులు మంజూరు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ పి.శివకుమార్ తరఫు న్యాయవాది ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ, పశువుల మేత కోసం ఉద్దేశించిన భూముల్లో మైనింగ్ చట్ట విరుద్ధమన్నారు. ఇప్పటికీ అక్కడ తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. ఈ వాదనను ప్రభుత్వ న్యాయవాది (గనులశాఖ) కామిరెడ్డి నవీన్ తోసిపుచ్చారు. సర్వే నంబర్ 138లో మైనింగ్ నిలిపేశామన్నారు. తహసీల్దార్ ఇచ్చిన నిరభ్యంతర పత్రం ఆధారంగానే ఆ భూమిని మైనింగ్ కోసం కేటాయించామన్నారు.

విద్యుత్ రంగంలో మార్పులపై సమీక్షించాలి

ఫోరం ఆఫ్ రెగ్యులేటర్స్ 82వ సమావేశంలో తీర్మానం



మాట్లాడుతున్న యూపీ ఈఆర్‌సీ చైర్మన్ రాజ్‌ప్రతాప్ సింగ్, ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి

సాక్షి, విశాఖపట్నం : దేశవ్యాప్తంగా విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఫోరం ఆఫ్ రెగ్యులేటర్స్ (ఎఫ్ఓఆర్) ప్రతినిధులు తీర్మానించారు. దేశంలోని విద్యుత్ నియంత్రణ మండళ్ల (ఈఆర్‌సీ) ఆధ్వర్యంలో ఫోరం ఆఫ్ రెగ్యులేటర్స్ 82వ సమావేశాన్ని విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీఈఆర్సీ ఆతిథ్యం ఇచ్చింది. దేశవ్యాప్తంగా 31 మంది ఈఆర్సీ సభ్యులు, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ సభ్యులతోపాటు 25 రాష్ట్రాల నుంచి ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్‌లు హాజరై వివిధ అంశాలపై చర్చించారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్ సీవీ నాగార్జునరెడ్డితోపాటు సభ్యులు ఠాకూర్ రామసింగ్, పి.రాజగోపాల్ రెడ్డి హాజరై రాష్ట్రంలో విద్యుత్ రంగంలో తీసుకుంటున్న విప్లవాత్మక మార్పులను వివరించారు. విద్యుత్ రంగంలో ఏకరూప విధానం, నోటిఫైడ్ సప్లై కోడ్‌ని సవరించే ప్రక్రియను సరళీకృతం చేయడం, గ్రీన్ ఎనర్జీ, క్యాపిటివ్ జనరేటర్ల నుంచి ఓపెన్ యాక్సెస్ విధానాలు, విద్యుత్ చట్టసవరణ బిల్లు తదితర అంశాలపై ఈఆర్‌సీ చైర్మన్లు సుదీర్ఘంగా చర్చించారు.

శాడిస్టు తండ్రి నుంచి పిల్లలకు రక్షణ

- ఏలూరు బాలబాలికల సదనాల్లో చేర్చిన పోలీసులు
- పరారీలో తండ్రి



చిన్నారులను ఏలూరు బాలల సదనానికి అప్పగిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పెంటపాడు: పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడులో బాలికలపై కసాయి తండ్రి హత్యాయత్నం ఘటనకు సంబంధించి పోలీసులతోపాటు ఐసీడీఎస్, ఏలూరు దిశ పోలీసులు స్పందించారు. శాడిస్టు తండ్రి గంజి దావీదు కుమారుడు ఆకాష్ (13)తోపాటు.. కుమార్తెలు అలేఖ్య (12), అమృత (9)లను శిశు సంరక్షణ అధికారులు గురువారం రాత్రి ఏలూరు బాల, బాలికా సదనాలకు పంపించారు. ఐసీడీఎస్ పీడీ సుజాతారాణి ఆదేశాల మేరకు గణపవరం సీడీపీవో సరస్వతి, పెంటపాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవానీ, పెంటపాడు ఎంఎస్‌కే దీప్తి, అంగన్‌వాడీ కార్యకర్తలు.. రోజా, వెంకటలక్ష్మి పిల్లలను ఏలూరు దిశ వన్‌స్టాప్ సెంటర్‌కు తరలించారు. వారిని అక్కడ శుక్రవారం శిశు సంరక్షణ అధికారుల ముందు హాజరుపరిచామని దుర్గాభవానీ తెలిపారు. కువైట్ నుంచి తల్లి నిర్మల వచ్చిన తర్వాత ఆమెతో మాట్లాడి ఆమె గల్ఫ్ వెళ్లకుండా ఉంటే పిల్లలను అప్పగిస్తామన్నారు. కాగా భార్య కువైట్ నుంచి తన దగ్గరకు రాకపోతే పిల్లలను చంపుతానని కత్తితో బెదిరించిన వీడియోలు బయటకు రావడంతో పెంటపాడు పోలీసులు శాడిస్టు తండ్రి గంజి దావీదుపై కేసు నమోదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

దుర్గ గుడిలో వీఐపీలకూ రూ. 500 దర్శన టికెట్

- ఉచిత దర్శనాల మినహా ఇతరులందరూ టికెట్ కొనుక్కోవాల్సిందే
- దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ స్పష్టీకరణ



దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

సాక్షి,అమరావతి: ఈ ఏడాది విజయవాడ దుర్గ గుడి దసరా ఉత్సవాల్లో సాధారణ భక్తులకు ఉచిత దర్శనాలు మినహా ఇతరులు అంతా టికెట్ కొనుక్కునే దర్శనానికి రావాల్సి ఉంటుందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ స్పష్టం చేశారు. వీఐపీ లెటర్ తీసుకు వచ్చే వారు కూడా రూ.500 టికెట్‌ను కొనుక్కోవాల్సి ఉందన్నారు. వీఐపీల కోసం ఘాట్ రోడ్డులో అదనపు లైన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ దుర్గ గుడిలో దసరా ఉత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం సచివాలయంలో ఆ శాఖ అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో మంత్రి సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వీఐపీ భక్తుల కోసం స్టేట్ గెస్ట్ హౌస్, కలెక్టర్ ఆఫీస్, బెరం పార్కు ప్రాంతాల్లో పికప్ పాయింట్లు ఉంటాయని, ఆయా ప్రాంతాల్లో రూ.500 టికెట్లు అమ్మకం కౌంటర్లు ఉంటాయన్నారు. టికెట్ కొనుగోలు చేసిన వారిని ఓం సెంటర్లో డ్రాప్ చేస్తామని, అక్కడ నుంచి రూ.500ల కోసం ప్రత్యేక క్యూలైన్ లో వారిని దర్శనానికి పంపుతామన్నారు. ఉచిత దర్శనానికి మరో రెండు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి అంతరాలయ దర్శనం ఉండదని చెప్పారు. భవానీ దీక్షదారులకు ప్రత్యేకంగా టీటీడీకి చెందిన 4 ఎకరాల స్థలంలో ప్రత్యేక వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

26 నుంచి విజయకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు



మాట్లాడుతున్న చిన్నజీయర్ స్వామి

తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో ఈ నెల 26 నుంచి అక్టోబర్ 5 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు త్రిదండి చిన్నజీయర్ స్వామి చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 108 మంది పండితులతో ప్రబంధనలు అలాగే నాలుగు వేదాలు, ఇతర కార్యక్రమాలు జరిపించబోతున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 5న శమీ పూజా మహోత్సవంలో పాల్గొనాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు.

పాలనా వ్యవహారాల్లో తెలుగు

అమలుకు అధికారులు కృషిచేయాలి: యార్లగడ్డ



మీడియాతో మాట్లాడుతున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

సాక్షిప్రతినిధి, విజయనగరం : తెలుగు భాషాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషిచేస్తోందని, పాలనా వ్యవహారాల్లో తెలుగు అమలుకు అధికారులు చొరవచూపాలని రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. విజయనగరం జిల్లాలో ఆయన శుక్రవారం పర్యటించారు. కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో ఉత్తరప్రత్యుత్తరాల్లో తెలుగు భాష అమలు తీరును పరిశీలించారు. అనంతరం డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి మహాకవి గురజాడ అప్పారావు, చాగంటి సోమయాజులు, రోణంకి అప్పలస్వామి, పురిపండా అప్పలస్వామి, గిడుగు రామ్మూర్తి పంతులు, ఆదిభట్ల నారాయణదాసు వంటి మహనీయులు విశేష సేవలు అందించారని కొనియాడారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధికార భాషా సంఘాన్ని పునరుద్ధరించి, నెల్లూరులో తెలుగు భాష అధ్యయన కేంద్రం ఏర్పాటుకు ఐదు ఎకరాల స్థలాన్ని ఉచితంగా కేటాయించారని తెలిపారు. పాలనా వ్యవహారాల్లో తెలుగు భాష వాడకాన్ని విస్తృతం చేసేందుకు రాష్ట్ర గవర్నర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించినట్లు చెప్పారు. అమరావతిలో భాషా నిపుణులతో తర్జుమా కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. చట్టం ప్రకారం ప్రతి షాపు, వాణిజ్య సంస్థ తెలుగులో తప్పనిసరిగా బోర్డు పెట్టాలని, ఇందు కోసం కార్మిక శాఖ, వాణిజ్య పన్నుల శాఖ కృషి చేయాలని కోరారు. కలెక్టర్ సూర్యకుమారి, ఎస్పీ ఎం.దీపిక, డీఆర్వో గణపతిరావు, అధికార భాషా సంఘ పూర్వ సభ్యుడు డాక్టర్ ఎ.గోపాలరావు, గురజాడ వారసులు వెంకటేశ్వరప్రసాద్, ఇందిర, కాపుగంటి ప్రకాష్ పాల్గొన్నారు.

అగ్గిపెట్టెల ప్యాకింగ్.. సిగరెట్ల స్మగ్లింగ్

- బిహార్ నుంచి తిరుపతి జిల్లా నాయుడుపేటకు రవాణా
- రూ.2.4 కోట్ల విలువైన 48 లక్షల సిగరెట్లు
- స్వాధీనం చేసుకున్న కస్టమ్స్ అధికారులు



స్వాధీనం చేసుకున్న సిగరెట్లతో కస్టమ్స్‌శాఖ అదనపు కమిషనర్ సాధునరసింహారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది

కాకినాడ: అగ్గిపెట్టెల రవాణా పేరుతో అక్రమంగా తరలిస్తున్న రూ.2.40 కోట్ల విలువైన సిగరెట్లను కాకినాడ జిల్లా కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కస్టమ్స్ శాఖ అదనపు కమిషనర్ సాధు నరసింహారెడ్డి, సహాయ కమిషనర్ ఎస్.రఘురామ్ ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం విలేకర్లకు తెలిపారు. వారు తెలిపిన మేరకు.. చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారిలో విదేశీ సిగరెట్లను అక్రమంగా తరలిస్తున్నట్టు కస్టమ్స్ విభాగానికి సమాచారం అందింది. దీంతో అధికారులు సిబ్బందితో కలిసి బుధవారం కాకినాడ జిల్లా అన్నవరం సమీపంలోని బెండపూడి సమీపంలో చెక్‌పోస్టు వద్ద మాటు వేశారు. అటుగా వెళ్తున్న లారీలో సరుకును తనిఖీ చేశారు. బిహార్‌లోని పాట్నా నుంచి మన రాష్ట్రంలోని తిరుపతి జిల్లా నాయుడుపేటకు అగ్గిపెట్టెల పేరుతో సిగరెట్లు రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. పైకి అగ్గిపెట్టెల ప్యాకింగ్‌లా కనిపించే దాదాపు 400 కార్టన్లలో 48 లక్షల స్వదేశీ సిగరెట్లను గుర్తించారు. వీటివిలువ రూ.2.40 కోట్లు అని తేల్చారు. వీటికి పన్నులు చెల్లించకుండా అక్రమంగా రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. ఈ కేసు తమ పరిధిలోకి రాని కారణంగా విశాఖలోని సెంట్రల్ జీఎస్టీ పన్నుల విభాగానికి అప్పగించారు. ఈ దాడుల్లో కస్టమ్స్ సూపరింటెండెంట్లు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సౌర వలయాలు

ఫొటోల్లో కన్పిస్తున్నది సూర్యుని చుట్టూ ఏర్పడ్డ వెలుతురు వలయం (సన్ హాలో). రెండో ఫొటోలోది భూమ్మీద నుంచి కన్పిస్తున్నది కాగా, మొదటి ఫొటోలోనిదేమో అంగారకునిపై నుంచి కన్పించిన సన్ హాలో. అరుణ గ్రహంపై జీవం ఆనవాళ్లను అన్వేషించే క్రమంలో పెర్సెవరెన్స్ రోవర్ ఈ అరుదైన దృగ్విషయాన్ని గత డిసెంబర్లో అనుకోకుండా క్లిక్‌మనిపించింది. 2021 డిసెంబర్ 15న వాటిని నాసాకు పంపింది. సన్ హాలో భూమి పై నుంచి తరచూ కనిపిస్తూనే ఉంటుంది గానీ అంగారకునిపై నుంచి కంటబడటం ఇదే తొలిసారని స్పేస్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ప్లానెటరీ సైంటిస్టు మార్క్ లేమన్ చెప్పారు. 2020లో నాసా ఈ రోవర్‌ను అంగారకునిపైకి పంపించడం తెలిసిందే.

ఏమిటీ సన్ హాలో...?

మేఘాల్లో అసంఖ్యాకమైన సూక్ష్మ మంచు స్ఫటికాలుంటాయి. కాంతి వాటి గుండా సాగే క్రమంలో అప్పడప్పుడూ విడిపోవడంతో పాటు వక్రీభవనం కూడా చెందుతుంటుంది. ఫలితంగా ఒక్కోసారి ఇంద్రధనుస్సును తలపించే కాంతి వలయాలు ఏర్పడతాయి. నిర్దిష్ట కోణం నుంచి చూసినప్పుడు ఇవి వృత్తాకారంలో కనువిందు చేస్తాయి. వాటిని సన్ హాలోగా పిలుస్తారు. ఇలా భూమ్మీది నుంచి కన్పించే వలయాలు సాధారణంగా 22 డిగ్రీల కోణంలో ఏర్పడేవి అయుంటాయని అమెరికాలోని ఇల్లినాయీ యూనివర్సిటీ అధ్యయనంలో తేలింది. అయితే భూమితో పోలిస్తే అంగారకునిపై నీటి శాతం అత్యల్పం. అక్కడ అత్యధికంగా ఉండేది కార్బన్ డయాక్సైడే. కాబట్టి పెర్సెవరెన్స్ రోవర్ అందించిన ఫొటోలు నిజంగా సన్ హాలోకు సంబంధించినవేనా అని శాస్త్రవేత్తలు మీమాంసలో పడ్డారు. బహుశా రోవర్ తాలూకు కెమెరా కోణం వల్ల అలాంటి వెలుతురు వలయం ఏర్పడి ఉండొచ్చన్న అభిప్రాయమూ వ్యక్తమైంది. అయితే చివరికి ఇది దుమ్మూ ధూళి వల్ల ఏర్పడ్డది కాదని, సన్ హాలోయేనని తేల్చారు. - నేషనల్ డెస్క్, సాక్షి





అనుసంధానమే బలం

ఎస్సీఓ సభ్యదేశాలకు మోదీ పిలుపు

- 'తయారీ'లో గ్లోబల్ హబ్‌గా భారత్
- నవీన ఆవిష్కరణలకు ఊతం
- 70,000కు పైగా స్టార్టప్‌లు
- మా అనుభవాలను వాడుకోండి
- సప్లై చైన్లను అభివృద్ధి చేసుకుందాం



ఎస్సీఓ సదస్సు సందర్భంగా జిన్‌పింగ్, పుతిన్ తదితర దేశాధినేతలతో మోదీ

సమర్‌ఖండ్: షాంఘై కో–ఆపరేషన్ ఆర్గనైజేషన్ సభ్యదేశాల నడుమ అనుసంధానం మరింత పెరగాలని ప్రధాని నరేంద్ర మోదీ అభిలషించారు. లక్ష్యాల సాకారానికి మెరుగైన అనుసంధానం, రవాణా సదుపాయాల విషయంలో పరస్పరం పూర్తి హక్కులు కల్పించడం ముఖ్యమన్నారు. ఉజ్బెకిస్తాన్‌లోని సమర్‌ఖండ్‌లో శుక్రవారం ఎస్సీఓ శిఖరాగ్ర సదస్సులో మోదీ మాట్లాడారు. కరోనా, ఉక్రెయిన్–రష్యా యుద్ధం దేశాలతో మధ్య రవాణా వ్యవస్థలు దెబ్బతిన్నాయని, ప్రపంచవ్యాప్తంగా ఇంధన, ఆహార కొరత ఏర్పడిందని గుర్తుచేశారు. అందుకే విశ్వసనీయమైన, ప్రభావవంతమైన, వైవిధ్య భరితమైన సప్లై చైన్లను అభివృద్ధికి సభ్యదేశాలన్నీ కృషి చేయాలన్నారు. ఈ ఏడాది భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే అత్యధికంగా 7.5 శాతం వృద్ధి సాధించనున్నట్లు చెప్పారు. ఎస్సీఓ సభ్యదేశాల మధ్య మరింత సహకారం, పరస్పర విశ్వాసానికి భారత్ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు.

తృణధాన్యాల సాగును ప్రోత్సహించాలి

ప్రపంచదేశాల్లో ఆహార భద్రత సంక్షోభంలో పడిందని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. "దీనికి ఆచరణీయ పరిష్కారముంది. తృణధాన్యాల సాగును, వినియోగాన్ని భారీగా ప్రోత్సహించాలి. తృణధాన్యాల సాగు వేల ఏళ్లుగా ఉన్నదే. ఇవి చౌకైన సంప్రదాయ పోషకాహారం. మిల్లెట్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించే అంశాన్ని పరిశీలించాలి" అన్నారు.

ప్రజలే కేంద్రంగా అభివృద్ధి మోడల్

"కరోనాతో ప్రపంచమంతటా ఆర్థిక వ్యవస్థలు కుదేలయ్యాయి. అవి తిరిగి కోలుకోవడంలో ఎస్సీఓ పాత్ర కీలకం" అని మోదీ అభిప్రాయపడ్డారు. "ప్రపంచ జీడీపీలో ఎస్సీఓ వాటా 30 శాతం. జనాభాలో 40 శాతం" అన్నారు. తయారీ రంగంలో భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రతిభావంతులైన యువత వల్ల ఇండియా సహజంగానే ప్రపంచదేశాలకు పోటీదారుగా ఎదుగుతోందని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది 7.5 శాతం వృద్ధితో ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో అగ్రగామిగా ఎదగబోతున్నామని వివరించారు. టెక్నాలజీని సక్రమంగా ఉపయోగించుకుంటున్నామని, తమ అభివృద్ధి మోడల్‌కు ప్రజలే కేంద్రమని తెలిపారు. ప్రతి రంగంలో నవీన ఆవిష్కరణలకు ఊతం ఇస్తున్నామని, ఇండియాలో ప్రస్తుతం 70,000కు పైగా స్టార్టప్‌లు పని చేస్తున్నాయని వెల్లడించారు. ఇందులో 100కు పైగా యూనికార్న్ కంపెనీలు ఉన్నాయన్నారు. ఇండియా సంపాదించిన అనుభవం ఎస్సీఓలోని ఇతర దేశాలు సైతం ఉపయోగించుకోవచ్చని అభిప్రాయపడ్డారు. స్టార్టప్‌లు, ఇన్నోవేషన్‌పై ప్రత్యేక వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయడం ద్వారా తమ అనుభవాన్ని ఇతర దేశాలతో పంచుకుంటామని చెప్పారు.

ప్రపంచానికి భారత్ గమ్యస్థానం

మెడికల్, వెల్‌నెస్ టూరిజంలో ప్రపంచానికి భారత్ గమ్యస్థానంగా మారిందని మోదీ అన్నారు. తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్యం తమదేశంలో పొందవచ్చని తెలిపారు.

ఇక భారత్ సారథ్యం

రొటేషన్ విధానంలో భాగంగా ఎనిమిది మంది సభ్యుల ఎస్సీఓ సారథ్యం ఉజ్బెకిస్తాన్ నుంచి భారత్ చేతికి వచ్చింది. 2023లో ఎస్సీఓ శిఖరాగ్రానికి భారత్ ఆతిథ్యమివ్వనుంది. ఈ విషయంలో భారత్‌కు అన్నివిధాలా సహకరిస్తామని ఉజ్బెక్ అధ్యక్షుడు షౌకట్ మిర్జియోయెవ్ చెప్పారు. ఆయనతో కూడా మోదీ భేటీ అయ్యారు.

పలకరింపుల్లేవ్.. కరచాలనాల్లేవ్

న్యూఢిల్లీ: ఉజ్బెకిస్తాన్‌లోని సమర్‌ఖండ్‌లో ఎస్సీవో సదస్సుకు హాజరైన భారత్ ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఎడమొహం పెడమొహంగా ఉన్నారు. శుక్రవారం ఒకే వేదికపైన ఫొటోల కోసం మిగతా నేతలతో కలిసి పక్కపక్కనే నిలబడిన సమయంలోనూ ఒకరినొకరు పట్టనట్లుగా వ్యవహరించారు. చిరునవ్వుతో పలకరించుకోలేదు. కరచాలనం చేసుకోలేదు. గల్వాన్ ఘటన అనంతరం ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతుండటం తెలిసిందే. అప్పటినుంచి వారు ఒకే వేదికపైకి రావడం ఇదే మొదటిసారి.

అమెరికాపై జిన్‌పింగ్ విమర్శలు

"కొన్ని శక్తులు ఇంకా ప్రచ్ఛన్న యుద్ధ భావజాలం, ఏకపక్ష పోకడలు ప్రదర్శిస్తున్నాయి. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో సుస్థిరతను విచ్ఛిన్నం చేయజూస్తున్నాయి" అని అమెరికానుద్దేశించి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ విమర్శలు గుప్పించారు. వాటిపట్ల ఎస్సీఓ సభ్యదేశాలు జాగ్రత్తగా ఉండాలన్నారు. రక్షణ సహా అన్ని రంగాల్లో సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. "ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ల కోసం సభ్య దేశాలకు చెందిన 2,000 మంది సైనిక సిబ్బందికి చైనాలో శిక్షణ ఇస్తాం. ఉమ్మడి అభివృద్ధి బ్యాంకు ఏర్పాటు చేసుకుందాం" అంటూ ప్రతిపాదించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆహార ధాన్యాలు తదితరాల కోసం వర్ధమాన దేశాలకు 105 కోట్ల డాలర్ల మేరకు సాయం అందిస్తామని ప్రకటించారు.

వేధింపులాపి.. మంచి పనులు చేయండి

- ఈ మద్యం కుంభకోణం ఏమిటో అర్థం కావడం లేదు: కేజ్రీవాల్
- మళ్లీ దేశవ్యాప్తంగా ఈడీ దాడులు

న్యూఢిల్లీ: బీజేపీ నేతలు ఆరోపిస్తున్న మద్యం కుంభకోణం ఏమిటో తనకు ఇప్పటివరకు అర్థం కాలేదని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. సీబీఐ, ఈడీలతో అందరినీ వేధించడం మానేసి, ఇకనైనా దేశం హితం కోసం మంచి పనులు చేయాలని కేంద్రానికి హితవు పలికారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వ ఎక్సైజ్ విధానంలో అవకతవకల కేసులో భాగంగా ఈడీ శుక్రవారం మరోసారి దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో సోదాలు చేసింది. దీనిపై కేజ్రీవాల్ స్పందించారు. 'మద్యం పాలసీలో రూ.1.5 లక్షల కోట్ల కుంభకోణం జరిగిందని బీజేపీ నేత ఒకరన్నారు. ఢిల్లీ బడ్జెట్ అంతా కలిపి రూ.70 వేల కోట్లు. మరిక రూ.1.5 లక్షల కోట్ల స్కాం ఎలా సాధ్యం? మరో బీజేపీ నేత రూ.8 వేల కోట్ల కుంభకోణమని, ఇంకొకరు రూ. 1,100 కోట్లని అంటున్నారు. లెఫ్టినెంట్ గవర్నరేమో రూ.144 కోట్లని ఆరోపిస్తున్నారు. ఈ కుంభకోణం విలువ రూ.1 కోటి మాత్రమేనని సీబీఐ అంటోంది" అని ఆయన మీడియాతో అన్నారు. "మా మంత్రి మనీశ్ సిసోడియా సొంతూరులోని నివాసం, బ్యాంకు ఖాతాల సోదాల్లోనూ సీబీఐకి ఏమీ దొరకలేదు. మరి స్కాం ఎక్కడ జరిగినట్టు?" అని ప్రశ్నించారు. అనవసర అంశాలపై దృష్టి పెడితే దేశం వెనుకబడిపోతుందని కేంద్రానికి హితవు పలికారు.

తెలంగాణ, ఏపీల్లోనూ దాడులు


సాక్షి, న్యూఢిల్లీ/నెల్లూరు క్రైం: ఢిల్లీ మద్యం పాలసీ మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 40 చోట్ల ఈడీ శుక్రవారం సోదాలు చేసింది. సోదా బృందాలకు పోలీసులు, పారా మిలటరీ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డికి చెందిన నెల్లూరు, ఢిల్లీ నివాసాల్లో తనిఖీలు జరిగాయి. నెల్లూరు రాయాజీవీధిలోని మాగుంట శ్రీనివాసులరెడ్డి పాత నివాసం, కార్యాలయాల్లో సోదాలు చేపట్టారు. అక్కడి సిబ్బందిని ప్రశ్నించారు. బీరువాలను తెరిపించి, అందులోని ఫైళ్లను పరిశీలించారు. బుచ్చిరెడ్డిపాలెం మండలం రేబాలలో నివాసముంటున్న ఎంపీ బంధువు (భార్య చెల్లెలి భర్త) శివరామకృష్ణారెడ్డి ఇంటిలోను ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ఇదే కేసులో ఈ నెల 6న కూడా ఇలాగే దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో ఈడీ సోదాలు జరిపిన విషయం తెలిసిందే.

యుద్ధాన్ని ముగించండి

పుతిన్‌తో చర్చల్లో మోదీ సూచన

బర్త్‌డే విషెస్ చెప్పిన పుతిన్

సమకాలీన ప్రపంచంలో యుద్ధాలకు తావు లేదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌పై యుద్ధానికి తక్షణం ముగింపు పలకాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు సూచించారు. ఎస్ఈఓ సదస్సు సందర్భంగా పుతిన్‌తో మోదీ చర్చలు జరిపారు. చర్చలు, దౌత్యాల ప్రాధాన్యతను నొక్కిచెప్పారు. "ఆహార, ఇంధన, ఎరువుల సంక్షోభం నేడు వర్ధమాన దేశాలకు అతి పెద్ద సమస్య. వీటికి వెంటనే పరిష్కారం కనిపెట్టేందుకు మీరు కృషి చేయాలి" అని పుతిన్‌కు సూచించారు. యుద్ధంపై భారత్ వైఖరిని, ఆందోళనను అర్థం చేసుకోగలనని పుతిన్ బదులిచ్చారు. దాన్ని వీలైనంత త్వరగా ముగించేందుకు ప్రయతిస్తానని హామీ ఇచ్చారు. ఫిబ్రవరిలో ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక మోదీ, పుతిన్ సమావేశమవడం ఇదే తొలిసారి. చర్చలు అద్భుతంగా సాగాయంటూ మోదీ ట్వీట్ చేశారు. "వర్తకం, ఇంధనం, రక్షణ వంటి పలు రంగల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవాలని నిర్ణయించాం. ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలూ చర్చకొచ్చాయి" అని వివరించారు. రష్యాతో బంధానికి భారత్ ఎంతో ప్రాధాన్యమిస్తుందని పునరుద్ఘాటించారు. శనివారంతో 72వ ఏట అడుగుపెడుతున్న మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. "రేపు నా ప్రియమిత్రుడు పుట్టిన రోజు జరుపుకోనున్నారు. రష్యా సంప్రదాయంలో ముందుగా శుభాకాంక్షలు చెప్పరు. అయినా మీకు, భారత్‌కు శుభాకాంక్షలు. మీ నేతృత్వంలో భారత్ మరింత అభివృద్ధి చెందాలి" అని ఆకాంక్షించారు. గత డిసెంబర్లో తన భారత పర్యటన తాలూకు జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. టర్కీ అధ్యక్షుడు తయ్యిప్ ఎర్డోగన్‌తో కూడా మోదీ భేటీ అయ్యారు.



పెచ్చరిల్లిన నిరుద్యోగం

- నిరుద్యోగులకు భరోసా ఇవ్వండి
- భారత్ జోడో యాత్రలో రాహుల్

కొల్లం: దేశాన్ని నిరుద్యోగ సమస్య పట్టి పీడిస్తోందని, గత 45 ఏళ్లలో రికార్డు స్థాయికి నిరుద్యోగం రేటు చేరుకుందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. యువతలో సానుకూల దృక్పథాన్ని నెలకొల్పి వారి భవిష్యత్‌ను బలోపేతం చేయాలన్న నమ్మకం కలిగించాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ భారత్ జోడో యాత్ర తొమ్మిదో రోజు కొల్లామ్ జిల్లా పొలయతోడు నుంచి కరునాగపల్లి వరకు సాగింది. తన పాదయాత్ర విశేషాలను ఫేస్‌బుక్‌లో పంచుకున్న రాహుల్ గాంధీ తాను ఎంతో మంది యువతీయువకుల్ని కలుసుకున్నానని, ప్రభుత్వం నుంచి వారు ఏం ఆశిస్తున్నారో అర్థం చేసుకున్నానని వెల్లడించారు. యువ శక్తిని భారత్ సద్వినియోగం చేసుకుంటే దేశం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. "ఇప్పుడు యువత ఉద్యోగాలు దొరక్క తీవ్ర నిరాశ నిస్పృహల్లో ఉన్నారు. 45 ఏళ్లలో నిరుద్యోగం రేటు అత్యధిక స్థాయికి చేరుకుంది. యువతలో నిరాశను పోగొట్టి భవిష్యత్‌పై భరోసా కల్పించాల్సిన బాధ్యత మనదే" అని రాహుల్ అన్నారు.

స్కూలు విద్యార్థులతో మాట మంతీ

రాహుల్ పాదయాత్రను చూడడానికి జనం భారీగా తరలివచ్చారు. దారి పొడవునా ప్రజలు ఆయనను చూడడానికి ఎగబడ్డారు. సీనియర్ సిటిజన్లు సెక్యూరిటీని దాటుకొని కరచాలనానికి, సెల్ఫీలకు ప్రయత్నించారు. ఒక కథాకళి డ్యాన్సర్ నాట్యం చేయడంతో రాహుల్ ఆసక్తిగా చూశారు. నీన్దకరలోని ఒక పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. వారితో ఫోటోలు దిగారు. "కేరళ అందాలు ప్రపంచ ప్రసిద్ధి పొందాయి. ఇక్కడి ప్రజలు రాష్ట్రానికి మరింత అందం తెస్తున్నారు" అన్నారు.



కేరళలోని కొల్లంలో రాహుల్‌ను ముద్దాడుతున్న అభిమాని

ఇళ్లు, గోడలు కూలి 22 మంది మృతి

యూపీలో వర్షాలు మిగిల్చిన విషాదం



లక్నో: ఉత్తరప్రదేశ్‌లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు పేదల ఉసురు తీశాయి. శుక్రవారం రాజధాని లక్నో, ఉన్నావ్, ఫతేపూర్, సీతాపూర్‌లలో గోడలు, ఇల్లు కూలిన ఘటనల్లో మొత్తం 22 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 9 మంది కూలీలున్నారు. లక్నోలోని దిల్‌కుషా ఏరియాలో ఆర్మీ కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ పనుల్లో పాల్గొంటున్న కూలీలు కొందరు ఆ గోడ పక్కనే గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. భారీ వర్షాలతో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత నిర్మాణంలో ఉన్న ప్రహరీ కూలీల గుడిసెలపై కూలిపడింది. శిథిలాల కింద చిక్కుకుని తొమ్మిది మంది చనిపోయారు. గాయపడిన ఒక్కరిని మాత్రం పోలీసులు రక్షించి ఆస్పత్రికి తరలించారు. వీరంతా ఝాన్సీ జిల్లాకు చెందిన వారని అధికారులు తెలిపారు. అదేవిధంగా, ఉన్నావ్ జిల్లా కాంతా గ్రామంలోని ఓ ఇంటి గోడ కూలి ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు, ఝాలి హాయ్, కసందా గ్రామాల్లో ఇళ్లు కూలి ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు. ఫతేపూర్ జిల్లాలో ముగ్గురు, సీతాపూర్ జిల్లాలో ఒకరు, ప్రయాగ్‌రాజ్‌లో ఇద్దరు చిన్నారులు ఇంటి గోడకూలి మీద పడటంతో ప్రాణాలు కోల్పోయారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. లక్నో విషాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంతాపం ప్రకటించారు.

56 వంటకాలతో మోదీ థాలి

- ఇద్దరు విజేతలకు రూ.8.5 లక్షలు
- ఉచితంగా కేదార్‌నాథ్ యాత్ర
- ప్రధాని జన్మదినం సందర్భంగా ఢిల్లీలో ఓ రెస్టారెంట్ ఆఫర్



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఢిల్లీలో ఓ రెస్టారెంట్ వినూత్న ఆఫర్ ప్రకటించింది. "శనివారం నుంచి 26వ తేదీ దాకా 56 రకాల ఉత్తరాది వంటకాలతో ప్రత్యేకంగా మోదీ థాలి వడ్డిస్తాం. 40 నిమిషాల్లో థాలీని పూర్తి చేసిన వారికి రూ.8.5 లక్షలు అందజేస్తాం. ఇద్దరు విజేతలను మోదీకెంతో ఇష్టమైన కేదార్‌నాథ్ సందర్శనకు పంపిస్తాం" అని ప్రకటించింది. ఈ థాలీలో 20 రకాల కూరలతోపాటు రకరకాల బ్రెడ్లు, పప్పు, గులాబ్ జామ్, కుల్ఫీ సహా మొత్తం 56 వెరైటీలుంటాయి. వెజిటేరియన్ థాలి రూ.2,600, నాన్ వెజ్ థాలి రూ.2,900. డిన్నర్ థాలి అయితే మరో రూ.300 ఎక్కువట. వీటిపై పన్నులు అదనం. మోదీ అంటే తమకెంతో అభిమానమని కన్నాట్ ప్లేస్‌లో ఉన్న ఆర్డర్ 2.1 అనే ఈ రెస్టారెంట్ ఓనర్ సువీత్ కాల్రా చెప్పారు. "మా రెస్టారెంట్ అందించే వెరైటీ థాలీలకు ఎంతో ఆదరణ ఉంది. ధరలను తగ్గించాలని మోదీని కోరుతూ 10 రోజుల్లో 'ద్రవ్యోల్బణం–మాంద్యం థాలి' కూడా తీసుకొస్తాం" అన్నారు. ఈ రెస్టారెంట్‌లో 'పుష్ప థాలి', 'బాహుబలి థాలి' కూడా సర్వ్ చేస్తుండటం విశేషం!

ప్రధాని బహుమతుల వేలం

ఎగ్జిబిషన్ ప్రారంభించిన కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీకి వచ్చిన 1,222 మైన జ్ఞాపికలు, బహుమతుల ఈ–వేలం నాలుగో విడత ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. ఇది అక్టోబర్ 2 దాకా సాగనుంది. ఢిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను శుక్రవారం కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. వేలం ద్వారా సమకూరే మొత్తం నమామి గంగ ప్రాజెక్టుకు వెళ్తుందని గుర్తు చేశారు. దేశ జీవనాడి అయిన గంగా నదిని పరిరక్షించేందుకు ఉద్దేశించిన ఈ వేలంలో అందరూ పాల్గొనాలని కోరారు.

ఉక్రెయిన్‌లో శవాల దిబ్బలు

ఇజియం (ఉక్రెయిన్): ఉక్రెయిన్‌లోని ఖర్కీవ్ ప్రాంతంలో భారీగా శవాల దిబ్బలు బయట పడుతున్నాయి. ఇజియంలో రష్యా బలగాలు 400కు పైగా మృతదేహాలను పూడ్చిపెట్టిన ప్రాంతాన్ని ఉక్రెయిన్ బలగాలు గుర్తించాయి. కొన్నింటిపై తూటాల గాయాలుండగా, మరికొందరు క్షిపణులు, వైమానిక దాడుల్లో మరణించి ఉంటారని భావిస్తున్నారు. కొన్ని మృతదేహాలకు చెవులు కోసేసి ఉండటంతో రష్యా సైనికులు చిత్రహింసలకు గురిచేసి చంపినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్కడికి సమీపంలోనే మరో చోట 17 ఉక్రెయిన్ సైనికుల మృతదేహాలను కొనుగొన్నారు. దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందిస్తూ..బుచా, మరియుపోల్, ఇజియం..రష్యా ప్రతి చోటా మరణశాసనం రాసింది. ఇందుకు ఆ దేశం బాధ్యత వహించాల్సి ఉంటుంది అని అన్నారు. ఇలా ఉండగా, రష్యాను సైనికపరంగా ఎదుర్కొనేందుకు ఉక్రెయిన్‌కు మరో 600 మిలియన్ డాలర్ల సాయాన్ని అందజేస్తామని అమెరికా ప్రకటించింది.



విదేశీ వర్సిటీల్లో చేరేలా...
'ఉక్రెయిన్' విద్యార్థులకు సాయం

పోర్టల్ తీసుకురండి: సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: "యుద్ధం కారణంగా ఉక్రెయిన్ నుంచి మధ్యలోనే తిరిగొచ్చిన భారత వైద్య విద్యార్థులు ఇతర విదేశీ యూనివర్సిటీల్లో కోర్సు పూర్తి చేసేందుకు అన్ని విధాలా సాయపడండి. దేశాలవారీగా వర్సిటీల్లో ఖాళీలు, ఫీజులు తదితర పూర్తి వివరాలతో ఓ వెబ్ పోర్టల్ ఏర్పాటు చేయండి" అని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాల వైద్య విద్యార్థుల పిటిషన్లపై న్యాయమూర్తులు జస్టిస్ హేమంత్ గుప్తా, జస్టిస్ సుధాంశు ధులియాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. కోర్టు సూచనలపై కేంద్రం వైఖరి తెలపడానికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమయం కోరారు. ఉక్రెయిన్ నుంచి తిరిగొచ్చిన సుమారు 20 వేల మంది విద్యార్థులను యుద్ధ బాధితులుగా పరిగణించాలని వారి తరఫున న్యాయవాది కోరగా విషయాన్ని అంత దూరం తీసుకెళ్లొద్దని ధర్మాసనం సూచించింది. "వాళ్లు స్వచ్ఛందంగానే ఉక్రెయిన్ వెళ్లారని గుర్తుంచుకోవాలి. పైగా వాళ్లు యుద్ధ రంగంలో లేరు కూడా" అని జస్టిస్ గుప్తా అన్నారు. విద్యార్థులకు సాయం చేయడానికి కేంద్రం పలు చర్యలు చేపట్టిందని మెహతా తెలిపారు. విద్యార్థులకు అనుకూలంగా ఉండే కొన్ని దేశాలతో భారత్ సంబంధాలు పెట్టుకుందన్నారు. విద్యార్థులు అనుకూలమైన విదేశీ వర్సిటీని ఎలా ఎంచుకుంటారని ధర్మాసనం ప్రశ్నించింది. లైజనింగ్ అధికారిని నియమించామని చెప్పగా ఒక్క అధికారి ఉంటే చాలదని పేర్కొంది. వైద్య విద్య పూర్తి చేయాలనుకుంటే విద్యార్థులు ఓ దారి వెతుక్కోవాల్సిందేనని అభిప్రాయపడింది. విదేశీ వర్సిటీలు ప్రవేశాలు కల్పించగలిగితే భారత వర్సిటీలకు ఎందుకు సాధ్యం కాదని విద్యార్థుల తరఫు న్యాయవాది ప్రశ్నించారు. దేశీయ వర్సిటీలపై విద్యార్థులకు హక్కు లేదని ధర్మాసనం బదులిచ్చింది. విచారణను సెప్టెంబరు 23కు వాయిదా వేసింది.

క్లుప్తంగా...

ఢిల్లీ 'ఆప్' ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్ అరెస్టు

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎమ్మెల్యే, ఢిల్లీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అమానతుల్లా ఖాన్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. వక్ఫ్ బోర్డు నియామకాల్లో అక్రమాల ఆరోపణల్లో ఆయనపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఖాన్ నివాసంలో సోదాల సందర్భంగా తమపై ఎమ్మెల్యే బంధువులు, అనుచరులు దాడికి పాల్పడ్డారని ఏసీబీ బృందం ఆరోపించింది. రూ.24 లక్షల నగదు, రెండు లైసెన్స్ లేని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. ఖాన్‌పై బీజేపీ తప్పుడు కేసు బనాయించిందని ఆప్ ఆరోపించింది.

పంద్రాగస్టున హైడ్రో రైలు

భువనేశ్వర్: దేశ తొలి హైడ్రోజన్ రైలును వచ్చే పంద్రాగస్టు నాడు ఆవిష్కరిస్తామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. "చెన్నైలోని ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో తయారైన ఈ రైలు చాలా విషయాల్లో ఇతర దేశాల్లోని అత్యుత్తమ రైళ్ల కంటే మెరుగైనది. గరిష్ట వేగంలోనూ డ్రైవర్ క్యాబిన్లో ఉంచిన నీళ్ల గ్లాసు కొంచెమైనా తొణకనంతటి స్థిరత్వం దీని సొంతం" అని వివరించారు. 100 కి.మీ. వేగం అందుకోవడానికి జపాన్ బులెట్ ట్రైన్‌కు 55 సెకన్లు పడితే వందే భారత్ రైలు 52 సెకన్లలోనే ఆ ఘనత సాధించిందని మంత్రి అన్నారు. హైడ్రోజన్‌తో నడిచే తొలి రైలును జర్మనీ గత నెల ప్రారంభించింది.

'సుప్రీం బెంచ్'ల పిల్ తిరస్కరణ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సుప్రీంకోర్టు బెంచ్‌ల ఏర్పాటు కోరుతూ లోక్ ప్రహరి అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిల్‌ను విచారణకు స్వీకరించేందుకు అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం నిరాకరించింది. వీడియో కాన్ఫరెన్స్ సౌలభ్యం వచ్చాక దేశంలో ఎక్కడి నుంచైనా లాయర్లు వాదించగలుగుతున్నారని న్యాయమూర్తులు జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ హిమా కోహ్లీలతో కూడిన ధర్మాసనం గుర్తు చేసింది.

'ఒకే యూనిఫాం' పిల్ తిరస్కరణ

దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో సిబ్బంది, విద్యార్థులకు ఒకే డ్రెస్ కోడ్ ఉండేలా ఆదేశించాలంటూ దాఖలైన పిల్‌ను కూడా ధర్మాసనం తిరస్కరించింది. ఇది కోర్టు పరిధిలోకి రాదని స్పష్టం చేసింది.

బీజేపీలోకి కెప్టెన్ అమరీందర్



చండీగఢ్: పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, పంజాబ్ లోక్ కాంగ్రెస్ (పీఎల్‌సీ) చీఫ్ కెప్టెన్ అమరీందర్ సింగ్ (80) వచ్చే వారం బీజేపీలో చేరనున్నారు. పీఎల్‌సీని బీజేపీలో విలీనం చేయనున్నారు. ఫిబ్రవరిలో జరిగిన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో పీఎల్‌సీ, బీజేపీ, సుఖ్‌దేవ్ సింగ్ నేతృత్వంలోని అకాలీదళ్‌తో కలిసి పోటీ చేయడం, అమరీందర్ ఓడిపోవడం తెలిసిందే.

చైనా రుణ యాప్‌ల కేసు... 46 కోట్లు జప్తు చేసిన ఈడీ

న్యూఢిల్లీ: తక్షణ రుణాల పేరుతో ప్రజల్ని వేధిస్తున్న చైనా రుణ యాప్‌లకు సంబంధించిన రూ.46.67 కోట్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్తంభింపజేసింది. చైనా నియంత్రణలో ఉన్న రుణాల యాప్‌లకు గేట్‌వేలుగా పనిచేస్తున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈజ్‌బజ్, రేజోర్‌పే, క్యాష్‌ఫ్రీ, పేటీఎం యాప్‌ల గేట్‌వేలలో ఉన్న సొమ్ముల్ని ఫ్రీజ్ చేసినట్టుగా ఈడీ శుక్రవారం వెల్లడించింది. మనీల్యాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ నిధుల్ని స్తంభింపజేసినట్టు తెలిపింది. ప్రజలకు సులభంగా రుణాలు ఇస్తూ చైనా యాప్‌లు భారీగా ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో ఈ వారంలో ఢిల్లీ, బెంగుళూరు, ముంబై ఘజియాబాద్ లక్నో వంటి నగరాల్లో ఆ కంపెనీలకు గేట్‌వేలకు పనిచేస్తున్న యాప్‌ల కార్యాలయాలపై ఈడీ దాడులు చేసిన విషయం తెలిసిందే.

జాత్యహంకార హింసకు తావు లేదు: బైడెన్




వాషింగ్టన్: అమెరికాలో ఇటీవల భారతీయులపై జరుగుతున్న జాత్యహంకార దాడులపై అధ్యక్షుడు జో బైడెన్ తీవ్రంగా స్పందించారు. తెల్ల జాతి ఆధిపత్యానికి, జాత్యంహకార హింసకి తమ దేశంలో చోటు లేదన్నారు. హిందువులు, సిక్కులు, ముస్లిమ్‌లు ఎవరిపై జాత్యహంకార దాడులు జరిగినా తామంతా వారికి మద్దతుగా నిలబడతామని భరోసా ఇచ్చారు. వైట్‌హౌస్ ఆధ్వర్యంలో గురువారం "ఐక్యంగా నిలబడదాం" పేరిట నిర్వహించిన సదస్సులో బైడెన్ మాట్లాడుతూ "మేము ఎక్కడ నుంచి వచ్చామన్నది ముఖ్యం కాదు. మేమంతా ఒక్కటే. విద్వేషంతో కూడిన హింసకు వ్యతిరేకంగా మేము ఒక్కటిగా నిలబడతాం. అందరినీ ఐక్యం చేస్తాం" అని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం ఆసియన్ అమెరికన్లు రోడ్ల మీదకి కూడా రావడానికి భయపడే పరిస్థితులున్నప్పుడు ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌తో కలిసి తాను అట్లాంటాకి వెళ్లి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచామన్నారు.


ప్రవాసుల ఓట్లపై ట్రంప్ వల

వాషింగ్టన్: అమెరికా కాంగ్రెస్‌లోని ప్రజాప్రతినిధుల సభకు నవంబర్‌లో మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ప్రవాస భారతీయుల ఓట్లను ఆకర్షించేందుకు రిపబ్లికన్ పార్టీ ప్రయత్నాలు ప్రారంభించింది. 'భారత్–అమెరికా సబ్‌సే అచ్చే దోస్త్' అని డొనాల్డ్ ట్రంప్ హిందీలో నినదిస్తున్న వీడియోను రిపబ్లికన్ హిందూ కొయిలేషన్ (ఆర్‌హెచ్‌సి) విడుదల చేసింది. 2016 అధ్యక్ష ఎన్నికల్లో 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్' నినాదం కలిసొచ్చిందన్న సెంటిమెంట్‌తో దీన్ని రూపొందించారట.

పులి అలజడి..



బొబ్బిలి రూరల్: కోమటపల్లి–కుమందానపేటల మధ్య, ఎ.వెలగవలస, నారశింహునిపేట పంట పొలాల్లో పులి పాదముద్రలను శుక్రవారం గుర్తించిన స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గొల్లపల్లి, అలజంగి, పిరిడి, కోమటపల్లి, నారశింహునిపేట, ఎ.వెలగవలస మీదుగా మక్కువ మండలంలోని కన్నంపేట వెళ్లినట్టుగా భావిస్తున్నారు.



స్వర్ణ కాంతులు

రేగిడి : సాయంసంధ్యా సమయాన.. ఆకాశం స్వర్ణ కాంతులీనింది. రేగిడి మండలంలోని కె. వెంకటాపురం వద్ద శుక్రవారం ప్రత్యక్షమైన ఈ సుందర దృశ్యం చూపరులకు కాసేపు కనువిందు కలిగించింది.

వర్ష సూచన



గుమ్మలక్ష్మీపురం: భారత వాతావరణ కేంద్రం (విశాఖపట్నం) అందించిన సమాచారం మేరకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వచ్చే 5 రోజుల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.స్రవంతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంటల సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

న్యూస్‌రీల్

రాజాం–పాలకొండ రోడ్డు పనులకు సీఎం సుముఖత



ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు అందించిన వినతిపత్రాన్ని చదువుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

రాజాం: రాజాం–పాలకొండ రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయాలని సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు కోరారు. అసెంబ్లీ హాల్ వద్ద సీఎంను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాజాం నుంచి పాలకొండ వరకూ రోడ్డు నిర్మాణానికి రూ.13 కోట్లు అవసరంగా ఆర్అండ్‌బీ శాఖ గతంలో ప్రతిపాదనలు పంపించిందని వివరించారు. దీనిపై సీఎం వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారని, త్వరలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు స్థానిక విలేకరులకు ఫోన్‌లో తెలిపారు.

నేడు హైకోర్టు జడ్జి కృష్ణమోహన్ రాక



విజయనగరం లీగల్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ జిల్లాలో శని, ఆదివారాలు పర్యటించనున్నారు. శనివారం ఉదయం 9 గంటలకు రామతీర్థం పుణ్యక్షేత్రాన్ని సందర్శిస్తారు. 11 గంటలకు పైడితల్లి అమ్మవారిని దర్శిస్తారు. భోజనానంతరం జిల్లా కోర్టు భవన సముదాయాన్ని పరిశీలిస్తారు. రాత్రి 7 గంటలకు న్యాయవాదుల సమావేశంలో పాల్గొంటారు. రాత్రి జెడ్పీ గెస్ట్‌హౌస్‌లో బస చేస్తారు. ఆదివారం ఉదయం సాలూరు, బొబ్బిలిలలోని ప్రసిద్ధ దేవాలయాలను సందర్శిస్తారు. బొబ్బిలిలో నూతనంగా నిర్మించిన కోర్టు భవన సముదాయాన్ని పరిశీలిస్తారు. సాయంత్రం విజయనగరంలోని రామనారాయణంను తిలకిస్తారు. రాత్రి 9 గంటలకు తిరిగి ఫలక్‌నుమా రైలులో విజయవాడ చేరుకుంటారు.

డిసెంబర్ 21న సామూహిక గృహప్రవేశం

- హౌసింగ్ ఈఈ శ్రీనివాసరావు

లక్కవరపుకోట (కొత్తవలస): జిల్లాలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో డిసెంబర్ 21వ తేదీన సామూహిక గృహ ప్రవేశాలను నిర్వహించనున్నట్టు గృహనిర్మాణ సంస్థ ఈఈ వి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజు 30 వేల గృహాల్లో ప్రవేశాలు నిర్వహిస్తామన్నారు. ఫేజ్–1లో మంజూరైన 74,003 గృహాల్లో 9,258 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. రూఫ్‌లెవెల్‌లో 15,588, బేస్‌మెంట్ స్థాయిలో 15,464, పునాదుల స్థాయిలో 28,716 ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయన్నారు. ఆయన వెంట సంస్థ డీఈ డి.శ్రీనివాసరావు, ఏఈ రామ్‌ప్రసాద్, ఎంపీడీఓ వై.పద్మజ ఉన్నారు.



ప్రగతి పథంలో జేఎన్‌టీయూ వర్సిటీ

- ఇటీవలే జేఎన్‌టీయూ–గురజాడ విజయనగరం వర్సిటీగా మార్పు
- అవసరమైన అన్ని సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం పచ్చజెండా
- వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు రాకతో పనులు చకచకా
- అదనపు భవనాల నిర్మాణానికి రూ.24.94 కోట్లు మంజూరు
- రూ.17.99 కోట్లతో అకడమిక్ భవన విస్తరణకు సన్నద్ధం
- విద్యార్థినులకు అదనంగా మూడో హాస్టల్ నిర్మాణానికి ప్రణాళిక

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం వర్సిటీ (జేఎన్‌టీయూ–జీవీ)... ఉత్తరాంధ్ర విద్యార్థులకు వరం. విద్యలనగరం విజయనగరానికి మణిహారం. సాంకేతిక చదువులకు ఆలవాలం. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే సరస్వతీనిలయం. ప్రభుత్వం చొరవతో వర్సిటీ స్థాయిలో వసతుల కల్పన పనులు ఊపందుకున్నాయి. విద్యార్థులకు కావాల్సిన సమస్త సౌకర్యాలు సమకూరుతున్నాయి. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏర్పాటైన జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) ఇంజినీరింగ్ కళాశాల గత జనవరి వరకూ జేఎన్‌టీయూ–కాకినాడకు అనుబంధంగానే కొనసాగింది. సీఎం వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి విద్యాలయాన్ని కాస్త స్వయంప్రతిపత్తి కలిగిన యూనివర్సిటీగా మార్పు చేశారు. ఆ స్థాయికి తగ్గట్టే అన్ని వనరులూ సమకూర్చేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తర్వాత పనులు మరింత వేగవంతమయ్యాయి.

అందుబాటులోకి సాంకేతిక విద్య..

వై.ఎస్.రాజశేఖరరెడ్డి తన పాదయాత్రలో భాగంగా ఉమ్మడి విజయనగరం జిల్లాకు వచ్చినపుడు ఇచ్చిన హామీ మేరకు జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలను 2007 సంవత్సరంలో స్థాపించారు. 80 ఎకరాల విస్తీర్ణంలో నాడు 5 బ్రాంచ్‌లతో ప్రారంభమైంది. తాత్కాలికంగా స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో తరగతులను నిర్వహించినప్పటికీ మూడేళ్లలోనే రెండు (బాలురకు, బాలికలకు ఒక్కోటి చొప్పున) వసతిగృహాలను నిర్మించారు. 2010 సంవత్సరాల్లో సొంత భవనాల్లోకి కళాశాల మారింది. వైఎస్ రాజశేఖరరెడ్డి అకాల మరణం తరువాత వచ్చిన పాలకులెవరూ జేఎన్‌టీయూ కళాశాలను పట్టించుకోలేదు. తగినన్ని నిధులు కేటాయించకపోవడంతో పూర్తిస్థాయిలో బోధన, బోధనేతర సిబ్బందినీ నియమించలేని పరిస్థితి ఏర్పడింది. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కళాశాలను వర్సిటీగా మార్పు చేశారు. అంతేకాదు, గురజాడ అప్పారావు పేరు జోడించి ఉత్తరాంధ్ర ప్రతిష్టను ఇనుమడింపజేశారు.

అదనపు సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం..

ప్రస్తుతం జేఎన్‌టీయూ–జీవీలో దాదాపు 15,265 చదరపు మీటర్ల విస్తీర్ణం ఉన్న మూడు అకడమిక్ బ్లాక్ భవనాలు, అలాగే 2,865 చదరపు మీటర్ల విస్తీర్ణంలో కళాశాల కేంద్ర గ్రంథాలయ భవనం ఉన్నాయి. నాలుగు వసతి గృహాల్లో చెరో రెండు చొప్పున విద్యార్థులు, విద్యార్థినులకు ఉన్నాయి. ఇప్పుడు యూనివర్సిటీగా మార్పు చేయడంతో అందుకు తగిన సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం నడుం బిగించింది. వివిధ విభాగాల విస్తరణలో భాగంగా భవనాల నిర్మాణానికి జాతీయ ఇంజినీరింగ్ కౌన్సిల్ (ఏఐటీసీ), జేఎన్‌టీయూ–కాకినాడ నుంచి దాదాపు రూ.24.94 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. అకడమిక్ బ్లాక్–3 (అడ్మినిస్ట్రేషన్ బ్లాక్), బాలికల వసతిగృహం, మెటలర్జికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ భవనాల విస్తరణతో పాటు తాగునీటి ట్యాంక్ ఏర్పాటు తదితర పనులు చేపట్టనున్నారు.

అదనపు సౌకర్యాలు ఇలా....

- ప్రస్తుతం ఉన్న రెండు అకడమిక్ బ్లాక్ భవనాలు సరిపోవడం లేదు. దీంతో ప్రభుత్వం మరో బ్లాక్ నిర్మించడానికి అనుమతులు ఇచ్చింది. జేఎన్‌టీయూ–కాకినాడ నుంచి నిధులు రూ.17.99 కోట్లు కేటాయించింది. జీ+2 విధానంలో బ్లాక్‌ను నిర్మించనున్నారు.
- బాలికలకు ప్రస్తుతం ఉన్న రెండు హాస్టల్ భవనాలతో పాటు మరో హాస్టల్ భవనం నిర్మాణానికి ఏఐసీటీ అనుమతి ఇచ్చింది. ఇందుకోసం రూ.3.25 కోట్ల నిధులను మంజూరు చేసింది. దాదాపు వంద మంది విద్యార్థినులకు సరిపోయేలా మూడంతస్తుల భవనాన్ని నిర్మించనున్నారు.
- లేబరేటరీలు కొత్తవి ఏర్పాటుకానున్నాయి. మెటలర్జికల్ ఇంజినీరింగ్ భవనానికి రూ.1.25 కోట్లు, సివిల్ ఇంజినీరింగ్ భవనానికి రూ.1.25కోట్లు నిధులను జేఎన్‌టీయూ–కాకినాడ మంజూరు చేసింది. ఒక్కో భవనంలో కనీసం నాలుగు పరిశోధన, బోధనా తరగతులను నిర్వహించడానికి వీలవుతుంది.
- యూనివర్సిటీగా విస్తరించనున్నందున అందుకు తగినట్లుగా తాగునీరు, ఇతరత్రా వినియోగానికి నీటి సామర్థ్యం పెంపునకు ఏర్పాట్లు చేస్తున్నారు. సమీప కొండపై ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలన్న ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. దీని నిర్మాణానికి రూ.1.20 కోట్ల నిధులను విడుదల చేసింది.
- ప్రస్తుతం ఉన్న గెస్ట్‌హౌస్‌పైనే మరో అంతస్తు నిర్మించేందుకు రూ.1.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

ఉత్తరాంధ్ర విద్యార్థులకు పరీక్షలు ఇక్కడే...



జేఎన్‌టీయూ–జీవీ పరిధిలో 45 ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరంలో చేరే ఉత్తరాంధ్ర విద్యార్థులందరికీ పరీక్షలు ఇక్కడే నిర్వహిస్తాం. అందుకు అనుగుణంగా వసతులు ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం ఉన్న జీ+2 భవనాలపై మరో అంతస్తు నిర్మించాలని యోచిస్తున్నాం. యూనివర్సిటీకి అవసరమైన ఐదు డైరెక్టరేట్‌లను ఏర్పాటు చేస్తున్నాం. జేఎన్‌టీయూ–కాకినాడ నుంచి వేరు చేసిన నేపథ్యంలో జేఎన్‌టీయూ–జీవీకి దాదాపు రూ.25 కోట్ల మేర నిధులు బదిలీ అయ్యాయి. 24 బోధన, 70 నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి త్వరలోనే ప్రభుత్వ ఆమోదం లభించనుంది. మరో 60 వరకూ పోస్టులు అవుట్‌సోర్సింగ్‌లో నియమించే అవకాశం ఉంది. ఎగ్జిక్యూటివ్ కమిటీ నియామక ప్రక్రియకు కూడా త్వరలోనే ఉత్తర్వులు విడుదల కావచ్చు. సరైన సౌకర్యాలు లేని ఐదు అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈ ఏడాది ప్రవేశాలు నిలిపేస్తున్నాం.

– ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు, వైస్ చాన్సలర్, జేఎన్‌టీయూ–జీవీ

అభివృద్ధి పనులకు ఆమోదం



ఏటీపీఎల్ ఫ్యాకల్టీ డెవలెప్‌మెంట్ ప్రోగ్రామ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ ప్రసాదరాజు, రిజిస్ట్రార్ స్వామినాయుడు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలో వివిధ అభివృద్ధి పనులకు బిల్డింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. స్టాఫ్ మీటింగ్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఏటీపీఎల్ ఫ్యాకల్టీ డెవలెప్‌మెంట్ ప్రోగ్రామ్ పోస్టర్‌ను వీసీ ఆవిష్కరించారు. యూనివర్సిటీకి చెందిన లోగో, యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అందలం

- గ్రేడ్–2 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి శ్రీకారం
- ఇప్పటికే పూర్తయిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ
- ఈ నెల 18న రాత పరీక్ష
- నిబంధనలు విడుదల చేసిన అధికార యంత్రాంగం
- తొమ్మిదేళ్ల అనంతరం ఉద్యోగోన్నతికి అవకాశం
- జోన్ పరిధిలో 76 గ్రేడ్–2 పోస్టుల భర్తీకి చర్యలు



విజయనగరం తోటపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు బోధిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కార్యకర్తల తొమ్మిదేళ్ల ఎదురుచూపునకు ప్రభుత్వం తెరదించింది. పదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారికి గ్రేడ్–2 సూపర్‌వైజర్లుగా ఉద్యోగోన్నతి పొందే అవకాశాన్ని కల్పిస్తూ నోటిఫికేషన్ జారీచేసింది. ఇప్పటికే దరఖాస్తు ప్రక్రియను పూర్తిచేసింది. ఈ నెల 18న రాతపరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. విశాఖ జోన్ (ఉత్తరాంధ్ర జిల్లాలు) పరిధిలో 76 పోస్టులుండగా, జిల్లా నుంచి 1435 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. రాత పరీక్షకు సన్నద్ధమవుతున్నారు.

అంగన్‌వాడీలకు మేలు చేసేలా...

వాస్తవంగా 2013వ సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు గ్రేడ్–2 సూపర్‌వైజర్లుగా ఉద్యోగోన్నతి కల్పించింది. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఉద్యోగుల ఉద్యోగోన్నతిపై కనీసం ఆలోచన చేయలేదు. వారి హయాంలో నాలుగున్నరేళ్ల వరకు జీతం కూడా పెంచలేదు. 2019 ఎన్నికలకు 6 నెలలు ముందు అరకొరగా వేతనం పెంచి గొప్పలు చెప్పింది. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు రూ.1000 జీతం పెంచింది. గ్రేడ్–2 సూపర్‌వైజర్లకు గ్రేడ్–1 సూపర్‌వైజర్లుగా ఉద్యోగోన్నతి కల్పించింది. అలాగే, గ్రేడ్–1 వారిని సీడీపీఓలుగా, సీడీపీఓలను ఏపీఓలుగా నియమించింది. తాజాగా పదేళ్ల సర్వీసు పూర్తిచేసి, అర్హత ఉన్న కార్యకర్తల ఉద్యోగోన్నతికి శ్రీకారం చుట్టింది. మరోవైపు అంగన్‌వాడీల్లో ఆటపాటలతో కూడిన విద్యాబోధనకు చక్కని ప్రణాళిక రూపొందించి అమలుచేస్తోంది. చిన్నారులకు ఆంగ్ల అక్షరాలను పరిచయం చేస్తోంది. జిల్లాలో ఇప్పటికే 56 మంది సూపర్‌వైజర్లు పనిచేస్తున్నారు. కొత్తపోస్టుల భర్తీతో అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ పెరుగుతుందని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.

రాతపరీక్ష నిబంధనలు..

- హాల్‌టికెట్లను సీడీపీఓ నుంచి పొందాలి.
- 18వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. అరగంట ముందుగా నిర్దేశించిన పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.
- అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు కేవలం హాల్‌టికెట్, అట్ట, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ను మాత్రమే తీసుకెళ్లాలి.
- పరీక్ష పత్రములో హాల్ టికెట్ నంబర్‌ను బ్లూ లేదా బ్లాకు పెన్‌తో బబుల్ చేయాలి.
- ప్రశ్నపత్రములో 90 ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు అరమార్కు కేటాయించారు. గుర్తించిన సమాధానాన్ని బ్లూ లేదా బ్లాక్ పెన్నుతో పూర్తిగా బబుల్ చేయాలి.
- ప్రతీ తప్పు జవాబుకు 1/4మార్కు మినహాయిస్తారు.

పారదర్శకంగా పోస్టుల భర్తీ

జోన్ పరిధిలో దరఖాస్తు చేసిన అభ్యర్థులందరికీ విశాఖపట్నంలో ఈనెల 18వ తేదీన రాత పరక్ష జరగనుంది. పోస్టుల భర్తీ పక్రియ పారదర్శకంగా జరుగుతుంది.

– బి.శాంతకుమారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి

చాలా సంతోషంగా ఉంది

నేను గత 15 ఏళ్లుగా అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నాను. సూపర్ వైజర్ కావాలని కోరిక ఉంది. గ్రేడ్–2 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. ఈ నెల 18వ తేదీన జరిగే రాత పరీక్షకు సన్నద్ధమవుతున్నాను.

– పోటుపురెడ్డి లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, పెదవేమలి గ్రామం

నేడు పైడితల్లి ఉత్సవ పందిరి రాట

పైడితల్లి అమ్మవారి చదురుగుడి



- 21న మండల దీక్షలు ప్రారంభం
- అక్టోబర్ 10న తొలేళ్లు, 11న సిరిమానోత్సవం

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు పందిరి రాటతో ఆరంభం కానున్నాయి. మూడులాంతర్ల కూడలి సమీపంలోని చదురుగుడి వద్ద ముహూర్తం ప్రకారం శనివారం ఉదయం 9.30 గంటలకు, రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న వనంగుడి వద్ద ఉదయం 11 గంటలకు పందిరి రాట వేసి అమ్మపండగ కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. కోవిడ్ వ్యాప్తితో గత రెండేళ్లుగా పండగను భక్తులందరూ సామాజిక మాధ్యమాల ద్వారానే వీక్షించారు. ఈ ఏడాది కోవిడ్ ప్రభావం లేకపోవడంతో పండగ అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు రంగం సిద్ధంచేస్తున్నారు. లక్షలాది మంది భక్తులు పండగకు వచ్చే అవకాశాలుండడంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 21న బుధవారం చదురుగుడి అమ్మవారి ఆలయంలో భక్తులు మండల దీక్షధారణ చేయనున్నారు. అక్టోబర్ 10న తొలేళ్ల ఉత్సవం, 11న సిరిమానోత్సవం జరిపేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. 13న అర్ధ మండల దీక్షలు, 18న మంగళవారం అమ్మవెలిసిన పెద్ద చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తారు. 30న అమ్మవారి దీక్షధారులు కలశజ్యోతులతో ర్యాలీ నిర్వహిస్తారు. నవంబర్ 1న మంగళవారం చదురుగుడి వద్ద ఉయ్యాల కంబాల మహోత్సవం, మరుసటిరోజు బుధవారం వనంగుడిలో దీక్షల విరమణ, చండీయాగం, పూర్ణాహుతితో నెలరోజుల పండగ పూర్తవుతుంది.

ప్రతిరోజూ పండగే

అమ్మవారు జాతర మహోత్సవాల్లో ప్రతీరోజూ పండగ సందడే. ఎక్కడ చూసినా అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకునే భక్తులు, ఘటాలను ఎత్తుకుని, పులివేషాలు, విచిత్ర వేషాలు, కర్రసాము, గారడీలు చేస్తూ చదురుగుడికి, వనంగుడికి భాజాభజంత్రీలతో వచ్చి మొక్కులు చెల్లిస్తారు. ఆలయం ఆవరణలో దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణలు, స్వచ్ఛంద సంస్థల సేవలు, ప్రతీరోజూ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలతో జాతరను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్‌కుమార్ తెలిపారు.

అందరి భాష తెలుగు

- మాతృ భాషాభివృద్ధికి ముఖ్యమంత్రి సహకారం భేష్
- తెలుగులో జీఓల జారీ కోసం తర్జుమా కమిటీ
- రాష్ట్ర అధికార భాషా సంఘం ఛైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

విజయనగరం అర్బన్/టౌన్:

తెలుగు అందరి భాష అని, పాలనా వ్యవహారాల్లో తెలుగు భాష అమలుకు ప్రతీఒక్కరూ పెద్ద మనసుతో కృషిచేయాలని ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ కోరారు. తెలుగు భాషాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల్లో తెలుగు భాష అమలుపై ఆయన కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయా శాఖల్లో తెలుగు అమలు శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ భాషకు సేవ చేసిన వారి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. రాజరాజనరేంద్రుడు, శ్రీకృష్ణదేవరాయలు వంటి మహారాజులు చరిత్రలో శాశ్వత స్థానాన్ని సంపాదించారని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు పేర్లు, జారీ చేసే సర్క్యులర్లు, నోటీసులు, ఉత్తర ప్రత్యుత్తరాలు, సమాచారం అన్నీ తెలుగులోనే ఉండేలా చూడాలని అధికారులను కోరారు. అభివృద్ధి పనులకు ఏర్పాటు చేసే శిలాఫలకాలు కూడా జీఓ 40 ప్రకారం తప్పనిసరిగా తెలుగులోనే ఉండాలని స్పష్టం చేశారు. దీనిని పాటించకపోతే జరిమానా, జైలు శిక్ష విధించే అధికారం సంస్థకు ఉందన్నారు. తెలుగు వాడకంలో తలెత్తే సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయా లని డీఆర్‌ఓ గణపతిరావుకు సూచించారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి ముందుగా మాట్లాడుతూ జిల్లాలో తెలుగు భాష అమలుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తెలుగు సాహిత్యానికి, భాషకు విజయనగరం గడ్డపై చేసిన కృషిని వివరించారు. గురుజాడ, ఆదిబట్ల, గిడుగు లాంటి మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ వారి ఆశయాలను స్మరించుకుంటూ భాషాభివృద్ధికి కృషిచేస్తున్నట్టు వెల్లడించారు. సమావేశంలో ముందుగా డాక్టర్ యార్లగడ్డ జీవిత విశేషాలు, ఆయన గొప్పతనం, సాహిత్యసేవను వివరిస్తూ, డాక్యుమెంటరీని ప్రదర్శించారు. యార్లగడ్డకు, ఆయన చిత్రపటాన్ని, బొబ్బిలి వీణను కలెక్టర్ జ్ఞాపికగా అందజేశారు. కార్య క్రమంలో ఆర్డీఓ సూర్యకళ, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ వెలమల సిమ్మన్న, పరవస్తు సూరి, అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ ఏ.గోపాలరావు, గురజాడ వారసులు వెంకటేశ్వర ప్రసాద్, ఇందిర, కాపుగంటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. గురజాడ వారసులను యార్లగడ్డ, కలెక్టర్లు సత్కరించారు.



గురజాడ వారసులు వెంకటేశ్వర ప్రసాద్, ఇందిరా దంపతులను సత్కరిస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కలెక్టర్ సూర్యకుమారి

తెలుగు భాష అమల్లో సమాచార శాఖది అగ్రస్థానం

జిల్లాలో తెలుగుభాష అమల్లో జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖకు అగ్రస్థానం దక్కింది. శాఖాపరంగా శతశాతం తెలుగు భాషను అమలు చేసినందుకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి డి.రమేష్‌ను యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు.

తెలుగులోనే ఉత్తరప్రత్యుత్తరాలు

జిల్లా పోలీస్ సమావేశ మందిరంలో యార్లగడ్డ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ ఎం.దీపిక మాట్లాడుతూ పోలీస్ కార్యాలయం నుంచి జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ దాదాపు తెలుగులోనే నిర్వహిస్తున్నామన్నారు. కేసులకు సంబంధించిన ఫైళ్లను తెలుగులో రాసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏఎస్పీ పి.సత్యనారాయణరావు ప్రారంభోపన్యాసం చేస్తూ తెలుగు, హిందీ సాహిత్యానికి యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో విజయనగరం అదనపు డీఎస్పీ టి.త్రినాథ్, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, డీపీఓ పరిపాలనాధికారి వెంకటరమణ, సీఐలు జి.రాంబాబు, ఐనరసింహమూర్తి, సీహెచ్.లక్ష్మణరావు, టీవీ తిరుపతిరావు, ఎస్.కాంతారావు, ఆర్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏపీ పోస్టల్ కబడ్డీ జట్టు కోచ్‌గా శ్రీనివాస్



విజయనగరం: ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని సిమ్లాలో జరిగే 34వ ఆలిండియా పోస్టల్ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ పోస్టల్ కబడ్డీ జట్టుకు విజయనగరం హెడ్‌పోస్టాఫీసులో ఉద్యోగం చేస్తున్న పతివాడ శ్రీనివాసరావు కోచ్‌గా నియమితులయ్యారు. 1997లో స్పోర్ట్స్ కోటాలో ఆయనకు పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం లభించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన అనేక జాతీయ, అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు క్రీడాకారుడిగా, కెప్టెన్‌గా, 2016వ సంవత్సరం నుంచి కోచ్‌గా జట్టుకు ఎన్నో విజయాలు సాధించి పెట్టారు. శ్రీనివాసరావును కోచ్‌గా నియమించడం పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, అధ్యక్షుడు జి.ఈశ్వర్ గౌస్, కార్యదర్శి సూరిబాబు, ఉపాధ్యక్షులు తవిటిరాజు, బొమ్మన రామారావు కబడ్డీ అసోసియేషన్ సభ్యులు క్రీడాకారులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే విజయనగరం డివిజన్ తపాలా సూపరింటెండెంట్ ఈశ్వర్ రావు, మధు కుమార్, తపాలా సిబ్బంది అభినందించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

విజయనగరం క్రైమ్: స్థానిక దాసన్నపేట చిలకమ్మ గుడి సమీపంలో నివాసం ఉంటున్న రిటైర్డ్ రైల్వే ఉద్యోగి బి.బాబూరావు (75) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీనికి సంబంధించి టూ టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో బ్యాంక్ పనిమీద ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిన ఆయన పని పూర్తయిన తర్వాత ఇంటికి వస్తుండగా పల్సర్ బైక్‌పై వేగంతో వచ్చిన వ్యక్తి బలంగా ఢీకొట్టాడు. దీంతో ఆయన తలకు తీవ్రగాయం కావడంతో వెంటనే స్థానికులు సమీప ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఏఎస్సై రాజు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చందనమే..పచ్చదనమే..!

ఆశించిన స్థాయిలో వర్షాలు కురుస్తుండడంతో రెట్టించిన ఉత్సాహంతో జిల్లాలో రైతన్నలు వ్యవసాయం సాగు చేస్తున్నారు. వారం రోజులుగా సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో ఈ ఏడాది అనావృష్టి పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో గతేడాది కంటే ఈ ఏడాది పంటల సాగు శాతం పెరిగింది. వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయని పంటలకు ఎంతో ఉపయోగకరమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

- కళకళలాడుతున్న పంట పొలాలు
- జిల్లాలో ఆశాజనకంగా సాగు
- ఈ సీజన్‌లో వరి సాగు లక్ష్యం 90,811 హెక్టార్లు
- గతేడాది కంటే అధికంగా సాగు
- అందుబాటులో ఎరువులు



కళకళలాడుతున్న వరి పంట



వంగ తోటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

రామభద్రపురం: రైతును రాజును చేయాలన్న లక్ష్యం, వ్యవసాయాన్ని పండగ చేయాలన్న సంకల్పంతో అన్నదాతకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుండడంతో పాటు రైతులు ఎంతో ఉత్సాహంగా సాగు చేస్తూ దూసుకుపోతున్నారు. జిల్లాలో మొత్తం వరి సాగు విస్తీర్ణం 90,811 హెక్టార్లు కాగా గతేడాది 81,788 హెక్టార్లలో సాగు చేయగా ఈ ఏడాది ఇప్పటి వరకు 82 వేల హెక్టార్లలో పంటల సాగు చేపట్టారు.

జిల్లాలో ఖరీఫ్ పంటల సాగు ఇలా..

ప్రభుత్వం వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తూ వైఎస్సార్ రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా తదితర సదుపాయాలు కల్పించడంతో వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో మొత్తం పంటల సాగు 1,29,071 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 1,08,358 హెక్టార్లలో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ సమాచారం.

పంట	లక్ష్యం(హెక్టార్లలో)	సాగైంది(హెక్టార్లలో)
వరి	90,811	82,000
మొక్కజొన్న	15,660	12,291
పత్తి	4,224	1821
చెరకు	8,940	4,194
కంది	69	09
పెసలు	151	68
మినుములు	147	100
నువ్వులు	6163	7307
వేరుశనగ	1435	320
గోగు	1274	312
మిరప	51	22
కూరగాయలు నిత్య సాగు గనుక (సుమారు)		3 వేలు

ఇంకా పసుపు, పొగాకు, ఉల్లి తదితర పంటలు కూడా సాగయ్యాయి. ఇవన్నీ ఇటీవల కురిసిన వర్షాలతో కళకళలాడుతున్నాయి.

అందుబాటులో ఎరువులు

రైతులకు అవసరమైన విత్తనాలతో పాటు ఎరువులు ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. నెలనెలా సరఫరా చేస్తున్న ఎరువులను బట్టి సెప్టెంబరు నెలకు అన్నిరకాల ఎరువులు కలిపి 15,177 మెట్రిక్ టన్నులు అవసరం కాగా ఇప్పటికి 14,689 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నాయి. అలాగే ఆర్బీకేలలో 3,314 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. రైతులకు అవసరమైన ఎరువులు పంపిణీ చేసేందుకు అధికారులు సంసిద్ధంగా ఉన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడం వల్ల భారీ వర్షాలు పడుతున్నాయి. రైతులు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలి.పంట పొలాల్లో నీరు నిల్వఉండకుండా చూడాలి. వర్షపు నీరు బయటకు వెళ్లేలా పొలం చుట్టూ కాలువలు తీసుకోవాలి. ఎరువులు వేయడం, పురుగు మందులు పిచికారీ చేయడం వాయిదా వేసుకోవాలి. వర్షం పూర్తిగా తగ్గిన తర్వాత వ్యవసాయాధికారుల సూచన మేరకు ఎరువులు వేయడం, పురుగు మందులు పిచికారీ చేయడం వంటివి చేయాలి.

వి.రామారావు, జిల్లా వ్యవసాయాధికారి

దోమల నివారణకు చర్యలు

- ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలి
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు



వార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను మలేరియా, డెంగీ వంటి అరికట్టేందుకు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని ఇళ్ల వద్దే నిర్వహించాలని, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొబ్బరి చిప్పలు, రిఫ్రిజిరేటర్ల మురుగునీటిని సేకరించే ట్రేలు, ఉపయోగించని ప్లాస్టిక్ బాటిళ్లు, రూఫ్-గట్టర్లు, సన్‌స్లేడ్స్, పారేసిన వస్తువులు, టైర్లు వంటి దోమల ఉత్పత్తి ప్రదేశాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి, వాటిని తరచూ ఖాళీ చేసేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తికి చేయకూడని పనులపై ఇంటింటికీ ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించి ఇళ్లలో దోమల వృద్ధికి అవకాశం ఉన్న ప్రాంతాల గురించి వివరించి, ప్రదేశాలు పొడిగా ఉండేలా చూసుకోవాలని ప్రజలను కోరారు. వర్షం తరువాత నీరు నిలిచిన ప్రదేశాలను శుభ్రం చేయాలని శానిటరీ సిబ్బందిని కోరారు. డ్రైనేజీల్లో దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్, స్ప్రేయింగ్ చర్యలు చేపట్టాలని మలేరియా విభాగం సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ వై.విజయ్ మోహన్, హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప, ఆరోగ్యశాఖ కార్యదర్శులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కేవైసీ అప్‌డేట్ పేరుతో వచ్చే మెసేజ్‌లు నమ్మొద్దు

- డీఎస్పీ ఎ.సుభాష్



పార్వతీపురం టౌన్: కేవైసీ అప్‌డేట్ పేరుతో వచ్చే మెసేజ్‌లను నమ్మొద్దని పార్వతీపురం మన్యం జిల్లా డీఎస్పీ ఎ. సుభాష్ హితవు పలికారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు కేవైసీ పేరుతో నేరాలకు పాల్పడుతున్నారన్నారు. కేవైసీ వెరిఫై చేయకపోతే యూజర్లు 24 గంటల్లో తమ నంబర్‌కు యాక్సెస్ కోల్పోతారని వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. పేటీఎం, బ్యాంకు హెడ్ ఆఫీసు నుంచి ఫోన్ చేస్తున్నామని, మీ కేవైసీ వివరాలు అప్డేట్ చేయాలని, చేయకపోతే బ్యాంకు లావాదేవీలు నిలిచిపోతాయంటూ సైబర్ నేరస్తులు చెప్పే మాయమాటలు నమ్మవద్దని స్పష్టం చేశారు. తెలియక మోసపోయి డబ్బులు పోగొట్టుకుంటే హెల్ప్ లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలని సూచించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24కి. 10గ్రా.)	51,000-00
బంగారం(22కి. 10గ్రా.)	46,750-00
వెండి (కిలో)	60,400-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹ 280

దివ్యాంగులు యూడీఐడీ కార్డులు పొందాలి

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని రకాల సేవలూ, అమలు చేసే పథకాలు పొందేందుకు కేంద్ర ప్రభుత్వం యూడీఐడీ (యూనిక్ డిజేబిలిటీ ఐడీ) కార్డును అందుబాటులోకి తీసుకొచ్చిందని, దీనిని దివ్యాంగులందరూ తప్పకుండా ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా పొందాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సూచించారు. ఇక నుంచి అన్ని రకాల సేవలకూ యూడీఐడీ కార్డు ప్రామాణికం కానుందని, వీలైనంత త్వరగా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని చెప్పారు. యూడీఐడీ కార్డుల జారీ ప్రక్రియపై అవగాహన కల్పించే నిమిత్తం స్థానిక యూత్ హాస్టల్‌లో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్డులను అన్ని చోట్లా అంగీకరించేలా అన్ని శాఖలకూ లేఖలు రాసి పంపించాలని విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయక సంచాలకులకు ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. భవిష్యత్తులో అన్ని కార్యకలాపాలు యూడీఐడీ కార్డుపై ఆధారపడే జరుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ప్రథమంగా విజయనగరం జిల్లాలో ఈ ప్రత్యేక క్యాంపు పెట్టామని దీనిని అందరూ సద్వినియోగం చేసుకుని కార్డులు పొందాలని సూచించారు. అనంతరం యూడీఐడీ ప్రోగ్రామ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ జీ.సురేష్ కార్డు పొందే విధానంపై అవగాహన కల్పించారు. కార్డు కావాల్సిన వారు 'స్వాలంబన్‌కార్డ్. జీఓవీ. ఐఎన్' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్లాలి

కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కాసేపు దివ్యాంగులతో ముచ్చటించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అంగవైకల్యం కోరుకుంటే వచ్చింది కాదని దాని గురించి ఆలోచిస్తూ ఆత్మన్యూనతా భావాలనికి గురికావొద్దని ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్లాలని వారిలో ధైర్యం నింపారు. ప్రణాళిక ప్రకారం అత్యున్నత స్థానాలకు చేరుకుని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని స్ఫూర్తి కలిగించారు. ఇతరులపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదిగి సమాజం గర్వించదగ్గ విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల విభాగం సహాయ సంచాలకుడు జగదీష్, గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు జగదీష్ బాబు, ద్వారకామయి అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి, వివిధ సంస్థల నిర్వాహకులు, పాఠశాలల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు కృషి చేద్దాం

- కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సుదర్శనం



బహుమతులు పొందిన విద్యార్థులతో ఈఈ సుదర్శనం, తదితరులు

విజయనగరం రూరల్: జీవరాశుల మనుగడలో ముఖ్యమైన ఓజోన్ పొర రక్షణకు కాలుష్య నియంత్రణే మార్గమని కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ టి.సుదర్శనం పేర్కొన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కస్పా ఉన్నత పాఠశాలలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఈఈ సుదర్శనం మాట్లాడుతూ కాలుష్య నియంత్రణలో విద్యార్థులు ముఖ్య భూమిక పోషించాలని పిలుపునిచ్చారు. అడవుల నరికివేత, కాలుష్య వ్యర్థాలతో వాయు, జల కాలుష్యం ఏర్పడుతుందన్నారు. దీంతో జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని తెలిపారు. కాలుష్య నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పించడంలో విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల రసాయన విభాగాధిపతి బి.సర్వారావు, పాఠశాల ఉపాధ్యాయులు, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీ ప్రారంభం



డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న పల్నాడు కలెక్టర్ శివశంకర్, విజయనగరం కలెక్టర్ సూర్యకుమారి

శృంగవరపుకోట: పుట్టి పెరిగిన గ్రామంలో చదువుకున్న పాఠశాల కోసం స్వయంగా రూ.8లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఎస్.కోట మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన లోతేటి శివశంకర్ పల్నాడు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తన తండ్రి సన్యాసప్పడు పేరుతో సొంత నిధులతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో డిజిటల్ లైబ్రరీని ఎ.సి, కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, పలు పుస్తకాలతో ఏర్పాటు చేశారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ పేరుతో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ ప్రారంభోత్సవానికి విజయనగరం జిల్లా కలెక్టర్ సూర్యకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లైబ్రరీని ప్రారంభించిన పల్నాడు కలెక్టర్ శివశంకర్, లైబ్రరీలో విశేషాలను కలెక్టర్ సూర్యకుమారికి వివరించారు. కార్యక్రమంలో డీఈఓ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఈఓ కె.వాసుదేవరావు, తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, ఎంపీడీ శేషుబాబు, ఎంఈఓ పి.సత్యనారాయణ, హెచ్‌ఎం లక్ష్మి, సర్పంచ్ జి.సన్యాసయ్య, ఎంపీటీసీ కనకమహాలక్ష్మి, పీఎంసీ చైర్మన్ టి.రమణ తదితరులు హాజరయ్యారు.

హెచ్‌ఎం ఖాతాలో సొమ్ము మాయం

వంగర: మండల పరిధి కోణంగిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కొప్పర శ్రీనివాసరావు బ్యాంక్ ఖాతా నుంచి సొమ్ము మాయమైందని హెచ్‌సీ డి.రాములు శుక్రవారం తెలిపారు. హైదరాబాద్ నుంచి మాట్లాడుతున్నట్లు హెచ్‌ఎం మొబైల్‌కు ఫోన్ వచ్చిందని, పెండింగ్ లావాదేవీలు క్లియర్ చేసి మిగిలిన సొమ్ము ఖాతాకు జమచేస్తామంటూ వివరాలు అడగడంతో హెచ్‌ఎం శ్రీనివాసరావు డెబిట్ కార్డు వివరాలను వెల్లడించడంతో ఆయన ఖాతాలో ఉన్న రూ.1,24,224లు మాయమైంది. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

క్లుప్తంగా

108లో ప్రసవం



108లో ఆడబిడ్డకు జన్మనిచ్చిన దేవి

విజయనగరం ఫోర్ట్: 108లో ఓ మహిళ ప్రసవించింది. వివరాల్లోకి వెళితే... విజయనగరం మండలం కొండకరకాం గ్రామానికి చెందిన వి. దేవి అనే గర్భిణికి శుక్రవారం తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి ఫోన్ చేశారు. వెంటనే సిబ్బంది గ్రామానికి చేరుకుని గర్భిణిని వాహనంలో ఎక్కించుకుని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా... మార్గమధ్యలో నొప్పులు రావడంతో సిబ్బంది ప్రసవం జరిపించారు. దీంతో గర్భిణి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మెరుగైన చికిత్స కోసం తల్లీబిడ్డలను ఘోషా ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ చొక్కపు వెంకటరమణ తెలిపారు.

చురుగ్గా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు

డెంకాడ: ఇళ్ల బిల్లుల చెల్లింపులకు కావాల్సిన ప్రక్రియను పూర్తి చేయడంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చురుగ్గా వ్యవహరించాలని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయని, బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాలని సూచించారు. అలాగే ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే చోట మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, హౌసింగ్ డీఈఈ మురళి, ఇతర విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి జగదీష్

విజయనగరం రూరల్: మండలంలోని జొన్నవలస బీసీ వసతి గృహ విద్యార్థులకు రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.జగదీష్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలంలో దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుందని, దోమలు వృద్ధి చెందకుండా వసతి గృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఈ సందర్భంగా వైద్యాధికారి సూచించారు. జ్వరాలు, ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే సమాచారం అందించాలన్నారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం విజయ, ఎంఎల్‌హెచ్‌పీ శ్వేత, ఆరోగ్య సహాయకుడు శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం



జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి అరుణకుమారి

విజయనగరం రూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా పౌష్టికాహారం అందజేస్తోందని మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి తెలిపారు. మండలంలోని నారాయణపురం గ్రామాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా, లేదా అని ఆరా తీశారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని, ఎస్‌డబ్ల్యూపీ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరావు, ఈఓపీఆర్డీ డి.తిరుపతి నాయుడు, పంచాయతీ కార్యదర్శి రవి, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి

విజయనగరం ఫోర్ట్: రెండు సంవత్సరాల్లోపున్న చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.అనురాధ తెలిపారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా హుకుంపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే పిల్లల ఎదుగుదల బాగుంటుందని చెప్పారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలు భేష్

- బొబ్బిలి మండలం కింతలివానిపేట గ్రామానికి చెందిన గర్భిణి అచంటి పైడితల్లికి కొద్ది రోజుల కిందట పురిటి నొప్పులు రావడంతో సమీపంలో ఉన్న పిరిడి పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు ఆమెకు సుఖ ప్రసవం జరిపించారు. పండంటి ఆడపిల్ల జన్మించింది.
- గంట్యాడ మండలం పెదవేమలి గ్రామానికి చెందిన పి.దేవికి కొద్ది రోజుల కిందట పురిటి నొప్పులు రావడంతో ఘోషా ఆస్పత్రిలో చేరింది. అక్కడి వైద్యులు ఆమెకు పరీక్షలు నిర్వహించి సాధారణ ప్రసవం జరిపించారు. ఈమెకు కూడా ఆడపిల్ల జన్మించింది. వీరిద్దరే కాదు. అనేక మంది ప్రభుత్వ ఆస్పత్రులు సుఖంగా ప్రసవిస్తున్నారు.

- సకాలంలో అందుతున్న సేవలు
- ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు
- ఘోషా ఆస్పత్రికి తగ్గిన కేసులు
- సీహెచ్‌సీల్లోనూ అధిక ప్రసవాలు
- సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో ఆరు నెలల్లో 5968 ప్రసవాలు



ఘోషా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలింతలు

విజయనగరం ఫోర్ట్:

ప్రభుత్వ పీహెచ్‌సీల్లో అవసరమైన వసతులు కల్పించడంతో సుఖ ప్రసవాలు జరుగుతున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులను నియమించింది. అన్ని పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగే విధంగా వైద్యాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా ప్రసవం జరిపించడంతో పాటు సాధారణ ప్రసవానికి రూ.5వేలు, సిజేరియన్‌కు రూ.5వేలు చొప్పున ఆసరా కింద ప్రోత్సాహం అందజేస్తుండడంతో గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవానికి ఇష్టపడుతున్నారు.

జిల్లాలో ఆస్పత్రుల వివరాలు

విజయనగరం జిల్లాలో ప్రసవాలు నిర్వహించే ప్రభుత్వ ఆస్పత్రులు 61 ఉన్నాయి. వీటిలో 24 గంటలు పని చేసే పీహెచ్‌సీలు 48, సీహెచ్‌సీలు 13 ఉన్నాయి. ఈ ఆస్పత్రుల్లో ఈ ఏడాది ఆగస్టు నెలఖారు నాటికి 5,968 ప్రసవాలు జరిగాయి. ఇందులో సీహెచ్‌సీల్లో 5,699 ప్రసవాలు జరగ్గా, పీహెచ్‌సీల్లో 269 ప్రసవాలు జరిగాయి.

ప్రసవాలకే ప్రాధాన్యం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవం జరిపించడానికి వైద్యులు ప్రయత్నిస్తున్నారు. సాధారణ ప్రసవం సాధ్యం కాని పక్షంలో మాత్రమే సిజేరియన్ చేస్తున్నారు. కాని ప్రైవేటు ఆస్పత్రుల్లో మాత్రం సిజేరియన్లకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.



పిరిడి పీహెచ్‌సీలో శిశువుకు చికిత్స అందిస్తున్న వైద్యురాలు

ఘోషా ఆస్పత్రికి తగ్గిన ఒత్తిడి

పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో ప్రసవం కష్టతరం అనుకున్న గర్భిణులను మెరుగైన చికిత్స కోసం ఘోషా ఆస్పత్రికి రిఫర్ చేస్తారు. పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు, సీహెచ్‌సీల్లో సిజేరియన్లు చేస్తుండడంతో ఘోషా ఆస్పత్రికి ఒత్తిడి తగ్గింది. గతంలో ఘోషాలో 600 వరకు ప్రసవాలు జరిగేవి. ప్రస్తుతం 400 నుంచి 450 వరకు అవుతున్నాయి.

సీహెచ్‌సీల్లో ఏప్రిల్ నుంచి ఆగస్టు నెలఖారు నాటికి జరిగిన ప్రసవాలు

నెల	ప్రసవాల సంఖ్య
ఏప్రిల్	1083
మే	1130
జూన్	1210
జూలై	1113
ఆగస్టు	1163

అన్ని వసతులూ...

జిల్లాలో అన్ని పీహెచ్‌సీలను 24 గంటల పీహెచ్‌సీలుగా ప్రభుత్వం మార్పు చేసింది. ప్రతి పీహెచ్‌సీలో ప్రసవాలు నిర్వహించడానికి అవసరమైన వసతులు ఉన్నాయి. ఇటీవల 24 గంటల పీహెచ్‌సీలుగా మార్చిన కొన్ని పీహెచ్‌సీలకు ఇంకా పరికరాలు రావాల్సి ఉంది. సీహెచ్‌సీల్లో కూడా ప్రసవాలు బాగా జరుగుతున్నాయి.
– డాక్టర్ ఎస్‌వి.రమణకుమారి, డీఎంహెచ్‌ఓ

సచివాలయాల్లో ముఖ్యమంత్రి చిత్రపటాలు



ఎమ్పీడీఓలకు సీఎం చిత్రపటాలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, సీఈఓ అశోక్‌కుమార్

ఫొటోలు అందజేసిన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: ప్రొటోకాల్ ప్రకారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి చిత్రపటం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇందులోభాగంగా నూతనంగా నిర్మితమవుతున్న సచివాలయ భవనాల్లో చిత్రపటాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన 200 సచివాలయ భవనాల్లో ఏర్పాటు చేసేందుకు అవసరమైన చిత్రపటాలను శుక్రవారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో ఆయా ఎంపీడీఓలకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎం. అశోక్‌కుమార్, డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, పలువురు ఎమ్పీడీఓలు పాల్గొన్నారు.

సీతం కళాశాలకు గుర్తింపు



వీసీ ప్రసాదరాజు నుంచి ఆదేశ పత్రాలను అందుకుంటున్న కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం అర్బన్: సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న గణిత శాస్త్ర విభాగానికి జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ నుంచి పరిశోధనా కేంద్రంగా గుర్తింపు లభించింది. ఈ మేరకు శుక్రవారం కళాశాలను సందర్శించిన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు నుంచి అనుమతి పత్రాలను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి అందుకున్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ (జీవీ) రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు, డీఏఏ డాక్టర్ ఆర్.రాజేశ్వరరావు, కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి, గణిత అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'స్వచ్ఛతే సేవ' ర్యాలీలు



జొన్నవలసలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ వెంకటరావు, తదితరులు



రాకోడు గ్రామంలో నిర్వహిస్తున్న ర్యాలీ

విజయనగరం రూరల్: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో 'స్వచ్ఛతే సేవ' కార్యక్రమంపై శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఎంపీడీఓ గంటా వెంకటరావు ఆధ్వర్యంలో జొన్నవలసలో నిర్వహించిన ర్యాలీలో సర్పంచ్ కంది రమాదేవి, పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొని పారిశుధ్య నిర్వహణలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే రాకోడు, నారాయణపురం, దుప్పాడ, తదితర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి స్వచ్ఛతే సేవపై అవగాహన కల్పించారు.

జంక్ ఫుడ్‌తో అనారోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్టీసీసీ సమన్వయ అధికారి రామకృష్ణ

నెల్లిమర్ల రూరల్: ఎలాంటి పోషకాలు లేని జంక్ ఫుడ్ తినడం వల్ల శ్వాస, జీర్ణ వ్యవస్థలు దెబ్బతింటాయని సామాజిక, పరివర్తన సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి రామకృష్ణ అన్నారు. మండలంలోని సారిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ పిజ్జా, బర్గర్, పానీపూరీ వంటి తినుబండారాలను పిల్లలు, యువత ఇష్టపడుతున్నారన్నారు. అయితే వాటిల్లో రుచికోసం టేస్టింగ్ సాల్ట్ వేయడం వల్ల వివిధ రకాల క్యాన్సర్లు వస్తున్నాయని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాలు వాటిని నిషేధించాయని తెలిపారు. పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాము, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్య శాఖ, వైద్య విధాన్ పరిషత్, ప్రభుత్వ వైద్య కళాశాల సంయుక్తంగా భర్తీచేసే వైద్య సిబ్బంది పోస్టుల మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీ రమణకుమారి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీలలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి ఫార్మసిస్టు, ల్యాబ్‌టెక్నీషియన్, ఎఫ్ఎన్ఓ, శానిటరీ వర్కర్ కమ్ వాచ్‌మన్, వైద్య విధాన్ పరిషత్‌కు సంబంధించి జనరల్ డ్యూటీ అటెండర్, ఫిజియోథెరపిస్టు, అప్తమాలిక్ అసిస్టెంట్, ఆడియోమెట్రిసిస్, కౌన్సిలర్ పోస్టులకు సంబంధించి మెరిట్ జాబితాను విజయనగరం.ఏపీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు.

సచివాలయాలను పరిశీలించిన కేంద్ర బృందం

విజయనగరం రూరల్: మండలంలోని జొన్నవలస, చెల్లూరు గ్రామ సచివాలయాలను ఇద్దరు సభ్యుల కేంద్ర బృందం శుక్రవారం పరిశీలించింది. జిల్లా పర్యటనలో భాగంగా కేంద్ర బృంద సభ్యులు రాజు సరస్వత్, విజత్ ప్రకాష్‌భట్ చెల్లూరు, జొన్నవలస గ్రామ సచివాలయాల్లో లబ్ధిదారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతుభరోసా పథకం, జగనన్న గృహనిర్మాణ పథకం అమలు తీరుపై ఆరా తీశారు. అలాగే జొన్నవలసలో రైతుభరోసా కేంద్రంలో అందిస్తున్న సేవలను కేంద్ర బృంద సభ్యులకు సర్పంచ్ రమాదేవి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్‌డీ తిరుపతినాయుడు, చెల్లూరు, బడుకొండపేట సర్పంచ్‌లు కళ్లేపల్లి ఆదినారాయణ, సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి పతివాడ రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి



ఎంపికైన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, తదితరులు

విజయనగరం టౌన్: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని సత్య డిగ్రీ, పీజీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు ఆకాంక్షించారు. ఇటీవల కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో కళాశాల విద్యార్థులు కోజెంట్ కంపెనీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యార్థులను శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ, భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు అధిరోహించాలని కోరారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ.సాయిదేవమణి, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ ఎం.సత్యవేణి, ఎన్ఎస్ఎస్ అధికారి బి.సూరపునాయుడు, ప్లేస్‌మెంట్ అధికారి ఎం.ఉదయ్ కిరణ్, సాయిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ ప్లీనరీని విజయవంతం చేయండి

విజయనగరం అర్బన్:

విజయవాడలో ఈ నెల 18న జరగనున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయి ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. జిల్లా కమిటీ, పట్టణ శాఖ సభ్యులు ఈ మేరకు స్థానిక ప్రైవేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సమావేశమయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఈ.ఆనంద్, పట్టణ అధ్యక్షుడు ఎస్.శివాజీ, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్ గంధ్రేటి శ్రీనివాసరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షణ్ముఖరావు, కార్యవర్గ సభ్యులు శీరాపు శ్రీనివాసరావు, చిరంజీవులు పాల్గొన్నారు.

గ్రేడ్ –2 పర్యవేక్షక పోస్టులకు రాత పరీక్ష రేపు

భోగాపురం: గ్రేడ్–2 పర్యవేక్షక పోస్టులకు దరఖాస్తు చేసుకున్న ఐసీడీఎస్ భోగాపురం ప్రాజెక్ట్ పరిధిలో గల అంగన్‌వాడీ కార్యకర్తలకు విశాఖపట్నంలో శుక్రవారం పరీక్ష నిర్వహించనున్నట్లు సీడీపీఓ సుగుణవతి, ఏసీడీపీఓ తవిటి నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు భోగాపురం ఐసీడీఎస్ కార్యాలయంలో హాల్‌టికెట్లు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

లబ్ధిదారులకు సహకరించండి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్

- జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిరులకు అందించి వారి జీవనోపాధి మెరుగుపడేలా బ్యాంక్ అధికారులు సహకరించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. కాగితాలపై రుణాలు మంజూరు అవుతున్నాయి కానీ లబ్ధిదారులకు ఆ నగదు అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయన్నారు. చిన్న, చిన్న కారణాలతో నగదు అందించనప్పుడు ఇటువంటి సమావేశాలు ఎందుకని అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సంక్షేమ పథకాల కింద రుణాలు అందించడానికి ముందుకు రాని బ్యాంకుల నుంచి ప్రభుత్వ డిపాజిట్లను వెనక్కి తీసుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారులు ముఖ్యంగా మహిళలు బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి మంచిది కాదని.. వారికి రుణం అందించకపోగా వారి సమయాన్ని వృథా చేస్తూ వారి ఆదాయానికి నష్టం కలిగించే పరిస్థితి సరికాదన్నారు. సంక్షేమ పథకాల గ్రౌండింగ్ కోసం ప్రత్యేకంగా మంగళ, బుధవారాలను కేటాయించాలని ఆ రెండు రోజుల్లో వారి వీలును బట్టి లబ్ధిదారులు బ్యాంక్‌లకు వస్తారని చెప్పారు. వారికి అవసరమయ్యే ధ్రువపత్రాలను తీసుకొని పథకాలను గ్రౌండింగ్ చేయడానికి ఒక ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేయాలని సూచించారు. వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు, తదితర పథకాలలో తక్కువగా గ్రౌండింగ్ చేసిన బ్యాంక్ వివరాలను చదివి ఇకపై పురోగతి లేకపోతే మా నుంచి మీకు ఎలాంటి సహకారం ఉండదని స్పష్టం చేశారు. అదేవిధంగా రుణాలు పొందిన వారి నుంచి రికవరీ బాధ్యతను అధికారులు తీసుకోవాలన్నారు. తిరిగి చెల్లిస్తేనే రుణం రాయితీతో పాటు మరలా రుణాలు పొందగలరనే విషయాన్ని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని చెప్పారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ వివరాలను ఆర్‌బీకేలలో ప్రదర్శించాలని ఆదేశించారు. జామి మండలం భీమాళిలో నిర్వహిస్తున్న మామిడి తాండ్ర, పచ్చళ్లు, తదితర ఉత్పత్తులు మంచి రుచిగా ఉంటూ నాణ్యంగా ఉంటాయని.. అయితే ప్యాకింగ్, స్టోరేజీ, తదితర అంశాలు సరిగ్గా జరగడం లేకపోవడంతో మంచి ధర అందడం లేదని అభిప్రాయపడ్డారు. శాస్త్రీయ పద్ధతిలో ప్యాకింగ్, స్టోరేజ్ విషయంలో శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తికి సూచించారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, ఎల్‌డీఎం ఎ.శ్రీనివాసరావు, ఆర్‌బీఐ ఎల్‌డీఓ రహమాన్, నాబార్డ్ డీడీఎం. నాగార్జున, పలు బ్యాంకులకు చెందిన ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.





అచ్చెన్న ఆరోపణ.. బుగ్గన ఖండన

సాక్షి, అమరావతి: ఏపీ విభజన చట్టంలో కేంద్ర ప్రభుత్వమే ఉక్కు కర్మాగారం కట్టిస్తుందని ఉన్నా ఆ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని టీడీపీ ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు ఆరోపించారు. కడప ఉక్కు కర్మాగారానికి 2019 డిసెంబర్‌లో శంకుస్థాపన చేశారని, త్వరలో మూడేళ్లు పూర్తికావస్తోందని.. అయినా ఇప్పటికీ ఎటువంటి పురోగతి లేదని విమర్శించారు. భూమి ఇచ్చిన రైతులకు ఒక్క పైసా కూడా ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ తీరుతో కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు కూడా వెళ్లిపోతున్నాయన్నారు. అచ్చెన్నాయుడు చేసిన ఆరోపణలను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఖండించారు. 480 ఎకరాల భూములిచ్చిన రైతులకు రూ.37.18 కోట్ల పరిహారం ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఎక్కడా కేంద్ర ప్రభుత్వమే స్టీల్ ప్లాంట్ కట్టిస్తుందని లేదన్నారు. కేంద్రం స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నం చేయొచ్చని మాత్రమే ఉందని స్పష్టం చేశారు.

మీడియా పాయింట్

ఆనంద్‌బాబు.. నీ స్థాయి ఏంటీ

- మంత్రి మేరుగు నాగార్జున



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక అర్హత మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబుకు లేదు. ఆనంద్‌బాబు స్థాయి ఏమిటో తెలుసుకుని మాట్లాడాలి. రాజధాని పేరుతో జరుగుతున్న పాదయాత్రలో అమరావతి ప్రాంత రైతులు, దళితులు ఎంత మంది ఉన్నారో చెప్పాలి. రాజధాని ఎక్కడ వస్తుందో ముందే తెలుసునని, కానీ డబ్బులు లేకే భూములు కొనలేకపోయానని ఆనంద్‌బాబు ఒక మీడియాలో కూడా చెప్పారు. చంద్రబాబువి దళిత వ్యతిరేక ఆలోచనలు. నిజంగా దళితుల్లో పుట్టిన వారెవరూ ఆయన దగ్గర ఉండరు. బాబు మోసాలను ఎండగట్టడానికి అంబేడ్కర్ పాదాల సాక్షిగా ఎక్కడైనా చర్చకు సిద్ధం.

ఉత్తరాంధ్ర ప్రజలు తిప్పి కొడతారు

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను పాలన రాజధాని చేయాలని చూస్తుంటే అమరావతిని అధోగతి పట్టించిన వారు పాదయాత్ర పేరిట విధ్వంసానికి పాల్పడుతున్నారు. వారి ప్రయత్నాలను ఉత్తరాంధ్ర ప్రజలు దీటుగా తిప్పి కొడతారు. ప్రతిపక్షం రోజూ ఏదో ఒక నినాదంతో సభకు వస్తోంది. కరోనా ప్రభావం ఉన్నప్పటికీ ప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా వైఎస్ జగన్ ప్రభుత్వం ధరలను నియంత్రించేందుకు ప్రయత్నం చేసింది.

సమస్యలపై చర్చకు దూరంగా ప్రతిపక్షం

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



ప్రజా సమస్యలపై చర్చకు ప్రతిపక్షం దూరంగా పారిపోతోంది. ప్రజా సమస్యలపై సభలో చర్చించటంలో కీలక పాత్ర పోషించాల్సిన ప్రతిపక్షం సభా సమయాన్ని వృథా చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరించటం దురదృష్టకరం. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం సీఎం జగన్ మూడు రాజధానుల నిర్ణయం తీసుకుంటే దానిని అడ్డుకునేందుకు అనేక రకాల కార్యక్రమాలు చేస్తున్నారు. మిగిలిన మూడు రోజుల అసెంబ్లీ సమావేశాలైనా సక్రమంగా జరిగేలా ప్రతిపక్షం సహకరించాలి.

అసెంబ్లీలో టీడీపీ రాద్ధాంతం

▶ మొదటి పేజీ తరువాయి

టీడీపీ ఎమ్మెల్యేలు గొడవచేస్తూనే ఉన్నారు. దీంతో శాసనసభా వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి జోక్యం చేసుకుని కరోనా మహమ్మారితో ప్రపంచవ్యాప్తంగా సంక్షోభం ఉన్న విషయం తెలిసి కూడా ధరల గురించి టీడీపీ సభ్యులు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని తెలిపారు. బిల్లులు ప్రవేశపెట్టకుండా అడ్డుకునేలా టీడీపీ సభ్యులు మరింత రెచ్చిపోవడంతో సభ సజావుగా జరిగేందుకు వారిని సస్పెండ్ చేయాలని బుగ్గన రాజేంద్రనాథ్ ప్రతిపాదించారు. ఈ సమయంలోనూ టీడీపీ సభ్యులు స్పీకర్‌పైకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. వీరిని ఆపుతున్న మార్షల్స్‌ని నెట్టేస్తూ వారితో వాగ్వాదానికి దిగి దుర్భాషలాడారు. మార్షల్స్ ఐడీ కార్డులు అడుగుతూ వారిని తోసేయడంతో గందరగోళం నెలకొంది. దీంతో టీడీపీ ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, కింజరాపు అచ్చెన్నాయుడు, ఆదిరెడ్డి భవానీ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నిమ్మకాయల చినరాజప్ప, గణబాబు, వేగుళ్ల జోగేశ్వరరావు, వెలగపూడి రామకృష్ణబాబు, నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, బాల వీరాంజనేయస్వామిలను సభ నుంచి ఒకరోజు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. ఆ తర్వాత కూడా వారు బయటకెళ్లకుండా మార్షల్స్‌తో తోపులాటకు దిగారు. తన అనుమతితోనే మార్షల్స్ సభలోకి వచ్చారని వారిని ఐడీ కార్డులు అడగడం ఏమిటని గట్టిగా హెచ్చరించడంతో టీడీపీ సభ్యులు గట్టిగా అరుపులు, కేకలు వేసుకుంటూ బయటకెళ్లిపోయారు.

టీడీపీ సభ్యుల తీరుపై స్పీకర్ ఆవేదన

స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ.. ముఖ్యమైన బిల్లులు ప్రవేశపెడుతుంటే అవేంటో కూడా తెలియకుండా సభను అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇది చాలా బాధాకరమని ప్రతిరోజు స్పీకర్ పోడియంను చుట్టుముట్టి గొడవ చేస్తున్నారని వాపోయారు. వాళ్లవల్ల మిగిలిన సభ్యులంతా ఇబ్బంది పడుతున్నారన్నారు. వారిపట్ల ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని శాసనసభా వ్యవహారాల మంత్రికి సూచించారు. సంస్కారం లేకుండా వ్యవహరిస్తున్నారని, ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న తనకు చాలా బాధగా ఉందన్నారు.

సంక్షేమంతో సమానంగా అభివృద్ధి

మూడేళ్లలో వచ్చిన పెట్టుబడులు, పరిశ్రమలే నిదర్శనం

- అప్పుల ఊబిలో ముంచేసి ఊహల్లో బాబు విహారం
- దక్షతతో రాష్ట్రాన్ని గట్టెక్కిస్తున్న సీఎం జగన్ .. పెట్టుబడిదారులు వెచ్చించే ప్రతి రూపాయికీ విలువ
- పారిశ్రామిక ప్రగతిపై చర్చలో ఎమ్మెల్యేలు

అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తుండటంతో మూడేళ్లలో రాష్ట్రానికి పెద్ద ఎత్తున భారీ పరిశ్రమలు, రూ.వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని పారిశ్రామిక ప్రగతిపై అసెంబ్లీలో శుక్రవారం జరిగిన చర్చలో శాసనసభ్యులు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒప్పందాలే మినహా పరిశ్రమల స్థాపన ఊసే లేదన్నారు. - సాక్షి, అమరావతి

బాబు.. ఈజ్ ఆఫ్ సెల్లింగ్

- పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్

పారిశ్రామికవేత్తల ఇబ్బందులు, అవసరాలను తీర్చడానికి ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక ఫోన్ కాల్ దూరంలో అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేశారు. పెట్టుబడిదారుల ప్రతి రూపాయికీ విలువ కల్పిస్తున్నారు. రెండేళ్లుగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ దేశంలో తొలి స్థానంలో నిలిచింది. చంద్రబాబు హయాంలో ఈజ్ ఆఫ్ సెల్లింగ్ ఇండస్ట్రీస్ విధానాన్ని అనుసరించారు. దేశంలో 1999–2004 మధ్య 160 పరిశ్రమలు మూతపడితే ఒక్క ఏపీలోనే 60 పరిశ్రమలు ఉన్నాయి. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడుల గురించి ఆర్భాటపు ప్రచారాలు కాకుండా పేదల సంక్షేమంపై సీఎం జగన్ దృష్టి సారిస్తే దుష్ట చతుష్టయం దుష్ప్రచారం చేస్తోంది. కోవిడ్ పరిస్థితుల్లోనూ రాష్ట్రం పారిశ్రామికంగా వృద్ధి చెందింది. రూ.46 వేల కోట్లతో 99 భారీ పరిశ్రమలు, రూ.10 వేల కోట్లతో 35 వేల ఎంఎస్‌ఎంఈలు 2.11 లక్షల ఉద్యోగాలతో ఇప్పటికే కొనసాగుతున్నాయి. రూ.19 వేల కోట్లతో మారిటైం బోర్డు ద్వారా నాలుగు పోర్టులు, 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. వైఎస్సార్ నవోదయం, వైఎస్సార్ బడుగు వికాసం లాంటి పాలసీలను తీసుకొచ్చాం. ఇప్పటివరకు 19,983 మందికి ఐటీ ఉద్యోగాలు కల్పించాం. రానున్న కాలంలో రూ.1.57 లక్షల కోట్ల పెట్టుబడులు, 1.25 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. మరో నాలుగు పబ్లిక్ సెక్టార్ పరిశ్రమల ద్వారా రూ.లక్ష కోట్ల పెట్టుబడితో 80 వేల ఉద్యోగాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించేందుకు రూ.1,324 కోట్లు ఇచ్చాం. మా పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవడం సీఎం జగన్ పాలనా దక్షతకు నిదర్శనం.

వర్జీనియా బీచ్ ఐటీలా విశాఖ

- దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి



దేశంలోనే నంబర్ వన్ స్టార్టప్స్ హబ్‌గా విశాఖను తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. అమెరికా వర్జీనియాలోని బీచ్ ఐటీ తరహాలో విశాఖను ఐటీ యూనికార్న్‌గా నిలబెట్టనున్నారు. ఇప్పటికే ఏపీని అత్యధిక జీడీపీ వృద్ధితో అన్ని రాష్ట్రాల కంటే ముందు వరుసలో నిలపడంతోపాటు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అత్యుత్తమ రాష్ట్రంగా గుర్తింపు తెచ్చారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై మధ్య అత్యధికంగా పెట్టుబడులు వచ్చాయి. వీటిని చూసి ఓర్వలేక దుష్టచతుష్టయం అభూత కల్పనలు సృష్టిస్తోంది. సీఎం జగన్ కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలతో రూ.1.65 లక్షల కోట్ల మేర లబ్ధి చేకూర్చారు. ఖజానాలో రూ.100 కోట్లు మాత్రమే మిగిలిన ఈ రాష్ట్రాన్ని ఎలా నడుపుతారో చూస్తామంటూ ఆర్థిక శాఖ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు నాడు హేళనగా మాట్లాడారు. ఇప్పుడు 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేయడంతో రాష్ట్రం అప్పుల పాలవుతోందంటూ అక్కసు వెళ్లగక్కుతున్నారు. సీఎం ఒక్కసారి దావోస్ వెళ్తే రూ.1.25 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించారు. చంద్రబాబు 18 సార్లు దావోస్ వెళ్లి ఏం సాధించారు? చంద్రబాబు కులాల పునాదులపై రాజకీయాలు చేస్తున్నంత కాలం పగుళ్లు ఏర్పడుతూనే ఉంటాయి. శకునిమామలా అడ్డుపడి ప్రధాని అయ్యే అవకాశం ఉన్న ఎన్టీఆర్‌ను కుట్రతో మోసం చేశారు.

బాబు స్వార్థానికి పరిశ్రమ బలి

- బ్రహ్మనాయుడు, వినుకొండ ఎమ్మెల్యే



గత ప్రభుత్వంలో ఎంవోయూలు మినహా కార్యాచరణ శూన్యం. నాకు 2012లో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు అవకాశం వచ్చింది. కేంద్రం ఇచ్చే రూ.40 కోట్ల సబ్సిడీలో రూ.20 కోట్లు తనకు ఇవ్వాలని నాటి మంత్రి పత్తిపాటి పుల్లారావు డిమాండ్ చేయడంతో నేను నిరాకరించా. ఆ మర్నాడే బ్రహ్మనాయుడు వైఎస్సార్‌సీపీలో ఉన్నాడని, టెక్స్‌టైల్స్ పార్కుకి ఇచ్చిన స్థలాన్ని రద్దు చేయాలంటూ టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర చౌదరి చంద్రబాబుకు లేఖ రాశారు. నేను టీడీపీలో చేరితే అవకాశమిస్తామని చంద్రబాబు చెప్పారు. ఒప్పుకోకపోవడంతో నాకు రిజిస్ట్రేషన్ చేసిన స్థలాన్ని రద్దు చేశారు. పరిస్థితి అలా ఉంటే రాష్ట్రానికి పరిశ్రమలు ఎలా వస్తాయి? చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు మా ప్రాంతంలో స్పిన్నింగ్ మిల్లులకు రూ.200 కోట్లు సబ్సిడీ ఇస్తామన్నారు. దీన్ని నమ్మి ఎందరో పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు పెడితే డబ్బులు ఇవ్వలేదు. కొందరు అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్నారు. ఇప్పుడు సీఎం జగన్ స్పిన్నింగ్ మిల్లులకు సబ్సిడీని ఇచ్చి ఆదుకున్నారు.

దిగ్గజ కంపెనీల రాక

- హఫీజ్ ఖాన్, ఎమ్మెల్యే



జగనన్న పాలనలో పెట్టుబడులు, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి అద్భుతంగా ఉంది. రాష్ట్రంలో జీఎస్‌డీపీ 11.43 శాతం, తలసరి ఆదాయం రూ.2 లక్షలుగా ఉంటే జాతీయ స్థాయిలో జీడీపీ 8.9 శాతం, తలసరి ఆదాయం రూ.1.46 లక్షలు మాత్రమే ఉంది. ఆదిత్య బిర్లా, అదానీ, ఏటీసీ టైర్స్ లాంటి ఎన్నో దిగ్గజ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టాయి. ఈ స్థాయి అభివృద్ధిని చంద్రబాబు చేసి ఉంటే అమెరికా, సింగపూర్‌లో ప్రెస్‌మీట్లు పెట్టి ప్రచారం చేసుకునేవారు. ఇంత అభివృద్ధి జరుగుతుంటే టీడీపీ కడుపు మంటతో దుష్ప్రచారం చేస్తోంది. కోవిడ్ సమయంలో ఉత్పాదక రంగం కుదేలైపోతే సీఎం జగన్ రూ.1,700 కోట్ల ఇన్సెంటివ్స్ ఇచ్చి ఆదుకున్నారు. తీర ప్రాంతంలో ప్రతి 50 కి.మీ పరిధిలో ఒక పోర్టు కట్టాలని నిర్ణయించారు. ఇన్నేళ్ల అనుభవంతో చంద్రబాబు ఇవన్నీ ఎందుకు చేయలేకపోయారు? ఎగుమతుల్లో రాష్ట్రం గతేడాది జాతీయ స్థాయిలో 20వ స్థానంలో ఉంటే ఇప్పుడు తొమ్మిదో స్థానంలో ఉన్నాం. వైజాగ్– చెన్నై కారిడార్, చెన్నై– బెంగళూరు కారిడార్, బెంగళూరు–హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి సీఎం జగన్ చర్యలు తీసుకున్నారు. బల్క్ డ్రగ్ పార్కు రాష్ట్రానికి రావడం సీఎం ఘనతే.

బాబు కేరాఫ్ దుబారా

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి



చంద్రబాబు అనుసరించిన ఆర్థిక విధానాలు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశాయి. అమరావతిలో రూ.లక్ష కోట్ల దుర్వినియోగం జరిగిందని ఎన్నికల సమయంలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆరోపించారు. పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంలా వాడుకున్నారని ప్రధాని మోదీ చెప్పారు. ఇవన్నీ వాస్తవాలే. టీడీపీ హయాంలో రూ.కోట్లు ఖర్చు చేసి సమ్మిట్లు నిర్వహిస్తే రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులు కాగితాలపై మినహా క్షేత్రస్థాయిలో ఆనవాళ్లు కూడా లేవు. బాబు సర్కారు చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం వడ్డీలు కడుతోంది. అమరావతి నిర్మాణం సాధ్యమైన పనే అయితే ఏడాదికి కేవలం రూ.వెయ్యి కోట్లు మాత్రమే ఎందుకు ఖర్చు పెడతారు? సింగపూర్, హాంకాంగ్, బీజింగ్ వెళ్లినా గ్రాఫిక్స్‌ను చంద్రబాబు నిజం చేయలేకపోయారు. అమరావతి సాధ్యం కాదని, కట్టలేనని తెలిసి కూడా ప్రజలను జీవితకాలం మోసం చేయాలని చూస్తున్నారు. సీఎం జగన్ రాజకీయాల్లోకి రాకముందు గొప్ప ఆర్థిక క్రమశిక్షణ ఉన్న వ్యాపారవేత్త. ఆ అనుభవంతోనే అప్పుల్లో కూరుకుపోయి ఆదాయం లేని రాష్ట్రంలో వృథా ఖర్చులు తగ్గించి ప్రతి రూపాయి పేదలకు అందిస్తున్నారు. కోవిడ్ సమయంలోనూ ప్రజల వద్ద నగదు ఉండటంతో ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కారు. జగనన్న కాలనీల వద్ద పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేస్తూ ఉపాధి కల్పనదిశగా అడుగులు వేస్తున్నారు.

ఆర్నెల్లలో రాష్ట్రంలో రూ.41 వేల కోట్ల పెట్టుబడులు

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



గత సర్కార్ హయాంలో మాదిరిగా కోట్లు, ప్యాంట్లు అద్దెకిచ్చి డేరాల్లో పార్టనర్‌షిప్ సమ్మిట్‌లంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటం చేయడం లేదు. సీఎం జగన్ పాలనాదక్షత వల్లే పెట్టుబడులు వస్తున్నాయి. చంద్రబాబు హయాంలో రూ.16 లక్షల కోట్ల విలువైన ఎంవోయూలు జరిగాయని, 50 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయని ప్రచారం చేసుకున్నారు. వాస్తవానికి ఐదేళ్లలో వచ్చిన పెట్టుబడులు కేవలం రూ.59,968 కోట్లే. అనుకూల వాతావరణం, ప్రభుత్వ సహకారం ఉంటే పారిశ్రామికవేత్తలు ముందుకొస్తారని చెప్పేందుకు ఇప్పుడు మూడేళ్లలో వచ్చిన పెట్టుబడులే నిదర్శనం. 2019–22 మధ్యలో 99 మేజర్ ఇండస్ట్రీస్‌తోపాటు 35 వేల ఎంఎస్ఎంఈలు కొత్తగా వచ్చాయి. రెండు లక్షలమందికి పైగా కొత్తగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాం. రూ.80 వేల కోట్ల పెట్టుబడులొచ్చాయి. మరో రూ.39,655 కోట్ల పెట్టుబడులతో 55 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. ఐదారు నెలల్లో ఉత్పత్తి ప్రారంభించే వీటిద్వారా 85 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. రూ.91,129 కోట్ల విలువైన మరో పది ప్రాజెక్టులు ప్రారంభ దశలో ఉన్నాయి. రెండేళ్లలో పూర్తయ్యే వీటి ద్వారా మరో 45,500 మందికి ఉపాధి లభించనుంది. ప్రభుత్వ పరంగా రూ.1.06 లక్షల కోట్ల పెట్టుబడులతో ఐదు మేజర్ ఇండస్ట్రీస్ ఏర్పాటు కానున్నాయి. వీటిద్వారా 80 వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. డీపీఐఐటీ నివేదిక ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు దేశవ్యాప్తంగా రూ.1,71,285 కోట్ల పెట్టుబడులొస్తే ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో రూ.41 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. టీడీపీ హయాంలో చిన్న తరహా పరిశ్రమలకు ఎగ్గొట్టిన రూ.2,800 కోట్ల ప్రోత్సాహక బకాయిలతో పాటు మూడేళ్లలో రూ.5,800 కోట్ల మేర ప్రోత్సాహకాలు అందించాం.

శాసనసభ ప్రశ్నోత్తరాలు

వచ్చే విద్యా సంవత్సరానికి ఐదు కొత్త వైద్య కళాశాలలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం (2023–24) నుంచి రాష్ట్రంలో ఐదు కొత్త వైద్య కళాశాలలు అందుబాటులోకి వస్తాయని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని తెలిపారు. వైద్య కళాశాలల ఏర్పాటుపై టీడీపీ ఎమ్మెల్యేలు.. అనగాని సత్యప్రసాద్, గద్దె రామ్మోహన్, గణబాబు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. ఇందులో విజయనగరం, నంద్యాల, ఏలూరు, మచిలీపట్నం, రాజమండ్రిల్లో అకడమిక్ కార్యకలాపాలు వచ్చే ఏడాది నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఈ ఐదు కళాశాలల్లో 150 చొప్పున 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. 2014–19 మధ్య టీడీపీ కేంద్రంలో భాగస్వామిగా ఉండి కూడా ఒక్క కొత్త వైద్య కళాశాల ఏర్పాటుకు కృషి చేయలేదన్నారు.

36 నెలల్లో కడప స్టీల్ ప్లాంట్

కడప ఉక్కు కర్మాగారాన్ని 36 నెలల్లో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. శాసనసభ రెండో రోజు సమావేశాల్లో భాగంగా శుక్రవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కడప ఉక్కు కర్మాగారంపై టీడీపీ ఎమ్మెల్యేలు.. డోల బాలవీరాంజనేయస్వామి, అచ్చెన్నాయుడు అడిగిన ప్రశ్నకు మంత్రి అమర్‌నాథ్ సమాధానం ఇచ్చారు. కర్మాగారం ఏర్పాటుకు ప్రభుత్వం 3,148 ఎకరాల భూమి కేటాయించిందన్నారు. భూసేకరణ, పర్యావరణ అనుమతుల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ఎన్‌హెచ్ 67 నుంచి రోడ్డు అనుసంధానం, సరిహద్దు గోడ నిర్మాణం, విద్యుత్, నీరు సహా ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మౌలిక వసతుల కల్పనకు ఇప్పటివరకు రూ.46.67 కోట్లు ఖర్చు చేశామన్నారు.

వేగంగా పేదల ఇళ్ల నిర్మాణాలు



రాష్ట్రంలో 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద పేదల ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ తెలిపారు. ఈ పథకంపై ప్రతిపక్ష ఎమ్మెల్యేలు.. డోల బాలవీరాంజనేయస్వామి, నిమ్మల రామానాయుడు, నిమ్మకాయల చినరాజప్ప అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులకు 20 మెట్రిక్ టన్నుల ఇసుక ఉచితంగా అందిస్తున్నామన్నారు. 5.83 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి కాబోయే దశలో ఉన్నాయన్నారు. 7 లక్షల గృహాలు చురుగ్గా నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. లబ్ధిదారులకు సామగ్రి సరఫరా చేసేవారికి సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. ఇసుకతోపాటు సిమెంట్, స్టీలు మార్కెట్ ధరకంటే తక్కువకే అందిస్తున్నామని చెప్పారు. ప్రతి లబ్ధిదారుడికి ఇంటి యూనిట్ కాస్ట్ రూ.1.80 లక్షలతోపాటు రూ.35 వేల రుణాన్ని 3 శాతం వడ్డీ రేటుకు బ్యాంకుల నుంచి సమకూరుస్తున్నామని తెలిపారు.

అక్కచెల్లెమ్మలను ఆదుకున్న సీఎం జగన్



డ్వాక్రా సంఘాల అక్కచెల్లెమ్మలను మోసం చేసిన ఘనత చంద్రబాబుకు దక్కితే.. వారిని అన్ని విధాలుగా ఆదుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌దని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గుర్తు చేశారు. వైఎస్సార్ ఆసరా పథకంపై అధికార పార్టీ ఎమ్మెల్యేలు పాముల పుష్పశ్రీవాణి, విశ్వాసరాయి కళావతి, రెడ్డి శాంతి, జొన్నలగడ్డ పద్మావతి, మేకతోటి సుచరిత అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలను చంద్రబాబు మోసం చేశారని మంత్రి మండిపడ్డారు. వైఎస్సార్ ఆసరా కింద 2019 జూన్ నుంచి 78.75 లక్షల మంది మహిళలు లబ్ధి పొందారన్నారు. ఇప్పటివరకు రెండు దఫాలుగా రూ.12,758.28 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని చెప్పారు. 2019–20లో రూ.1,258 కోట్లు సున్నా వడ్డీ కింద అందించామన్నారు. ఇక 2020–21లో రూ.1,096 కోట్లు, 2021–22లో రూ.1,261 కోట్లు డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు చెల్లించామన్నారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో 23 దేవాలయాల కూల్చివేత



గత టీడీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో 23 దేవాలయాలను కూల్చివేశారని దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. 2014–19 మధ్య దేవాలయాల కూల్చివేత, ప్రస్తుతం ఆ దేవాలయాల పునరుద్ధరణ అంశంపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు.. మల్లాది విష్ణు, మొండితోక జగన్మోహన్‌రావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. కృష్ణా పుష్కరాల సమయంలో టీడీపీ ప్రభుత్వం కూల్చివేసిన 23 దేవాలయాల్లో 19 దేవాలయాలను పునరుద్ధరించామన్నారు. మరో నాలుగు దేవాలయాల పనులు మొదలు పెట్టాల్సి ఉందన్నారు. అప్పట్లో దేవాలయాలను టీడీపీ సర్కార్ కూల్చివేసేటప్పుడు ఆగమ శాస్త్ర పండితులను కూడా కనీసం సంప్రదించలేదని ఆరోపించారు. ఆ విగ్రహాలను మునిసిపల్ చెత్త వాహనాల్లో తరలించారని గుర్తు చేశారు.

హామీల అమలుపై చర్చకు సిద్ధమా?

- శాసన మండలిలో టీడీపీని ఉద్దేశించి మంత్రి బొత్స వ్యాఖ్య
- ఉద్యోగులెవరినీ బాధపెట్టాలన్నది మా ప్రభుత్వ ఆలోచన కాదు
- సీఎం ఇల్లు ముట్టడిస్తామంటూ ఉద్యోగులు అనడం ధర్మమేనా?



సాక్షి, అమరావతి: గత టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీల్లో ఎన్నింటిని నెరవేర్చింది.. తమ ప్రభుత్వం వచ్చిన మూడేళ్లలోనే ఎన్ని హామీలు నెరవేర్చిందన్న దానిపై చర్చకు సిద్ధమా అంటూ మంత్రి బొత్స సత్యనారాయణ టీడీపీకి సవాల్ చేశారు. రెండోరోజు శుక్రవారం శాసన మండలి సమావేశాలు ప్రారంభం కాగానే వివిధ అంశాలపై వాయిదా తీర్మానాల కింద చర్చకు పట్టుబడుతూ ప్రతిపక్ష ఎమ్మెల్సీలు సభలో ఆందోళన చేస్తున్న సందర్భంలో బొత్స ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన అంశాలపై మంత్రి బదులిచ్చే సమయంలో టీడీపీ ఎమ్మెల్సీ లోకేశ్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండడంపై బొత్స ఘాటుగా స్పందించారు. వందలో 98 శాతం హామీలను ఇప్పటికే తాము నెరవేర్చామని, మిగిలిన వాటిలో కొన్ని నెరవేర్చడానికి ఇంకా సమయం ఉందని.. హామీలు అమలుచేయడంలో ఇబ్బందులున్న వాటి విషయాన్ని స్పష్టంగా చెబుతున్నామన్నారు. గత ప్రభుత్వాలిచ్చిన హామీలను ఎలా తుంగలోకి తొక్కారో రాష్ట్ర ప్రజలందరూ చూశారన్నారు.

సీఎం జగన్ ఉద్యోగుల పక్షపాతి

'విద్యారంగంలో సంస్కరణలు' అంశంపై చర్చ జరుగుతుండగా.. రాష్ట్రంలో కొందరు టీచర్లపై ప్రభుత్వం కేసులు నమోదు చేసిందంటూ పీడీఎఫ్, టీచర్ ఎమ్మెల్సీలు ప్రస్తావించారు. దీనిపై మంత్రి బొత్స మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క ఉద్యోగిని బాధపెట్టే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదని స్పష్టంచేశారు. 'మాది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం. ప్రభుత్వం–ఉద్యోగులు కలిసికట్టుగా పనిచేయడం ద్వారానే ప్రజలకు సమర్థవంతంగా సంక్షేమ కార్యక్రమాలు అమలుచేయగలుగుతామన్నది ఈ ప్రభుత్వ ఆలోచన. మా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల అంశాలపై పూర్తి సానుకూలంగా ఉన్నారు. ఆయన ఉద్యోగుల పక్షపాతి' అని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలకు సహకరించాలని కోరారు. విద్యారంగంలో ఏపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంస్కరణలను యావత్ దేశం చూస్తోందన్నారు. రాష్ట్రంలో పిల్లలకు విద్యే గొప్ప ఆస్తిగా ఇవ్వాలనే తపనతో సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారని.. విద్యార్థుల భవితతో ఆడుకునేలా ప్రైవేట్ విద్యా సంస్థలు అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. విద్యాశాఖలో అవసరమైన అధికారులు, ఉపాధ్యాయుల భర్తీకి చర్యలు చేపడతామని.. వ్యవస్థ కోసం వ్యక్తులు తప్ప, వ్యక్తుల కోసం వ్యవస్థ మారదనే విషయాన్ని గుర్తించి అంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి బొత్స హితవు పలికారు. ఇక ఉద్యోగులు వారికి సంబంధించిన అంశాలపై డిమాండ్ చేసే హక్కు ఉంటుందిగానీ, సీఎం ఇల్లు ముట్టడిస్తామంటూ.. శాంతిభద్రతలను తమ చేతుల్లోకి తీసుకుంటామనడం ధర్మమేనా అని బొత్స ప్రశ్నించారు. ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని బొత్స హామీ ఇచ్చారు. చర్చలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ విఠాపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్య కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందించాల్సిందేనని, మూడేళ్లలో విద్య కోసం దాదాపు రూ.53వేల కోట్లు ఖర్చుచేయడం గొప్ప విషయమన్నారు. ఈ చర్చలో కేఎస్ లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, పండుల రవీంద్రబాబు, కల్పలతారెడ్డి, పర్చూరి అశోక్‌బాబు మాట్లాడారు.

మీరెందుకు భుజాలు తడుముకుంటున్నారు..

ఇక గుమ్మడి కాయ అని అనగానే టీడీపీ ఎమ్మెల్సీలు తమ భుజాలు తడుముకునే విచిత్ర పరిస్థితి కనిపిస్తోందని మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. మండలి ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యవసాయం దండగని అనుకునే ప్రభుత్వం కాకుండా వ్యవసాయం పండగ చేసే ప్రభుత్వం ఇప్పుడొచ్చిందన్నారు. దీనికి టీడీపీ ఎమ్మెల్సీ లోకేశ్.. దండగ అని ఎవరన్నారో స్పష్టంగా చెప్పాలంటూ సహచర టీడీపీ ఎమ్మెల్సీలతో సభలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి జోక్యం చేసుకుని.. సభ్యుడు ప్రత్యేకంగా ఎవరిని ఉద్దేశించి అనకపోయినా టీడీపీ ఎమ్మెల్సీలు ఎందుకు భుజాలు తడుముకుంటున్నారంటూ ఎద్దేవా చేశారు.

శాసనమండలిలో ప్రశ్నోత్తరాలు

రైతులకు సబ్సిడీపై కిసాన్ డ్రోన్లు



ఈ ఏడాది రెండువేల కిసాన్ డ్రోన్లను రైతులకు సబ్సిడీపై సరఫరా చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఒక్కొక్కటి రూ.పదిలక్షల విలువైన ఈ కిసాన్ డ్రోన్లకు ప్రభుత్వం రూ.నాలుగు లక్షల సబ్సిడీ ఇస్తుందని, రూ.ఐదు లక్షల్ని బ్యాంకు రుణంగా సమకూరుస్తామని తెలిపారు. రైతు రూ.లక్ష మేరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా ఈ ఏడాది రాష్ట్రంలో రైతులకు సరఫరా చేసే వివిధ రకాల వ్యవసాయ సంబంధిత యంత్ర పరికరాలకు ప్రభుత్వం రూ.1,014 కోట్ల సబ్సిడీ ఇవ్వనున్నట్లు చెప్పారు.

గతంకంటే ఎక్కువమంది ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్



ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నివాసం ఉండని ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని విరమించుకుంటూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేవలం 75 యూనిట్ల వరకే ఈ సబ్సిడీ ఇచ్చారని, ఎన్నికల ముందు వంద యూనిట్లకు పెంచారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక దాన్ని 200 యూనిట్లకు పెంచినట్టు చెప్పారు. అదే సమయంలో గతంలో కంటే ఎక్కువ మందికి ప్రభుత్వం ఈ సబ్సిడీని అందజేస్తున్నట్టు గణాంకాలతో వివరించారు.

విద్యావ్యవస్థలో నాడు–నాడు చరిత్రాత్మకం

సాక్షి, అమరావతి: విద్యావ్యవస్థలో సమూల మార్పుల కోసం చేపట్టిన నాడు–నేడు కార్యక్రమం గొప్ప చరిత్రాత్మకమైందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలపై సభ్యుల ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. గత చంద్రబాబు ప్రభుత్వం రెసిడెన్సియల్ స్కూల్స్‌గా మారుస్తామంటూ జీవోలు ఇచ్చి 646 వసతి గృహాలను మూసివేసిందని చెప్పారు. రెసిడెన్సియల్ స్కూల్స్‌గా మార్చలేదని, కనీసం ప్రత్యామ్నాయ అవకాశాలు చూపలేదని తెలిపారు. దీనివల్ల 27,677 మంది ఎస్సీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని, వారిలో అనేకమంది డ్రాపవుట్స్‌గా మిగిలిపోయారని చెప్పారు. తమ ప్రభుత్వం ఆ తప్పులను సరిదిద్ది గతంలో మూసివేసిన హాస్టళ్లను తెరిపించే చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలో చదువులకు గొప్ప అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. పేదపిల్లల భవితకు బంగారుబాట వేసే చర్యలు చేపట్టామన్నారు. మెస్ చార్జీలు పెంచే విషయంలో ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ కార్యదర్శులతో సీఎం వైఎస్ జగన్ సమావేశాన్ని నిర్వహించారని తెలిపారు. మెస్ చార్జీలు పెంచడంతోపాటు మౌలిక వసతులను మరింత మెరుగుపరిచేలా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు.

మరో 4 బిల్లులు.. ఒక తీర్మానం

సాక్షి, అమరావతి: శాసనసభలో శుక్రవారం మరో నాలుగు బిల్లులను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రవేశపెట్టారు. ఇండియన్ స్టాంప్ చట్ట సవరణ బిల్లు, ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఉపసంహరణ బిల్లు, ఏపీ యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లు, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ చట్ట సవరణ బిల్లును మంత్రి ధర్మాన సభలో ప్రవేశపెట్టారు. మరోవైపు రైల్వే ప్రయాణికుల కమిటీలో శాసనసభ నుంచి ఒకరిని నామినేట్ చేయాలని కోరుతూ సభ తీర్మానించింది.



• తన పిల్లలతో సబ్రిన ఖాలిక్

స్ఫూర్తి

ఇల్లే బడిగా మారింది పరిసరాలే పాఠం చెప్పాయి!

రైలుబడి గురించి విన్నాం గానీ ఇంటి బడి గురించి అంతగా విని ఉండం. చదువుకోవాలనే సంకల్పం బలంగా ఉంటే ఇల్లే బడిగా మారుతుంది. పరిసరాలే పాఠాలు చెబుతాయి. గొప్ప విజయాలు అందిస్తాయి. పెళ్లి జరిగిన పదిసంవత్సరాల తరువాత, మళ్లీ చదువు ప్రారంభించిన సబ్రిన ఖాలిక్ పదవ తరగతి పరీక్షలో 93 శాతం మార్కులు సాధించి ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తోంది...

కశ్మీర్‌లోని కుప్వారా పట్టణానికి చెందిన సబ్రిన ఖాలిక్ చదువులో చురుగ్గా ఉండేది. చిన్న వయసులోనే పెళ్లి కావడంతో పదవతరగతి పూర్తి కాకుండానే చదువును అర్ధంతరంగా మానేయాల్సి వచ్చింది. కుటుంబ జీవితంలో ఎలాంటి లోటు లేదు. భర్త, అత్తమామలు బాగా చూసుకుంటారు.

కాని మనసులో ఎక్కడో అసంతృప్తి.

స్కూల్‌కు వెళుతున్న పిల్లలను చూస్తున్నప్పుడు, 'నాకు మ్యాథ్స్‌లో బోలెడు మార్కులు వచ్చాయి తెలుసా' అని గర్వంగా చెబుతున్న పిల్లలను చూసినప్పుడు, కలలు కని ఆ కలను నిజం చేసుకుని మంచి ఉద్యోగం సాధించిన అమ్మాయిలను చూసినప్పుడు....

'నేను కూడా పెద్ద చదువులు చదువుకొని ఉంటే బాగుండేది' అనుకునేది.

తీరిక సమయంలో పత్రికలు తిరగేయడం సబ్రిన అలవాటు.

పెళ్లి అయిన తరువాత చదువును మళ్లీ కొనసాగించి, గొప్ప విజయాలు సాధించిన మహిళల గురించి ఒక ఆర్టికల్‌లో ఇచ్చారు. అది చదివిన తరువాత సబ్రిన మనసు మనసులో లేదు.

'ఎలాగైనా సరే తిరిగి చదువుకోవాలి' అనుకుంది.

'ఇంట్లో చెబితే ఎలా స్పందిస్తారో' అనే సందేహం తన ముందు నిల్చుంది.

'ఇప్పుడు చదువు ఏమిటి!' అని విసుక్కుంటారేమో.

'ముందు పిల్లల చదువులపై దృష్టి పెట్టు' అని సలహా ఇస్తారేమో.

'ఈ వయసులో చదువుకొని ఉద్యోగాలు చేస్తావా, ఊళ్లు ఏలుతావా' అని నవ్వుతారేమో... ఇలా రకరకాల భయాలతో తన మనసులో మాట ఇంట్లో చెప్పలేదు.

ఒకరోజు మాత్రం ధైర్యం తెచ్చుకొని...

'నేను మళ్లీ చదువుకోవాలనుకుంటున్నాను' అని ఇంట్లో వాళ్లకు చెప్పింది.

మిన్ను విరిగి మీద పడలేదు.

'మంచి నిర్ణయం' అన్నారు అందరూ. ఆ సమయంలో తనకు ఎంత సంతోషంగా అనిపించిందో!

పెళ్లయిన పది సంవత్సరాల తరువాత, ముగ్గురు పిల్లలకు తల్లి అయిన సబ్రిన పాఠ్యపుస్తకాలకు చేరువ అయింది. ఎలాంటి ట్యూషన్‌కు వెళ్లలేదు. పొద్దున పిల్లలు స్కూలుకు వెళ్లిన తరువాత, సాయంత్రం పనులు పూర్తయిన తరువాత చదవడం మొదలుపెట్టేది.

అయితే పది సంవత్సరాల తరువాత పాఠ్యపుస్తకాలకు దగ్గరైన సబ్రినాకు చదువుతున్న క్రమంలో అర్థం అయినట్లే ఉండేది. మళ్లీ అంతలోనే అసలు ఏమీ అర్థం కానట్లు ఉండేది. 'అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నానా' అని కూడా అనిపించేది. నిరాశ ఆవహించేది.

'ఇంట్లో ఇంతమంది చదువుకున్నవాళ్లు ఉన్నప్పుడు ఎందుకు భయపడుతున్నాను!' అని ఆలోచించింది సబ్రిన. ఇక అప్పటి నుంచి ఏ చిన్న సందేహం వచ్చినా భర్తను అడిగేది. భర్త ఎంఎస్‌సీ చదువుకున్నాడు. ఒక కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. చదువులో భార్య అడిగే సందేహాలను తీర్చేవాడు. అతడి చెల్లెళ్లు కూడా వదినకు పాఠాలు చెప్పేవాళ్లు. చదువుపై కోడలు చూపిస్తున్న శ్రద్ధను చూసి అత్తమామలు మురిసిపోయేవారు.

రోజూ పిల్లలతో పాటు తాను కూడా పాఠ్యపుస్తకాలు చదువుతూ కూర్చునేది సబ్రిన.

ఒకరకంగా చెప్పాలంటే సబ్రిన కోసం ఆ ఇల్లే ఒక స్కూల్‌గా మారింది.

ఆమె కష్టం వృథా పోలేదు.

10 బై-యాన్యువల్ బోర్డ్ ఎగ్జామ్‌లో 500 మార్కులకుగాను 467 మార్కులు స్కోర్ చేసి ఏ1 గ్రేడ్ సాధించింది.

'పాస్ అవుతానని తెలుసుగానీ, ఇన్ని మార్కులు వస్తాయని ఊహించలేదు. ఇది నాకు సంతోషం ఇవ్వడమే కాదు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. మనం గట్టిగా నిలబడితే అనుకున్నది సాధించడం కష్టమేమీ కాదు అని స్వయంగా తెలుసుకున్నాను. పై చదువులు చదవాలనుకుంటున్నాను ' అంటుంది సబ్రిన.

చుట్టాలు, మిత్రులు సబ్రినను అభినందనలతో ముంచెత్తుతున్నారు.

'సబ్రినకు చదువు మీద ఉన్న ఆసక్తి చూసి మాకు ఎంతో ముచ్చట వేసింది. ఇంటి పని గురించి ఆలోచించవద్దు. చదువు మీద దృష్టి పెట్టు అని చెప్పాం. మనకు ఏ పనిలో ఇష్టం ఉంటుందో అక్కడే సంతోషం లభిస్తుంది. ఆ సంతోషంతో ఎన్నో విజయాలు సాధించవచ్చు' అని చెబుతుంది సబ్రిన అత్త రఫిక బేగం.

సబ్రినలాగే చిన్న వయసులోనే పెళ్లి అయి చదువుకు దూరమైన వారు, ఇప్పుడు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మళ్లీ చదువుకోవాలనుకుంటున్నారు. ఇంత కంటే పెద్ద విజయం ఏముంటుంది!

కవిత్వం పాడే అమ్మాయి



• జీవన సహచరుడు జోయెల్ ముఖర్జీతో...



తిలక్‌ని, కృష్ణశాస్త్రిని,
శ్రీశ్రీని, జాషువాని
పాడుతూ ఒక రాక్‌బ్యాండ్
ఉంటే ఎలా ఉంటుంది?
తెలుగులో అలాంటిది లేదు.
కాని చిన్మయి త్రిపాఠికి
కవిత్వం అంటే ఇష్టం.
కబీర్‌ని, తులసీదాస్‌ని,
ఆధునిక హిందీ కవులను
ఆమె తన రాక్ బ్యాండ్ ద్వారా
పాడుతూ దేశమంతా తిరుగుతూ ఉంటుంది.
'మ్యూజిక్ అండ్ పొయెట్రీ స్టుడియో'
పేరుతో చేస్తున్న ఈ కృషి
చిన్మయిని ప్రత్యేకంగా నిలబెట్టింది.

స్టేజ్ మీద ఇద్దరు ముగ్గురు వాద్యకారులు తప్ప ఎక్కువ మంది ఉండరు. చిన్మయి త్రిపాఠి తన భుజానికి 'దోతార' అనే సంప్రదాయ తీగ వాయిద్యాన్ని తగిలించుకుని పాడటం మొదలెడుతుంది. పాటంటే పాట కాదు. కవిత్వం. ఉదాహరణకు ప్రఖ్యాత హిందీ కవి వినోద్ కుమార్ శుక్లా రాసిన 'మా ఇంటికి రాని అతిథుల కోసం' అనే కవితను పాడుతుంది.

'మా ఇంటికి కొందరు అతిథులు ఎప్పటికీ రారు.
కొండలు, నదులు, రంగు రంగు చెట్లు,
విరగపండిన పొలాలు
ఇవి ఎప్పటికీ రావు.
నేనే ఆ పొలాల వంటి మనుషులను కలవడానికి వెళతాను.
నదుల వంటి మనుషుల్ని, కొండల వంటి, కొండ కోనల వంటి,
చెట్లతో నిండిన అడవుల వంటి మనుషులను కలవడానికి వెళతాను.
ఇదేదో నేను తీరుబడి చూసుకొని చేసే పని కాదు.
చాలా అత్యవసరమైన పని అన్నట్టుగా వెళ్లి కలుస్తాను.
మా ఇంటికి ఎప్పటికీ రాని అతిథుల కోసం నేనే బయలుదేరుతాను'

ఈ కవిత ఆమె పాడుతుంటే అద్భుతంగా ఉంటుంది. ఆ తర్వాత ఆమె సుశీల్ శుక్లా అనే కవి రాసిన 'వృక్షమా... నీవొక దర్జీవి' అనే కవితను పాడుతుంది. 'ఎన్ని గూళ్లను అల్లి ఉంటావు. ఎన్ని గాలులను కుట్టి ఉంచాము. ఎన్ని నీడలను ముక్కలు ముక్కలు చేసి కింద పరిచి ఉంటావు... ఓ వృక్షమా... నీవొక దర్జీవి' అనే కవితను చాలా అందంగా పాడుతుంది.

చిన్మయి త్రిపాఠిని చూస్తుంటే ఇలాంటి గాయని తెలుగులో గొప్ప గొప్ప కవిత్వాన్ని పాడేలా ఉంటే ఎంత బాగుండు అనిపిస్తుంది. ఢిల్లీకి చెందిన చిన్మయి త్రిపాఠి 'మ్యూజిక్ అండ్ పొయెట్రీ స్టుడియో' స్థాపించి గాయకుడు, జీవన సహచరుడు అయిన జోయెల్ ముఖర్జీతో కలిసి హిందీ కవిత్వాన్ని దేశమంతా పాడుతోంది.

'మాది ఢిల్లీ. చిన్నప్పటి నుంచి శాస్త్రీయ సంగీతాన్ని నేర్చుకున్నాను. కాని అందరిలా చదువులో కొట్టుకుపోయాను. ఎం.బి.ఏ చేసి ఉద్యోగం మొదలెట్టాక నేను ఇందుకు పుట్టలేదు అనిపించింది. 'స్పైస్ రూట్' అనే ర్యాక్ బ్యాండ్ మొదలెట్టాను. కాని అది ఎక్కువ రోజులు నడవలేదు. ఒక రోజు స్నేహితులతో మాట్లాడుతుంటే ఇవాళ్టి పాటల్లో సరైన కవిత్వమే ఉండటం లేదన్న చర్చ వచ్చింది. హిందీలో భారతీయ సాహిత్యంలో ఎంతో గొప్ప కవిత్వం ఉంది. దానిని మళ్లీ ఈ తరానికి వినిపిస్తే ఎలా ఉంటుంది... అనిపించింది. ఈ విషయాన్ని నేనో క్రౌడ్ ఫండింగ్ ప్లాట్ ఫామ్‌తో షేర్ చేసుకున్నాను. మంచి రెస్పాన్స్ వచ్చింది. వెంటనే రంగంలో దిగాను' అంటుంది చిన్మయి త్రిపాఠి.

చిన్మయి కూడా కవిత్వం రాస్తుంది. చాలా కవిత్వం చదువుతుంది. కనుక ఆ కవిత్వం మీద ప్రేమతో పాడటం వల్ల వెంటనే ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. కబీర్ దాస్‌తో మొదలెట్టి హిందీలో ఆధునిక కవులు– హరివంశ్‌రాయ్ బచ్చన్, మహాదేవి వర్మ, నిరాలా, ధర్మ్‌వీర్ భారతి... వీరందరి కవిత్వాన్ని తనే ట్యూన్ కట్టి పాడుతుంది. చిన్మయి గొంతు చాలా భావాత్మకంగా ఉంటుంది. అందుకని కవిత్వంలో ఉండే ఎక్స్‌ప్రెషన్ బాగా పలుకుతుంది.

'మన దేశంలో ఉర్దూలో చాలా మంచి కవిత్వం వచ్చి మరుగున పడిపోయింది. ఇప్పుడు దానిని వెతికి తీసే ప్రయత్నంలో ఉన్నాను' అంటుంది చిన్మయి. ముంబైలో ఉంటూ తన బ్యాండ్‌తో తిరిగే చిన్మయి లండన్‌లో ప్రదర్శన ఇచ్చినప్పుడు అక్కడి ఇంగ్లిష్ ప్రేక్షకులకు హిందీ తెలియకపోయినా ఆ శబ్దాలకు తన్మయులయ్యారని చెబుతుంది చిన్మయి. తన ప్రదర్శనల్లో కశ్మీరీ, బెంగాలీ కవిత్వం కూడా పాడుతోంది చిన్మయి.

'త్వరలో నేను భగవద్గీతను ఆధునిక సంగీత పరికరాలతో పాడాలని నిశ్చయించుకున్నాను. అదీ ఒక గొప్ప కవిత్వమే కదా' అంటుంది చిన్మయి. మనకు ఘంటసాల పాడిన భగవద్గీత తెలుసు. ఆధునిక లయతో చిన్మయి ఎలా పాడుతుందో చూడాలి.

కురులు మృదువుగా మారాలా?

బ్యూటిప్స్



సరైన పోషణ, తగినంత శ్రద్ధ లేకపోతే జుట్టు పొడిబారి ఎండుగడ్డిలా బరకగా మారడమేగాక, చివర్లు చిట్లిపోయి మరింత నిర్జీవంగా కనిపిస్తుంటుంది. ఇలా కనిపించగానే వెంటనే చిట్లిన వెంట్రుకలను కత్తెరతో కత్తిరించేస్తుంటారు. చివర్లు తీసేసినప్పటికీ కొద్ది రోజుల్లో సమస్య మొదటికే వస్తుంది. చీటికి మాటికి జుట్టు కత్తిరించే ముందు ఈ చిట్కాలను పాటించి చూడండి జుట్టు పొడిబారడం, చిట్లడం కూడా తగ్గుతుంది.

• పదేపదే వెంట్రుకలు చిట్లిపోతుంటే గోరు వెచ్చని నూనెతో కుదుళ్ల నుంచి చివర్ల వరకు మర్దన చేయాలి. వారానికి కనీసం రెండు సార్లు మర్దన తప్పనిసరిగా చేయాలి.

• జుట్టుని ఆరబెట్టడానికి, స్ట్రెయిటనింగ్, రింగులుగా మార్చుకోవడానికి హెయిర్ డ్రయ్యర్‌ను తరచూ వినియోగించకూడదు. పదేపదే హెయిర్ డ్రయ్యర్ వాడడం వల్ల జుట్టు పొడిబారిపోయి, చిట్లిపోతుంది.

• ముఖం జిడ్డుకారుతుందని పదేపదే షాంపుతో తలస్నానం చేస్తే.. మాడు నుంచి సహజసిద్ధంగా విడుదలయ్యే తైలాలు క్రమంగా తగ్గుముఖం పడతాయి. ఈ తైలాల విడుదల తగ్గితే వెంట్రుకలు పొడిబారి, చిట్లిపోాయి.

• ఎప్పుడు తలస్నానం చేయాలనుకున్నా ముందుగా తలకు నూనె పట్టించి అరగంట తరువాతే తలస్నానం చేయాలి. మరీ ఎక్కువ వేడి... లేదా మరీ చల్లగా ఉన్న నీళ్లు కాకుండా గోరువెచ్చని నీటితోనే తలస్నానం చేయాలి.

• తలస్నానం చేసిన తరువాతే హెయిర్ కండీషనర్ రాసుకోవాలి. అప్పుడే వెంట్రుకలకు మంచి పోషణ అంది మెరుపుని సంతరించుకుంటాయి. కండీషనర్‌ను చివర్లకు పట్టించడం ద్వారా జుట్టుకు మంచి పోషణ అందుతుంది.

కిచెన్ టిప్స్





• ఇంటి అలంకరణలో భాగంగా నీటిలో పూలు వేసి పెడుతుంటాము. గిన్నెలో నీళ్లుపోసి కొద్దిగా జవ్వాజి పొడివేసి కలపాలి. తరువాత పూలు వేసి పెడితే ఇల్లంతా మంచి సువాసన వస్తుంది. జవ్వాజి పొడి సూపర్ మార్కెట్లలో దొరుకుతుంది.



• పచ్చిమిర్చిని సన్నగా తరిగి, కొద్దిగా వాము, ఉప్పు, అరచెక్క నిమ్మరసం పిండి కలపాలి. ఈ మిశ్రమాన్ని రిఫ్రిజిరేటర్‌లో స్టోర్ చేసుకోవాలి. పెరుగన్నం తినేటప్పుడు ఈ మిశ్రమం నంచుకుంటే చాలా రుచిగా ఉంటుంది.



• బీట్‌రూట్‌ను తినడానికి అందరూ ఇష్టపడరు. కానీ బీట్‌రూట్‌లోని పోషకాలను ఇంటిల్లిపాదికి అందించాలని ఉంటుంది. ఇటువంటప్పుడు బీట్‌రూట్‌ను తొక్కతీసి ముక్కలు తరిగి, పేస్టులా రుబ్బుకోవాలి. ఈపేస్టుని చపాతి పిండిలో వేసి కలిపి రోటీ, చపాతీలు చేస్తే చూడడానికి కలర్‌ఫుల్‌గా ఉండడమే కాదు, రుచికూడా బావుంటుంది. బీట్‌రూట్‌ను నేరుగా తినలేని వారు ఇలా అయితే సులువుగా తినగలుగుతారు.

ప్రకటనల్లో నేటి మహిళ

కురులకు షాంపూలు.. మేనికి సబ్బులు..
వంటింట్లో కుకర్, మిక్సీలకే కాదు
పురుషులు వాడే షేవింగ్ క్రీములకూ మహిళలను చూపించనిదే
ఏ ప్రకటనా ఉండదనే విషయం తెలిసిందే. ఇటీవల కాలంలో ప్రకటనల్లో మహిళా శక్తిని
ఏ విధంగా చూపుతున్నారనే అంశం మీద అడ్వర్టయిజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా
(ఆస్కీ). ఫ్యూచర్ బ్రాండ్స్ ఆధ్వర్యంలో జెండర్ నెక్ట్స్ పేరిట ఓ స్టడీ నిర్వహించింది.
'నేటి ఆధునిక రోజుల్లోనూ వాణిజ్య ప్రకటనల్లో చాలా వరకు మహిళల్ని
ఇంకా మూస పద్ధతిలోనే చూపిస్తున్నారు' అనేది ఈ స్టడీలో తేలింది.

కురులకు షాంపూలు.. మేనికి సబ్బులు.. వంటింట్లో కుకర్, మిక్సీలకే కాదు పురుషులు వాడే షేవింగ్ క్రీములకూ మహిళలను చూపించనిదే ఏ ప్రకటనా ఉండదనే విషయం తెలిసిందే. ఇటీవల కాలంలో ప్రకటనల్లో మహిళా శక్తిని ఏ విధంగా చూపుతున్నారనే అంశం మీద అడ్వర్టయిజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆస్కీ). ఫ్యూచర్ బ్రాండ్స్ ఆధ్వర్యంలో జెండర్ నెక్ట్స్ పేరిట ఓ స్టడీ నిర్వహించింది. 'నేటి ఆధునిక రోజుల్లోనూ వాణిజ్య ప్రకటనల్లో చాలా వరకు మహిళల్ని ఇంకా మూస పద్ధతిలోనే చూపిస్తున్నారు' అనేది ఈ స్టడీలో తేలింది.



ప్రకటనల రంగంలో మహిళల ప్రాతినిధ్యంపై చేసిన లోతైన పరిశీలన ఇది. దాదాపు 600 ప్రకటనల్ని పరిశీలించిన అనంతరం మహిళల శక్తిని తక్కువ చేసి చూపుతున్నట్టు జెండర్ నెక్ట్స్ స్టడీ నిరూపించింది. ఆకాశమే హద్దుగా ఎదుగుతున్న నేటి మహిళను ఆంక్షల్లో చూపెట్టడం సరికాదన్న విషయాన్ని స్పష్టం చేసింది.

సంధించిన బాణాలు

పర్సనల్ కేర్, ఫ్యాషన్, బ్యూటీ, హెల్త్, గాడ్జెట్స్, వీల్స్, విద్య, మనీ... సంబంధిత ప్రకటనలపై స్టడీ చేసిన అనంతరం కొన్ని ప్రశ్నలను రూపొందించి, వాటిని ఆన్‌లైన్ వేదిక ద్వారా 'నేటి కాలంలో ప్రకటనలు మహిళల్ని ఎలా చూపిస్తున్నాయి? మహిళలు తమను తాము ఎలా భావిస్తున్నారు? తమను ఎలా చూపాలనుకుంటున్నారు?' అనే ప్రశ్నలకు వృత్తి ఉద్యోగాలలో ఉన్న మహిళల నుంచి సమాధానాలు రాబట్టింది. ఈ పరిశోధనలో భాగంగా అన్ని రకాల ప్రకటనలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం జెండర్ నెక్ట్స్ స్టడీకి ప్రధాన ఆథర్ గా వ్యవహరించిన లిపికా కుమరన్ మాట్లాడుతూ 'ప్రకటనల్లో సానుకూల అంశాలున్నప్పటికీ, మెయిన్ స్ట్రీమ్ అడ్వర్టయిజింగ్‌లో కొన్ని హానికరమైన స్టీరియో టైప్స్ పాత్రలున్నాయ'న్నారు.

మహిళలకు సవాల్!

మహిళలు ఆహారం తీసుకునే అలవాటును అత్యంత సున్నితంగా చూపడం పట్ల స్టడీ అభ్యంతరం వ్యక్తం చేసింది. అలాగే మిగిలిన వారంతా విశ్రాంతిగా కూర్చుని ఉండగా మహిళలు ఆపసోపాలు పడుతూ ఇంట్లో పనులు చేస్తున్నట్టు చూపడం, షాపింగ్‌లో అధికంగా ఖర్చు చేసేవారన్నట్టు, బ్యూటీ యాడ్స్‌లో మగ వాళ్ల చూపులకు నచ్చే విధంగా ఉండేలా చూపడం, టెక్నాలజీ, గాడ్జెట్స్ వాడకంలో మహిళల శక్తి తక్కువ అన్నట్టు చూపడంతో పాటు మగ సెలబ్రిటీలు మహిళలకు సవాళ్లు విసురుతుండడం, ఆదేశాలు ఇస్తుండడం.. వంటివి అభ్యంతరకరంగా తేల్చారు. డిటర్జెంట్, ఫుడ్‌కు సంబంధించినవన్నీ మహిళల చేత మహిళలకోసమే రూపొందించినట్టుగా ఉండటం కూడా ఇందులో ప్రధానంగా గుర్తించారు.

అంగీకరించని నేటి తరం

ప్రకటనలపై విభిన్న వర్గాల మహిళలు సైతం ఈ అభ్యంతరాల్ని సమర్థించారు. స్వయం సమృద్ధి దిశగా తమ ప్రయాణానికి ప్రకటనలు నేస్తాలు కావాలని వారు ఆకాంక్షిస్తున్నారు. ఇంట్లో పనంతా నెత్తినే సుకునేలా చూపడాన్ని నవ యువ వధువులు అంగీకరించడం లేదు. అలాగే మహిళా దినోత్సవం రోజున ఇచ్చే ప్రకటనల్లో... ఎన్నో కష్టాల తర్వాత మహిళలు విజేతలు అయినట్టుగా చూపడం కూడా ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ పరిశోధన ఫలితాల అనంతరం ప్రకటనల్లో మహిళల పాత్ర మెరుగుదలకు గాను ఆస్కీ పలు ప్రతిపాదనలు చేసింది.

ఈ అధ్యయనం కోసం జాతీయ, ప్రాంతీయ ప్రకటనదారులు, ఏజెన్సీ, విధాన నిర్ణేతలు, న్యాయవాదులు .. ఇలా అందరు నిపుణులు సంప్రదించారు. 'ప్రకటనలలో మహిళలను హానికరమైన మూసపద్ధతుల్లో చూపడం వల్ల యువతుల మానసిక స్థితిపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని, వీటి వల్ల వారు సమాజంలో తమ విలువను ఏ విధంగా చూస్తారు' అనే అంశాన్ని ఈ స్టడీ వెలుగులోకి తీసుకువచ్చింది.

ఇటీవల ఒక పాల ఆధారిత ఉత్పత్తి కంపెనీ తన యానివర్సరీ వేడుకల్లో భాగంగా ఒక ప్రకటనను విడుదల చేసింది. అందులో భార్య, అమ్మ, అత్త, అమ్మమ్మ స్థానంలో ఉన్న ఆడవాళ్లందరూ మగవాళ్లకు రుచికరమైన వంటలు చేసి పెట్టేవారిగానే చూపారన్న అభియోగాలను సోషల్‌మీడియా వేదికగా ఎదుర్కొంటోంది.



దాదాపు ఒక ఇరవై ఏళ్ల కిందటి వరకు జ్వరమొచ్చి తగ్గిన వాళ్లకి పొట్లకాయ, బీరకాయ, దొండకాయ, కాకరకాయ లాంటి కూరలు పథ్యం పెట్టేవాళ్లు పెద్దవాళ్లు. అదేవిధంగా నీరసంగా ఉన్న వాళ్లకి ఆవిరి కుడుముల లాంటివి పెట్టేవాళ్లు. ఇవి తేలికగా అరగడంతోపాటు వంటికి సత్తువనిచ్చేవి. ఇది ఒకప్పటి మాట కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. ఆధునిక వైద్యులు, ఆహార నిపుణులు కూడా ఆవిరితో తయారు చేసుకున్న ఆహార పదార్థాలనే తినమని సూచిస్తున్నారు చాలా మందికి. ఎందుకో ఏమిటో తెలుసుకుందాం.

ఆవిరితో వండితే ఆరోగ్యం అదుర్స్

ఇడ్లీలు ఆవిరితోనే తయారవుతాయి. ఇది అందరికీ తెలిసిందే. అయితే ఆవిరితో ఇడ్లీలతోపాటు ఎన్నో రకాల వంటకాలను తయారుచేసుకోవచ్చు. ఎందుకంటే ఆవిరితో వండిన వంటలు మన ఆరోగ్యానికి ఎన్నో విధాలా మేలు చేస్తాయి. నూనెతో డీప్ ఫ్రై చేయడంతో పోలిస్తే ఆవిరితో వండటం వల్ల వాటిలో ఉండే పోషకాలు ఎక్కడికీ పోవు. కొవ్వు చాలా తక్కువగా ఉంటుంది. కేలరీలు కూడా తక్కువగానే ఉంటాయి. ఇలాంటి ఆహారం తొందరగా జీర్ణం అవుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఉత్తమమైన ఆహారం.



విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉండే ఆహారాలు మన ఆరోగ్యానికి చాలా అవసరం. అయితే సాధారణంగా చాలా మంది ఇలాంటి ఆహార పదార్థాలను ఉడకబెట్టి వండుతారు. దీంతో వాటిలో ఉండే పోషకాలు చాలా తగ్గిపోతాయి. అలా కాకుండా ఆవిరిలో ఉడికించడం వల్ల నియాసిన్, విటమిన్ బి, థయామిన్, విటమిన్ సి వంటివి మన శక్తిని మరింత పెంచుతాయి. ఇవి తిన్నవారికి ఖనిజాలు, పొటాషియం, ఫాస్ఫరస్, కాల్షియం, జింక్ వంటిపోషకాలు సమృద్ధిగా లభిస్తాయి.

సాధారణంగా ప్రతి వంటకు నూనెను ఖచ్చితంగా ఉపయోగిస్తారు. కానీ ఆవిరితో తయారు చేసే ఆహారాలకు నూనె అవసరమే లేదు. అందుకే ఆవిరి పట్టిన ఆహారాల్లో కొవ్వు పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది కాబట్టి బరువు తగ్గాలనుకునేవారికి ఇది బెస్ట్ ఫుడ్ అని నిపుణులు చెబుతున్నారు.

ఆవిరితో వండిన ఆహార పదార్థాలలో కేలరీలు, కొవ్వు పదార్థాలు చాలా తక్కువగా ఉంటాయి. ఇవి చాలా తొందరగా జీర్ణం అవుతాయి. ఈ ఆహారం బరువుతోపాటు ఎన్నోరకాల అనారోగ్య సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది.

కూరగాయలు, పండ్లు తేలికగా జీర్ణం అవుతాయి. ఆవిరిలో వండిన ఆహారాలు చాలా మృదువుగా తయారవుతాయి. ఆవిరి పట్టిన ఆహారం చాలా తేలిగ్గా జీర్ణం అవుతుంది. ఇది మీ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది.

కొలెస్ట్రాల్‌ను అదుపు చేస్తుంది

ఆవిరిలో ఉడికించిన ఆహారం కొవ్వులను నియంత్రణలో ఉంచుతుంది. ఎందుకంటే ఈ వంటలో నూనెను ఉపయోగించకపోవడమే దీనికి కారణం. వంటల్లో నూనెవల్లే చాలా బరువు పెరుగుతారు. అందుకే ఎక్కువ కొవ్వు లేదా నూనెను తినకూడదు. ఇది అధిక రక్తపోటుకు దారితీస్తుంది.

రంగు, రుచి మారదు

ఆవిరితో వండిన కూరగాయల రంగు అస్సలు మారదు. రుచి కూడా బాగుంటుంది. మరింత రుచికరంగా కొన్ని రకాల మసాలా దినుసులను ఉపయోగించవచ్చు.

కాబట్టి ఆరోగ్యం బాగుండాలంటే ఆవిరి మీద తయారు చేసే ఆహార పదార్థాలేమిటో తెలుసుకుని వాటి మీద దృష్టి పెట్టాల్సిందే మరి!

చిన్నతనంలో పిల్లలు ఆట, పాటల్లో మునిగి తేలడటం సహజం. అలా కాకుండా ఒకేచోట కదలకుండా కూర్చుంటే మాత్రం ఆలోచించాల్సిన విషయమే. ఎందుకంటే చిన్నతనంలో శారీరక వ్యాయామం చేయడం వల్ల పిల్లలు పెరిగి పెద్దయ్యాక శారీరకంగానూ, మానసికంగానూ ఆరోగ్యంగా ఉంటారు. ముఖ్యంగా కౌమార దశ అంటే టీనేజ్‌లో పిల్లలు వ్యాయామం చేస్తే పెద్దయ్యాక కూడా వృత్తి రీత్యా ఎటువంటి ఒత్తిళ్లకు లోనుకారు. అంతేకాదు, మిడిల్ ఏజ్‌లో గుండె జబ్బులు, ముసలితనంలో అల్జీమర్స్ రాకుండా ఉంటాయి.

మీ పిల్లలు చురుగ్గానే ఉంటారా?



వ్యాయామం నేరుగా మెదడు పెరుగుదలను ప్రేరేపిస్తుంది కనుక వ్యాయామాన్ని పొట్ట తగ్గటానికి, లావు తగ్గటానికి అనే కాకుండా ఆరోగ్యం కోసమని చెప్పి వారికి అలవాటు చేయాలి తల్లిదండ్రులు. వాళ్లను వ్యాయామానికి పంపే బాధ్యత తీసుకోవాలి లేదా ఇంట్లో తల్లితండ్రులు వ్యాయామం చేసే సమయంలో వారిని జత చేసుకుంటే బాగుంటుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు... వ్యాయామం వల్ల పిల్లల్లో జ్ఞాపక శక్తి బాగా పెరుగుతోందట. దీంతో వారు చదువుతో కుస్తీ పడాల్సిన అవసరం లేదు. చక్కగా చదువుకుని పరీక్షల్లో రాణించగలుగుతారు. అలాగే వారి ఆరోగ్యం కోసం నిత్యం సరైన సమయానికి పోషకాలతో కూడిన పౌష్టికాహారాన్ని అందివ్వాలి. దీంతో వారు శారీరకంగానే కాకుండా, మానసికంగానూ ఆరోగ్యంగా ఉంటారు.

వ్యాయామం ఎంతసేపు? ఎలా?

యూనివర్సిటీ ఆఫ్ బ్రిటీష్ కొలంబియాకు చెందిన కొందరు శాస్త్రవేత్తలు పిల్లలపై పరిశోధనలు నిర్వహించారు. నిత్యం వ్యాయామం చేసే పిల్లలు, వ్యాయామం చేయని పిల్లలతో పోల్చి వారు చదువుల్లో ఎలా రాణిస్తున్నారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. నిత్యం వ్యాయామం చేసే పిల్లలు చురుగ్గా ఉండడంతోపాటు చదువులో కూడా రాణిస్తారని తెలుసుకున్నారు. అందువల్ల పిల్లల్ని రోజూ కనీసం 60 నిమిషాల పాటు అయినా వ్యాయామం చేసేలా ప్రోత్సహించాలని, లేదా కనీసం ఆటలు ఆడుకునేందుకు పెద్దలు అనుమతించాలని వారు సూచిస్తున్నారు. అందువల్ల రోజు మొత్తంలో ఉదయం 30 నిమిషాలు, సాయంత్రం మరో 30 నిమిషాల పాటు పిల్లలతో వ్యాయామం చేయిస్తే సరిపోతోంది.

ఈ ఫుడ్ అయితే గుడ్

పిల్లలు యాక్టివ్‌గా ఉండాలంటే వ్యాయామం చేయించడంతోపాటు ఆహారం విషయంలోనూ తగిన శ్రద్ధ తీసుకోవాలి. కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, తృణ ధాన్యాలు, పాలు, పాల పదార్థాలు వంటివి ఎక్కువగా పెట్టాలి. బయట దొరికే ఫుడ్ అస్సలు పెట్టకూడదు. ఇంట్లో మనం రోజువారీ పనులు చేసుకునేటప్పుడు చిన్న చిన్న సాయాలు చేయమని అడగాలి. అలా చేస్తే వాళ్లకు చిన్నప్పటి నుండే పరోపకార గుణం అలవాటు అవుతుంది.



చివరగా ఒక్క విషయం.. . పిల్లలు ఇంట్లో తల్లిదండ్రులు ఏది చేస్తే అదే నేర్చుకుంటారు. అందుకే ముందు మనలో మార్పు రావాలి. మీరు వాళ్ళ ముందు మంచి ఆహారం తీసుకుంటూ వ్యాయామం చేస్తూ ఉండాలి. అది చూసిన పిల్లలు తాము కూడా అదే చేసేందుకు ఇష్టపడతారు. అప్పుడు వాళ్ళకి మంచి పద్ధతులు అలవాటు అవుతాయి. చదువులోనూ, ఆటపాటల్లోనూ కూడా చురుగ్గా ఉంటారు.

మీకు తెలుసా?

సాధారణంగా పండ్లు ఎవరికైనా మంచివే. ఎందుకంటే పండ్లలో మన ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నోరకాల పోషకాలుంటాయి. అందుకే వీటిని ఎక్కువగా తినాలని ఆరోగ్య నిపుణులు, డాక్టర్లు సలహానిస్తుంటారు. కానీ మధుమేహుల ఆరోగ్యానికి కొన్నిరకాల పండ్లు బొత్తిగా మంచివి కావు. ముఖ్యంగా చక్కెర శాతం ఎక్కువగా ఉండేవి. ఈ పండ్లు మధుమేహుల రక్తంలో చక్కెర స్థాయులను పెంచుతాయి. ఫైనాపిల్, సీతాఫలం, అరటి,



సపోటా, మామిడి పండ్లలో అధికమొత్తంలో చక్కెర ఉంటుంది కాబట్టి వీటికి దూరంగా ఉండటం మంచిది. జామ, బొప్పాయి, అరటి వంటి వాటిని బాగా పండినవాటికంటే దోరగా ఉన్నవి మంచివి. నేరేడు పళ్లు, కివీ పండ్లు ఎలా తిన్నా చెరుపు చేయవు. అయితే తక్కువ పరిమాణంలో తీసుకోవడం మంచిది. అలాగే క్యారట్, బీట్రూట్లలోనూ, ఇతర దుంప కూరలలోనూ బీట్రూట్‌తో పోల్చితే మధుమేహులకు క్యారట్లే మంచిది.

సినిమా



నాగార్జున, సోనాల్

నిన్ను చేరమంది అంతులేని వేగం..

'నీలి నీలి సంద్రం.. నింగిలోని మేఘం.. నిన్ను చేరమంది అంతులేని వేగం...' అంటూ మొదలైంది 'వేగం' పాట. నాగార్జున హీరోగా ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ది ఘోస్ట్'. ఇందులో సోనాల్ చౌహాన్ హీరోయిన్‌గా నటించారు. సోనాలి నారంగ్ సమర్పణలో నారాయణ్‌దాస్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్, శరత్ మరార్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'వేగం' పాట పూర్తి లిరికల్ వీడియోను శుక్రవారం చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. భరత్, సౌరభ్ స్వరాలందించిన ఈ పాటకు కృష్ణ మాదినేని సాహిత్యం అందించగా, కపిల్ కపిలన్, రమ్య బెహరా ఆలపించారు. గుల్ పనాగ్, అనిఖా సురేంద్రన్ కీలక పాత్రలు పోషించిన ఈ సినిమాకు మార్క్ కె. రాబిన్ సంగీత దర్శకుడు. ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వెంకటేశ్వరరావు చల్లగుళ్ల.

తండ్రిగా గర్వంగా ఉంది

\- ప్రభాకర్



● మలయజ, చంద్రహాస్, ప్రభాకర్

"నేను ఇండస్ట్రీకి వచ్చి 25ఏళ్లు అయింది. మా అబ్బాయి చంద్రహాస్‌ను నటనవైపు ఎక్కువగా ప్రోత్సహించింది నా భార్య మలయజ. తాను చేసిన యూ ట్యూబ్ వీడియో ద్వారా నా ప్రమేయం లేకుండానే చంద్రహాస్ హీరోగా అవకాశాలు తెచ్చుకోవడం తండ్రిగా గర్వంగా ఉంది'' అని నటుడు ప్రభాకర్ అన్నారు. ఆయన తనయుడు చంద్రహాస్ హీరోగా పరిచయం కానున్నాడు. నేడు చంద్రహాస్ పుట్టినరోజు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో 'ఇంట్రడ్యూసింగ్ చంద్రహాస్' పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభాకర్ మాట్లాడుతూ– ''చంద్రహాస్ చేసిన 'నాటు నాటు..' అనే కవర్ సాంగ్ మంచి పేరుతో పాటు హీరోగా రెండు అవకాశాలు తేవడంతో ఆశ్చర్యపోయాను. వీటిలో కృష్ణ దర్శకత్వంలో కిరణ్ బోయినపల్లి, కిరణ్ జక్కంశెట్టి నిర్మిస్తున్న సినిమా, సంపత్ వి. రుద్ర డైరెక్షన్‌లో ఏవీఆర్, నరేష్‌గార్లు నిర్మిస్తున్న చిత్రం షూటింగ్ జరుపుకుంటున్నాయి. అలాగే మా స్వంత సంస్థలో ఓ సినిమా నిర్మించనున్నాం'' అన్నారు. ''పరిశ్రమలోని చాలామందిని చూసి నటుడిగా స్ఫూర్తి పొందాను.. ముఖ్యంగా రామ్ చరణ్, అల్లు అర్జున్‌గార్లు.. వారి అంకితభావానికి హ్యాట్సాఫ్. హీరో అవ్వాలనేది నా కల.. ప్రేక్షకుల హృదయాల్లో స్థానం కోసం కష్టపడతాను'' అన్నారు చంద్రహాస్.

అది దేవుడిచ్చిన బహుమతి



● రాజ్ బాల

'లవ్ బూమ్,7 టు 4, చిత్రం ఎక్స్' వంటి చిత్రాల్లో హీరోగా నటించిన రాజ్ బాల నటిస్తున్న తాజా చిత్రం షూటింగ్ జరుగుతోంది. జాక్ దర్శకత్వంలో కమలాకరరావు, కిషోర్ నిర్మిస్తున్న ఈ సినిమాలో ఇషా చావ్లా హీరోయిన్. కాగా నేడు తన పుట్టినరోజు సందర్భంగా రాజ్ బాల మాట్లాడుతూ– ''ఎందుకంటే ప్రేమంట'లో చిన్న పాత్ర చేశా. ఆ తర్వాత 'తొంగి తొంగి చూడమాకు చందమామ, 'అంతకు మించి' వంటి సినిమాలు చేశాను. ఆ టైమ్‌లో డైరెక్టర్ నగేష్ నారదాసిగారు 'లవ్ బూమ్'లో హీరోగా అవకాశం ఇచ్చారు. నటుడిగా, హీరోగా ఈ పదేళ్ల ప్రయాణంలో హ్యాపీగా ఉన్నాను.. అది నాకు దేవుడిచ్చిన బహుమతి.. ప్రస్తుతం జాక్ దర్శకత్వంలో నేను హీరోగా చేస్తున్న సినిమా 40 శాతం పూర్తయింది. 'గాలోడు'లో నెగిటివ్ రోల్ చేశాను. అలాగే కన్నడలో 'ననిగే ఎంతి బేకు', తెలుగులో 'నాకు పెళ్లాం కావాలి, బృహన్నల, రా' చిత్రాలు చేస్తున్నాను'' అన్నారు.

క్యూటు క్యూటు.. స్వీటు పిల్లా..!

ఉదయ్ శంకర్, జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ జంటగా గురుపవన్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'నచ్చింది గర్ల్‌ఫ్రెండూ'. ఆర్. సౌజన్య సమర్పణలో అట్లూరి నారాయణరావు నిర్మించిన చిత్రం ఇది. 'ఎర్రతోలు పిల్లా ఎర్రతోలు హాటు పిల్లా... పండులాంటి క్యూటు క్యూటు స్వీటు పిల్లా..' అంటూ సాగే ఈ సినిమాలోని పాట లిరికల్ వీడియోను దర్శకుడు సుకుమార్ విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. గిఫ్టన్ ఎలియాస్ స్వరకల్పనలో గిరి కోడూరి లిరిక్స్ అందించిన ఈ పాటను ధనుంజయ్ పాడారు. ఈ సినిమాకు కెమెరా: సిద్ధం మనోహర్.



● ఉదయ్ శంకర్, అట్లూరి నారాయణరావు, సుకుమార్, గురు పవన్



దీపికా పదుకోన్
ఆలియా భట్

మహేశ్ సరసన ఎవరు?

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్, ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. పనిలో పనిగా నటీనటుల ఎంపికపై కూడా రాజమౌళి దృష్టి సారించారు. ప్రస్తుతం హీరోయిన్‌ను ఎంచుకునే పనిలో ఉన్నారని సమాచారం. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించనున్నారంటూ ప్రముఖంగా ఆలియా భట్, దీపికా పదుకోన్ పేర్లు తెర్పైకి వచ్చాయి. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్'లో ఆలియా భట్ నటించిన విషయం తెలిసిందే. మరోసారి రాజమౌళి చాన్స్ ఇస్తే ఆలియా కాదంటారా? అయితే ఇప్పుడు ఆలియా గర్భవతి. కొత్త సినిమాలు కమిట్ కావడంలేదు. కానీ మహేశ్–రాజమౌళి సినిమా వచ్చే ఏడాది ఆరంభం అవుతుంది. సో.. రాజమౌళి ఆఫర్ ఇస్తే ఆలియా నటించే అవకాశం ఉంది. ఆ సంగతలా ఉంచితే.. ఇది ఇంటర్‌నేషనల్ ప్రాజెక్ట్ కాబట్టి ఇప్పటికే హాలీవుడ్ చిత్రాలు చేసిన దీపికా పదుకోన్ అయితే బాగుంటుందని కూడా అనుకుంటున్నారట. మరి.. మహేశ్ సినిమాలో హీరోయిన్‌గా నటించే చాన్స్ ఆలియాకు దక్కుతుందా? లేక దీపికకా.. లేకపోతే ఇద్దరికీ రాజమౌళి చోటు ఇస్తారా? ఈ ఇద్దరూ కాకుండా వేరే తార తెర మీదకు వస్తారా? అనే అంశాలపై స్పష్టత రావాలంటే వెయిట్ చేయక తప్పదు. ఈ సినిమా షూటింగ్ వచ్చే ఏడాది చివర్లో ప్రారంభం అయ్యే అవకాశం ఉంది.

అవకాశం వస్తే పదేళ్ల భవిష్యత్‌లోకి వెళ్తాను

\- అమల అక్కినేని



"'ఒకే ఒక జీవితం' చూసి, నాగార్జున గారు 'మా అమ్మ అన్నపూర్ణమ్మగారు గుర్తుకు వచ్చారు.. చాలా గర్వంగా ఉంది'' అని చెప్పడం గొప్ప అనుభూతినిచ్చింది'' అని అమల అక్కినేని అన్నారు. శర్వానంద్, రీతూ వర్మ జంటగా నటించిన చిత్రం 'ఒకే ఒక జీవితం'. శ్రీ కార్తీక్ దర్శకత్వం వహించారు. ఎస్ఆర్ ప్రకాష్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలైంది. ఈ చిత్రంలో హీరో శర్వానంద్ తల్లి పాత్ర చేసిన అమల మాట్లాడుతూ– ''లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' తర్వాత మలయాళంలో రెండు, హిందీలో మూడు సినిమాలు, ఒక వెబ్ సిరీస్ చేశాను. కానీ తెలుగులో 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' తర్వాత నేను చేసిన చిత్రం 'ఒకే ఒక జీవితం'. ఐదేళ్లుగా 'అన్నపూర్ణ ఫిల్మ్ అండ్ మీడియా'ని నేనే చూసుకుంటున్నాను. వందల మంది విద్యార్థుల భవిష్యత్ బాధ్యత నాపై ఉండటంతో నటిగా బిజీగా ఉంటే కష్టం. అందుకే నా మనసుకు హత్తుకునే కథ, ఆ పాత్రకి నేను కరెక్ట్ అనిపిస్తే చేస్తాను. అలాంటి కథే 'ఒకే ఒక జీవితం'. నిజాయితీతో తీసిన సినిమా ప్రేక్షకులకు ఎప్పుడూ నచ్చుతుందని ఈ మూవీ మరోసారి రుజువు చేసింది. అయితే 'ఒకే ఒక జీవితం' లాంటి పాత్రలు చేయడం సవాల్‌తో కూడుకున్నది. ఈ సినిమా చూసిన మా అమ్మగారు నన్ను హత్తుకుని 'చాలా గర్వంగా ఉంది' అనడం మర్చిపోలేను. నాగార్జునతో పాటు, మా కుటుంబ సభ్యులు, స్నేహితులు ఈ చిత్రానికి డీప్‌గా కనెక్ట్ అయ్యారు. నన్ను చూడకుండా కేవలం కథ, పాత్రలతో ప్రయాణం చేశారు. నాకు గొప్ప తృప్తిని, హాయిని ఇచ్చిన సినిమా ఇది. ఈ చిత్రంలోలా టైమ్ మిషన్‌లో వెళ్లే అవకాశం వస్తే పదేళ్ల భవిష్యత్‌లోకి వెళ్తాను (నవ్వుతూ). నాగార్జునగారు, నేను ఇంట్లో ఎప్పుడూ కలిసే ఉంటాం.. మళ్లీ స్క్రీన్‌పై వద్దు (నవ్వుతూ)'' అన్నారు.

'బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్'కి ప్రపంచ స్థాయి గుర్తింపు రావడం ఆనందంగా ఉంది. మంచి వైద్యులు, మేనేజ్‌మెంట్, వాలంటీర్లు ఉన్నారు. నేను ఉన్నా లేకపోయినా అద్భుతమైన సేవలు అందిస్తుంది. ప్రతి శనివారం నేను కూడా స్వచ్ఛందంగా వెళ్లి పని చేస్తున్నాను.

ఆయనలా శ్రీ విష్ణు పెద్ద స్టార్ అవ్వాలి

\- నాని



● శ్రీ విష్ణు, బెక్కెం వేణుగోపాల్, నాని

"మహేశ్‌బాబుగారు బయట చాలా రిజర్వ్‌డ్‌గా ఉండి లోపల చాలా సరదాగా ఉంటారని విన్నాను. ఆయన తర్వాత శ్రీ విష్ణు ఆ కోవకి వస్తారు. తను కూడా మహేశ్‌గారిలా పెద్ద స్టార్ కావాలి'' అని హీరో నాని అన్నారు. శ్రీ విష్ణు, కయదు లోహర్ జంటగా ప్రదీప్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అల్లూరి'. బెక్కెం బబిత సమర్పణలో బెక్కెం వేణుగోపాల్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను నాని విడుదల చేసి, మాట్లాడుతూ– ''అల్లూరి' ట్రైలర్ బావుంది.. సినిమా పెద్ద సక్సెస్ కావాలి. సినిమా చేస్తే హీరో కాకుండా పాత్రలు మాత్రమే కనిపించే హీరోలు చాలా తక్కువమంది ఉంటారు.. అలాంటి నటుల్లో ముందు వరుసలో ఉండే శ్రీ విష్ణు అంటే నాకు చాలా ఇష్టం'' అన్నారు. ''ఎంతోమంది నానీగారిని స్ఫూర్తిగా తీసుకొని ఇండస్ట్రీకి వస్తారు.. నాకు కూడా ఆయనే స్ఫూర్తి. గొప్ప కథతో రూపొందిన 'అల్లూరి' చిత్రాన్ని ఆదరించాలి'' అన్నారు శ్రీ విష్ణు. ''అద్భుతమైన కంటెంట్ ఉన్న సినిమా 'అల్లూరి'. ట్రైలర్ అందరికీ నచ్చింది.. సినిమా అంతకంటే పెద్ద విజయం సాధిస్తుంది'' అన్నారు బెక్కెం వేణుగోపాల్. గేయ రచయిత రాంబాబు గోసాల పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: నాగార్జున వడ్డే, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, కెమెరా: రాజ్ తోట.

సమాజానికి సందేశం



● రంజిత్

రంజిత్, సౌమ్యా మీనన్ జంటగా రామకృష్ణ పరమహంస దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'లెహరాయి'. బెక్కెం వేణుగోపాల్ సమర్పణలో ఎస్ఎల్ఎస్ మూవీస్ నిర్మాణ సంస్థలో మద్దిరెడ్డి శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని 'బింబిసార' డైరెక్టర్ వశిష్ఠ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టీజర్ చాలా బాగుంది. శ్రీనివాస్‌గారు మంచి సినిమా నిర్మించారు. మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలి'' అన్నారు. ''మా చిత్రం ద్వారా సమాజానికి ఒక మంచి సందేశం ఇస్తున్నాం. త్వరలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం'' అన్నారు మద్దిరెడ్డి శ్రీనివాస్. ''సినిమా బాగా వచ్చింది.. పక్కా హిట్ సాధిస్తాం'' అన్నారు రామకృష్ణ పరమహంస. ''ఈ సినిమాలో మంచి ఎమోషన్స్ ఉన్నాయి'' అన్నారు రంజిత్. సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ, నటి సంధ్య జనక్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఎంఎస్ బాల్ రెడ్డి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 1,093	నిఫ్టీ ▽ 347
58,840	17,531

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	11,337	▽	216
డోజోన్స్	30,599	▽	363
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,237	▽	45
డాక్స్	12,741	▽	215
షాంఘై	3,126	▽	74
నికాయ్	27,567	▽	308

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బీ న్యూ మొబైల్స్ స్టోర్లలో ఐఫోన్14 మోడళ్ల లభ్యం



హైదరాబాద్: ప్రముఖ మొబైల్స్ విక్రయ సంస్థ బీ న్యూ మొబైల్స్ కస్టమర్ల కోసం ఐఫోన్ 14 సిరీస్‌ను అందుబాటులోకి తెచ్చింది. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కంపెనీ సీఎండీ వై బాలాజీ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితేష్, యాపిల్ సంస్థ ప్రతినిధులు మార్కెట్లోకి లాంఛనంగా విడుదల చేశారు. ఐసీఐసీఐ బ్యాంకు ద్వారా కొనుగోలుపై 25% కచ్చితమైన బైబ్యాక్ ఆఫర్, హెచ్‌డీఎఫ్‌సీ కొనుగోలుపై రూ.5వేల వరకు క్యాష్ బ్యాక్ ఆఫర్‌ను పొందవచ్చు. "తెలుగు రాష్ట్రాల్లోని 150 అవుట్‌లెట్లలో ఈ మోడళ్లు లభ్యమవుతాయి. కస్టమర్లంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి" అని సంస్థ సీఎండీ వై.బాలాజీ తెలిపారు.

- బీఎస్‌ఈ ప్రధాన కార్యాలయంలో జరిగిన మహిళా డైరెక్టర్ల సదస్సులో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగం
- 45 రోజుల్లోగా ఎంఎస్‌ఎంఈల బకాయిల చెల్లింపునకు ఆదేశాల వార్తలు... సాక్షి 'ప్లస్'లో

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	49,341	▼	585
బంగారం (99.5 స్వచ్ఛత)	49,144	▼	582
వెండి (కిలో)	55,144	▼	1,186

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-9-2022	
విశాఖ	450-00
చిత్తూరు	443-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	440-00
విజయవాడ	440-00
రిటైల్ ధర (డజను)	66.00
16-9-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

మార్కెట్లో మాంద్యం భయాలు

బేర్‌మన్న దలాల్‌స్ట్రీట్
- సెన్సెక్స్ 1,093 పాయింట్లు క్రాష్
- నిఫ్టీ నష్టం 347 పాయింట్లు
- రూ.ఆరు లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: ఆర్థిక మాంద్యం తలెత్తవచ్చనే భయాలతో శుక్రవారం దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాలు పోటెత్తాయి. ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న ప్రతికూల సంకేతాలు సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడిని పెంచాయి. ట్రేడింగ్ ఆద్యంతం అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీలు రెండుశాతం క్షీణించాయి. సెన్సెక్స్ 1,093 పాయింట్లు క్షీణించి 58,840 వద్ద ముగిసింది. ఈ సూచీలో మొత్తం నాలుగు మాత్రమే లాభపడ్డాయి. నిఫ్టీ 347 పాయింట్లను కోల్పోయి 17,531 వద్ద నిలిచింది. నిఫ్టీ 50 షేర్లలో సిప్లా, ఇండస్ ఇండ్ షేర్లు మాత్రమే లాభంతో గట్టెక్కాయి. ఐటీ, ఆటో, రియల్టీ షేర్లు భారీగా నష్టపోయాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ మూడు శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ రెండుశాతం చొప్పున క్షీణించాయి. ట్రెజరీ బాండ్లపై రాబడులు, డాలర్ ఇండెక్స్ పెరగడంతో పెరుగుదలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. గడిచిన మూడు నెలల్లో సూచీలు ఒకవారంలో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 952 పాయింట్లు, నిఫ్టీ 303 పాయింట్లను కోల్పోయాయి.



ట్రేడింగ్ ఆద్యంత అమ్మకాలే...

ప్రపంచ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న దేశీయ మార్కెట్ ఉదయం నష్టంతో మొదలైంది. సెన్సెక్స్ 349 పాయింట్లు పతనమై 59,585 వద్ద, నిఫ్టీ 80 పాయింట్లు క్షీణించి 17,797 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. జాతీయ, అంతర్జాతీయ సంకేతాలు బలహీనంగా ఉండటంతో ఇన్వెస్టర్లు ట్రేడింగ్ ఆద్యంతం అమ్మకాలకే మొగ్గుచూపారు. ఒక దశలో సెన్సెక్స్ 1247 పాయింట్లను కోల్పోయి 58,687 వద్ద, నిఫ్టీ 380 పాయింట్ల నష్టాన్ని చవిచూసి 17,497 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. కాగా, సెన్సెక్స్ భారీ నష్టంతో శుక్రవారం ఒక్క రోజే ఇన్వెస్టర్లకు రూ.6.18 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. ఇదే సూచీ గడిచిన మూడు రోజుల్లో 1,730 పాయింట్లను కోల్పోవడంతో మొత్తం రూ.7 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. వెరసి బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.285.90 లక్షల కోట్ల నుంచి రూ.279.80 లక్షల కోట్లకు దిగివచ్చింది.

నష్టాలు ఎందుకంటే

అంతర్జాతీయంగా మాంద్యం వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ హెచ్చరించడంతో భారత్‌తో సహా ప్రపంచ మార్కెట్లన్నీ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ద్రవ్యోల్బణ కట్టడికి కేంద్ర బ్యాంకులు కఠిన ద్రవ్య విధాన అమలుకు సిద్ధమతున్న వేళ.., వడ్డీరేట్ల పెంపుతో ఆర్థిక మాంద్యం ముంచుకురావచ్చనే ఆందోళనలు ఇన్వెస్టర్లను కలవరపెట్టాయి. దేశీయంగా ఆగస్టులో ద్రవ్యోల్బణం మళ్లీ ఎగువబాట పట్టడం ఆందోళన కలిగించింది.

కరణ్ అదానీ చేతికి ఏసీసీ పగ్గాలు



- ఏసీసీ, అంబుజా సిమెంట్స్ కొనుగోలు పూర్తి
- డైరెక్టర్‌గా గౌతమ్ అదానీ పుత్రుడికి బాధ్యతలు
- బోర్డుల పునర్వ్యవస్థీకరణపై అదానీ గ్రూప్ వెల్లడి



న్యూఢిల్లీ: స్విస్ సిమెంట్ దిగ్గజం హోల్సిమ్‌కు చెందిన ఇండియా బిజినెస్‌ల కొనుగోలును పూర్తి చేసినట్లు అదానీ గ్రూప్ వెల్లడించింది. తద్వారా ప్రపంచ కుబేరుడు గౌతమ్ అదానీ గ్రూప్ దేశీయంగా రెండో అతిపెద్ద సిమెంట్ దిగ్గజంగా ఆవిర్భవించింది. కాగా.. అదానీ పెద్ద కుమారుడు కరణ్‌కు ఏసీసీ బాధ్యతలు అప్పగించినట్లు గ్రూప్ తాజాగా పేర్కొంది. 6.5 బిలియన్ డాలర్లకు హోల్సిమ్ నుంచి సొంతం చేసుకున్న తదుపరి ఏసీసీ, అంబుజా సిమెంట్స్ వాటాదారులకు ఓపెన్ ఆఫర్లను పూర్తి చేసినట్లు తెలియజేసింది. అదానీ గ్రూప్ టేకోవర్ పూర్తయిన వెంటనే రెండు కంపెనీల బోర్డు డైరెక్టర్లు రాజీనామాలు చేసినట్లు వెల్లడించింది.

గౌతమ్ అదానీ అధ్యక్షతన

గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ గౌతమ్ అదానీ అంబుజా సిమెంట్స్‌కు అధ్యక్షత వహించనున్నారు. ప్రస్తుతం పోర్టు బిజినెస్‌లు చూస్తున్న కరణ్ అదానీ ఏసీసీ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. పీఎస్‌యూ దిగ్గజం ఎస్‌బీఐ మాజీ చైర్మన్ రజనీష్ కుమార్ అంబుజా బోర్డులో, ఇంధన దిగ్గజం షెల్ ఇండియా మాజీ హెడ్ నితిన్ శుక్లా ఏసీసీ బోర్డులో స్వతంత్ర డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అంబుజా సీఈవోగా అజయ్ కుమార్, ఏసీసీ సీఈవోగా శ్రీధర్ బాలకృష్ణన్ వ్యవహరించనున్నారు.

లక్ష కోట్ల దిశగా పతంజలి గ్రూప్..

5–7 ఏళ్లలో సాకారం అవుతుంది ● ప్రకటించిన బాబా రామ్‌దేవ్



న్యూఢిల్లీ: వచ్చే 5–7 ఏళ్లలో సంస్థ ఆదాయం రెండున్నర రెట్లు ఎగసి రూ.1 లక్ష కోట్లకు చేరుతుందని పతంజలి గ్రూప్ వెల్లడించింది. ప్రస్తుతం ఆదాయం రూ.40,000 కోట్లు ఉందని గ్రూప్ ఫౌండర్, యోగా గురు బాబా రామ్‌దేవ్ తెలిపారు. అయిదేళ్లలో తమ సంస్థ ప్రత్యక్షంగా అయిదు లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. 'గ్రూప్ అనుబంధ కంపెనీ అయిన పతంజలి ఫుడ్స్ (గతంలో రుచి సోయా) ఇప్పటికే స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయింది. ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.50,000 కోట్లను తాకింది. మరో నాలుగు కంపెనీలను 2027 నాటికి లిస్ట్ చేయనున్నాం. ఐపీవోకు రానున్న కంపెనీల్లో పతంజలి ఆయుర్వేద్, పతంజలి మెడిసిన్, పతంజలి లైఫ్‌స్టైల్, పతంజలి వెల్‌నెస్ ఉన్నాయి. ఈ నాలుగింటిలో పతంజలి ఆయుర్వేద్ తొలుత ఐపీవోకు రానుంది. ఈ కంపెనీకి మార్కెట్లో సుస్థిర స్థానం ఉంది' అని వివరించారు.

నెయ్యిలో కల్తీ అబద్ధం

పతంజలి నెయ్యిలో కల్తీ జరుగుతోందడం సరికాదన్నారు. ల్యాబ్‌లో కనుగొన్న విషయాలు సరైనవి కావని, ఇందులో కొంతమంది అధికారుల ప్రమేయం ఉందని ఆరోపించారు.

ప్రభుత్వాల ల్యాబొరేటరీ ప్రమాణాలు పెరగాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ల్యాబొరేటరీలలో పరీక్షా సౌకర్యాలను మెరుగుపరచాలని, బాధ్యతా రహిత అధికారులను శిక్షించాలని సూచించారు. 'అన్ని ఉత్పత్తులు బయటకు వచ్చే ముందు అనేకసార్లు పరీక్షిస్తాం. పరిశోధన, అభివృద్ధికి రూ.1,000 కోట్ల దాకా ఖర్చు చేశాం' అని వెల్లడించారు.

ఇమేజ్ కాపాడుకుంటాం..

'కుట్ర పన్నిన వ్యక్తులను ఈసారి వదిలిపెట్టబోము. బ్రాండ్ ప్రతిష్టను కాపాడేందుకు చట్ట ప్రకారం కఠిన చర్యలను గ్రూప్ తీసుకుంటుంది. 100 మందికిపైగా లీగల్ నోటీసులు పంపించాం. ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయి' అని స్పష్టం చేశారు. యోగా పరువు తీయడంలో మతపరమైన తీవ్రవాదం, ఆయుర్వేదం విషయంలో మెడికల్ టెర్రరిజం హస్తం ఉందని గ్రూప్ ప్రకటన ఒకటి తెలిపింది.

లంపీకి పరిష్కారం దిశగా..

పశువులకు సోకుతున్న లంపీ చర్మ వ్యాధికి పరిష్కారం కనుగొనే దిశగా పతంజలి గ్రూప్ కసరత్తు చేస్తోందని రామ్‌దేవ్ వెల్లడించారు. ఈ వ్యాధి బారిన పడి ఇప్పటికే దేశంలో ఒక లక్ష ఆవులు మృత్యువాత పడ్డాయని పేర్కొన్నారు. హరిద్వార్‌లోని తన ఇంట్లో చాలా ఆవులకు కూడా ఈ వ్యాధి సోకిందని, అయితే ఒక్కటి కూడా చనిపోలేదని చెప్పారు.

త్వరలో నాలుగు ఐపీవోలు

ఐపీవో కోణం నుండి చూస్తే పతంజలి ఆయుర్వేద్ ఉత్తమమైనదని రామ్‌దేవ్ తెలిపారు. 'ఉత్పత్తి శ్రేణి, విస్తృతి, కస్టమర్ల సంఖ్య, లాభదాయకత, భవిష్యత్తు అంచనా పరంగా ఇది అత్యంత అనుకూలమైనది. దివ్య ఫార్మసీని ప్రమోట్ చేస్తున్న పతంజలి మెడిసిన్ రెండవ ఐపీవోగా అడుగుపెట్టనుంది. ఆ తర్వాత ఔట్ పేషెంట్స్ డిపార్ట్‌మెంట్స్, హాస్పిటల్స్‌ను నిర్వహిస్తున్న పతంజలి వెల్‌నెస్ ఐపీవోకు రానుంది. పతంజలి వెల్‌నెస్ కింద 25,000 పడకల సామర్థ్యానికి చేరుకోవాలన్నది లక్ష్యం. ప్రస్తుతం 50 కేంద్రాలున్నాయి. వీటిని రెండింతలు చేస్తాం. ఫ్రాంచైజీ విధానంలోనూ సెంటర్లను ఏర్పాటు చేస్తాం. దుస్తులు, రవాణా, పశువుల దాణా, ఇతర అభివృద్ధి చెందుతున్న విభాగాల్లో పతంజలి లైఫ్‌స్టైల్ కార్యకలాపాలు సాగిస్తోంది' అని చెప్పారు.

కాఫీ బోర్డులోకి శ్రీశాంత్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రతిష్టాత్మక భారత కాఫీ బోర్డు సభ్యుడిగా సీసీఎల్ ప్రాడక్ట్స్ ఎండీ చల్లా శ్రీశాంత్ నియమితులయ్యారు. మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో ఉంటారు. ఇన్‌స్టాంట్ కాఫీ తయారీదార్ల తరఫున సభ్యుడిగా బోర్డు ఆయనను ఎంపిక చేసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి అత్యధికంగా అయిదుగురికి బోర్డులో స్థానం దక్కడ విశేషం. 'ఏపీలో కాఫీ సాగుపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్టు దీనినిబట్టి అర్థం అవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుంటే భారత్‌లో కాఫీ ఉత్పత్తి రెండింతలు అవుతుంది' అని శ్రీశాంత్ ఈ సందర్భంగా తెలిపారు.

అజియో నుంచి 'ఆల్‌స్టార్స్ సేల్' ఆఫర్



బెంగళూరు: ఆన్‌లైన్ ఈ–ఫ్యాషన్ రీటైలర్ అజియో 'ఆల్ స్టార్స్ సేల్' పేరుతో సరికొత్త ఆఫర్‌ను ప్రకటించింది. జాతీయ, అంతర్జాతీయ ఫ్యాషన్ బ్రాండ్స్‌కు చెందిన 10 లక్షలకు పైగా భిన్న వస్త్రాలపై 50%–90% డిస్కౌంట్లను అందిస్తోంది. తొలిసారి యాప్ సైన్ అప్ ద్వారా రూ.500 తక్షణ క్యాష్‌బ్యాక్‌ను పొందవచ్చు. ఇప్పటికే ప్రారంభమైన ఈ ఆఫర్ సెప్టెంబర్ 25 వరకు అందుబాటులో ఉంటుంది.

భారత 76వ గ్రాండ్‌మాస్టర్‌గా ప్రణవ్ ఆనంద్

ఈ ఏడాది భారత్ నుంచి మరో కుర్రాడు చెస్‌లో గ్రాండ్‌మాస్టర్ (జీఎం) హోదా సంపాదించాడు. బెంగళూరుకు చెందిన 15 ఏళ్ల ప్రణవ్ ఆనంద్ భారత్ నుంచి గ్రాండ్‌మాస్టర్ హోదా దక్కించుకున్న 76వ ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. రొమేనియాలో జరుగుతున్న ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్‌లో అండర్–16 విభాగంలో టైటిల్ సాధించిన ప్రణవ్ 2500 ఎలో రేటింగ్ మైలురాయిని కూడా దాటాడు. దాంతో అతనికి జీఎం హోదా ఖరారైంది. నిబంధనల ప్రకారం జీఎం హోదా లభించాలంటే మూడు జీఎం నార్మ్‌లు సంపాదించడంతోపాటు 2500 ఎలో రేటింగ్ పాయింట్లు ఉండాలి. గత జూలైలో స్విట్జర్లాండ్‌లో జరిగిన బీల్ చెస్ ఫెస్టివల్‌లో ప్రణవ్ మూడో జీఎం నార్మ్ సాధించాడు. ఈ సంవత్సరం భరత్ సుబ్రమణియమ్ (తమిళనాడు), రాహుల్ శ్రీవత్సవ్ (తెలంగాణ), ప్రణవ్ వెంకటేశ్ (తమిళనాడు) జీఎం హోదా సాధించారు.



నవీన్‌కు నిరాశ

- కాంస్య పతక పోరులో పరాజయం
- ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన రవి

బెల్‌గ్రేడ్ (సెర్బియా): ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మరో పతకం చేజారింది. పురుషుల ఫ్రీస్టయిల్ 70 కేజీల విభాగంలో నవీన్ త్రుటిలో కాంస్య పతకాన్ని కోల్పోయాడు. ఎర్నాజర్ అక్మతలియెవ్ (కిర్గిజిస్తాన్)తో శుక్రవారం జరిగిన కాంస్య పతక బౌట్‌లో నవీన్ 1–4 పాయింట్ల తేడాతో ఓడిపోయాడు. తొలి రౌండ్ ఆరంభంలో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లిన నవీన్ ఆ తర్వాత రెండు పాయింట్లు సమర్పించుకున్నాడు. రెండో రౌండ్‌లో మరో రెండు పాయింట్లు కోల్పోయిన నవీన్ తేరుకోలేకపోయాడు. ఇటీవల బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో 74 కేజీల విభాగంలో పోటీపడిన నవీన్ స్వర్ణ పతకం సాధించాడు. అయితే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 70 కేజీల విభాగంలో బరిలోకి దిగి తొలి రౌండ్‌లో 1–6తో తైషి నరుకుని (జపాన్) చేతిలో ఓటమి పాలయ్యాడు. తైషి నరుకుని ఫైనల్ చేరుకోవడంతో 'రెపిచాజ్' పద్ధతి ప్రకారం నవీన్‌కు కాంస్య పతకం కోసం పోటీపడే అవకాశం లభించింది. 'రెపిచాజ్' తొలి రౌండ్‌లో నవీన్ 11–3తో సిర్బాజ్ తల్గాట్ (కజకిస్తాన్)పై నెగ్గిన నవీన్‌కు రెండో రౌండ్‌లో ఇలియాస్ బెక్బులతోవ్ (ఉజ్బెకిస్తాన్) నుంచి వాకోవర్ లభించింది. దాంతో నవీన్ కాంస్య పతక పోరుకు అర్హత సాధించాడు.



నవీన్

అనూహ్య ఫలితం...

మరోవైపు భారత్‌కు కచ్చితంగా పతకం అందిస్తాడని ఆశించిన స్టార్ రెజ్లర్ రవి కుమార్ రిక్త హస్తాలతో స్వదేశానికి రానున్నాడు. ఈ మెగా ఈవెంట్ కోసం రష్యాలో ప్రత్యేక శిక్షణ పొందిన రవి కుమార్ పురుషుల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగంలో ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ఓడిపోయాడు. తొలి రౌండ్‌లో 10–0తో మరియన్ కొవాక్స్ (రొమేనియా)పై గెలిచిన రవి ప్రిక్వార్టర్ ఫైనల్లో 0–10తో గులామ్‌జాన్ అబ్దులయెవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు. అబ్దులయెవ్ ఫైనల్ చేరుకొని ఉంటే 'రెపిచాజ్' పద్ధతి ప్రకారం రవి కుమార్‌కు కనీసం కాంస్యం కోసం పోటీపడేందుకు మరో అవకాశం లభించేది. కానీ అబ్దులయెవ్ క్వార్టర్ ఫైనల్లో 2–13తో జెలీమ్‌ఖాన్ అబకరోవ్ (అల్బేనియా) చేతిలో ఓడిపోవడంతో రవి పతకం ఆశలు ఆవిరయ్యాయి. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించిన రవి గత ఏడాది జరిగిన టోక్యో ఒలింపిక్స్‌లో రజత పతకం గెలిచాడు. 2020, 2021, 2022 ఆసియా చాంపియన్‌షిప్‌లో వరుసగా మూడేళ్లు స్వర్ణ పతకాలు నెగ్గిన రవి ఇటీవల బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లోనూ పసిడి పతకం గెలిచాడు. అయితే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మాత్రం నిరాశపరిచాడు. 74 కేజీల విభాగంలో సాగర్ జగ్లాన్ క్వార్టర్ ఫైనల్లో 0–5తో కైల్ డగ్లస్ డేక్ (అమెరికా) చేతిలో ఓడిపోయాడు. కైల్ ఫైనల్ చేరుకోవడంతో సాగర్ నేడు కాంస్య పతకం కోసం బరిలో నిలిచాడు. రెండు బౌట్‌లలో సాగర్ గెలిస్తే అతనికి కాంస్యం లభిస్తుంది.



రవి

మళ్లీ ఓడిన మన మహిళలు

టి20 సిరీస్ ఇంగ్లండ్ సొంతం

బ్రిస్టల్: ఇంగ్లండ్ గడ్డపై భారత మహిళల జట్టు టి20 సిరీస్‌ను 1–2తో కోల్పోయింది. భారత కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన మూడో మ్యాచ్‌లో ఇంగ్లండ్ మహిళల జట్టు 7 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. పేలవమైన బ్యాటింగ్ ప్రదర్శన హర్మన్ బృందానికి ఓటమిని అందించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. ఒక దశలో టీమ్ 35 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. 9.5 ఓవర్లకే షఫాలీ (5), స్మృతి (9), మేఘన (0), హేమలత (0), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (5) వెనుదిరగ్గా... 52 పరుగుల వద్ద స్నేహ్ రాణా (8) వికెట్ పడింది. ఈ దశలో రిచా ఘోష్ (22 బంతుల్లో 33; 5 ఫోర్లు), దీప్తి శర్మ (25 బంతుల్లో 24) ఆదుకోవడంతో స్కోరు 100 పరుగులు దాటగలిగింది. చివర్లో పూజ వస్త్రకర్ (19 నాటౌట్; 2 ఫోర్లు) కూడా కొన్ని పరుగులు జోడించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', లెఫ్టార్మ్ స్పిన్నర్ సోఫీ ఎకెల్‌స్టోన్ (3/25) భారత్‌ను దెబ్బ తీయగా, సారా గ్లెన్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం ఇంగ్లండ్ 18.2 ఓవర్లలో 3 వికెట్లకు 126 పరుగులు సాధించి గెలిచింది. సోఫియా డంక్లీ (44 బంతుల్లో 49; 6 ఫోర్లు), అలైస్ క్యాప్సీ (24 బంతుల్లో 38 నాటౌట్; 6 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడగా, డానీ వ్యాట్ (22; 1 ఫోర్) రాణించింది. ఇరు జట్ల మధ్య ఆదివారం హోవ్‌లో తొలి వన్డే జరుగుతుంది.




భారత 'ఎ' వన్డే జట్టులో తిలక్ వర్మ



న్యూఢిల్లీ: ఈ సీజన్ ఐపీఎల్‌తో హైదరాబాద్ యువ క్రికెటర్ నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ చాన్స్ మీద చాన్స్ కొట్టేస్తున్నాడు. తొలుత న్యూజిలాండ్ 'ఎ'తో 3 మ్యాచ్‌ల అనధికారిక టెస్టు సిరీస్‌కు ఎంపికైన అతన్ని తాజాగా న్యూజిలాండ్ 'ఎ'తో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కూ కొనసాగిస్తున్నారు. ఆంధ్ర వికెట్ కీపర్ శ్రీకర్ భరత్ కూడా ఈ జట్టులో ఉన్నాడు. కెప్టెన్‌గా సంజూ సామ్సన్ వ్యవహరిస్తాడు. చెన్నై వేదికగా ఈ మూడు వన్డేలు ఈనెల 22, 25, 27 తేదీల్లో జరుగుతాయి.

భారత్ 'ఎ' వన్డే జట్టు: సంజూ సామ్సన్ (కెప్టెన్), పృథ్వీ షా, అభిమన్యు ఈశ్వరన్, రుతురాజ్ గైక్వాడ్, రాహుల్ త్రిపాఠి, రజత్ పటిదార్, తిలక్ వర్మ, శ్రీకర్ భరత్, కుల్దీప్ యాదవ్, కుల్దీప్ సేన్, శార్దుల్ ఠాకూర్, ఉమ్రాన్ మలిక్, నవదీప్ సైనీ, రాజ్ అంగద్, రాహుల్ చహర్, షహబాజ్ అహ్మద్.

తొలి సింగిల్స్‌లో ప్రజ్నేశ్ పరాజయం



లిల్లీహ్యామర్ (నార్వే): డేవిస్‌కప్ టీమ్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్–1లో భాగంగా నార్వేతో శుక్రవారం మొదలైన పోటీలో భారత్‌కు శుభారంభం లభించలేదు. యూఎస్ ఓపెన్ రన్నరప్, ప్రపంచ రెండో ర్యాంకర్ కాస్పర్ రూడ్‌తో జరిగిన తొలి సింగిల్స్‌లో ప్రపంచ 335వ ర్యాంకర్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ కనీస పోరాట పటిమ కనబర్చకుండానే చేతులెత్తేశాడు. కేవలం 62 నిమిషాల్లో ముగిసిన తొలి సింగిల్స్‌లో 23 ఏళ్ల కాస్పర్ రూడ్ 6–1, 6–4తో 32 ఏళ్ల ప్రజ్నేశ్‌ను ఓడించి నార్వేకు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. ఈ మ్యాచ్‌లో ప్రజ్నేశ్ నాలుగు ఏస్‌లు సంధించినా తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయాడు. రెండో సింగిల్స్ విక్టర్ దురాసోవిచ్, రామ్‌కుమార్ రామనాథన్ మధ్య జరుగుతుంది. నేడు డబుల్స్ మ్యాచ్‌తో పాటు రెండు రివర్స్ సింగిల్స్ జరుగుతాయి.

కొత్త కోచ్‌గా మార్క్ బౌచర్

ముంబై ఇండియన్స్ ప్రకటన

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో అత్యంత విజయవంతమైన టీమ్‌కు కొత్త హెడ్ కోచ్ వచ్చాడు. రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన ముంబై ఇండియన్స్ తమ హెడ్ కోచ్‌గా దక్షిణాఫ్రికా మాజీ వికెట్ కీపర్ మార్క్ బౌచర్‌ను నియమించింది. ఇప్పటి వరకు కోచ్‌గా ఉన్న మహేల జయవర్ధనేకు ఫ్రాంచైజీ ఇతర కీలక బాధ్యతలు అప్పగించడంతో కోచ్ ఎంపిక అనివార్యమైంది. 45 ఏళ్ల బౌచర్ ప్రస్తుతం దక్షిణాఫ్రికా జాతీయ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తుండగా, వచ్చే టి20 వరల్డ్‌కప్ తర్వాత ఆ బాధ్యతల నుంచి తప్పుకోనున్నట్లు అతను ఇప్పటికే ప్రకటించాడు. 'ముంబై ఇండియన్స్‌లాంటి జట్టుకు కోచ్‌గా వ్యవహరించే అవకాశం రావడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నా. రాబోయే సవాల్‌కు సిద్ధంగా ఉన్నా. మరింత గొప్ప ఫలితాలు సాధించేందుకు అందరితో కలిసి ప్రయత్నిస్తా' అని బౌచర్ వ్యాఖ్యానించాడు. ఐపీఎల్‌లో బెంగళూరు, కోల్‌కతా ఫ్రాంచైజీలకు ఆడిన బౌచర్... కోల్‌కతా టీమ్‌కు 2016లో వికెట్ కీపింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. దక్షిణాఫ్రికా దేశవాళీ క్రికెట్‌లో టైటాన్స్‌కు కూడా కోచింగ్ ఇచ్చిన అతని నేతృత్వంలో సఫారీ టీమ్ 11 టెస్టులు, 12 వన్డేలు, 23 టి20ల్లో విజయం సాధించింది. అయితే అంతకు ముందు ఆటగాడిగా బౌచర్‌కు ఘనమైన రికార్డు ఉంది. మూడు ఫార్మాట్‌లలో కలిపి 467 మ్యాచ్‌లలో దక్షిణాఫ్రికాకు ప్రాతినిధ్యం వహించగా, అత్యధిక వికెట్ల పతనం (998)లో పాలు పంచుకున్న కీపర్ రికార్డు బౌచర్ పేరిటే ఉంది. ఇందులో 952 క్యాచ్‌లు, 46 స్టంపింగ్‌లు ఉన్నాయి.



పంజాబ్ కోచ్‌గా బేలిస్



ఐపీఎల్‌లో మరో ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ కూడా కొత్త హెడ్ కోచ్‌ను ఎంపిక చేసింది. సుదీర్ఘ అనుభవం ఉన్న ట్రెవర్ బేలిస్‌కు కోచింగ్ బాధ్యతలు ఇస్తున్నట్లు టీమ్ యాజమాన్యం వెల్లడించింది. గత సీజన్ వరకు కోచ్‌గా వ్యవహరించిన అనిల్ కుంబ్లేను పంజాబ్ తప్పించింది. గత రెండు ఐపీఎల్ సీజన్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కోచ్‌గా పని చేసిన బేలిస్... కోల్‌కతా టైటిల్స్ గెలిచిన 2012, 2014 సంవత్సరాల్లో ఆ జట్టుకు కోచ్‌గా ఉన్నాడు. 2019 వన్డే వరల్డ్‌కప్ సాధించిన ఇంగ్లండ్ టీమ్‌కు కూడా బేలిస్ కోచ్‌గా వ్యవహరించాడు.

సెమీస్‌లో భారత్‌కు షాక్



కఠ్మాండు (నేపాల్): దక్షిణాసియా మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత జట్టు తొలిసారి టైటిల్ పోరుకు అర్హత సాధించలేకపోయింది. గతంలో ఈ టోర్నీ జరిగిన ఐదుసార్లూ (2010, 2012, 2014, 2016, 2019) చాంపియన్‌గా నిలిచిన భారత్ ఈసారి మాత్రం సెమీఫైనల్లోనే ఇంటిముఖం పట్టింది. ఆతిథ్య నేపాల్‌తో శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో భారత్ 0–1 గోల్ తేడాతో ఓడిపోయింది. నేపాల్ తరఫున ఆట 45+1వ నిమిషంలో ప్రీతి రాయ్ అందించిన పాస్‌ను రష్మీ కుమారి గోల్‌పోస్ట్‌లోనికి పంపించింది. ఆ తర్వాత భారత జట్టు స్కోరును సమం చేసేందుకు విఫలయత్నం చేసినా ఫలితం లేకపోయింది.

రికీ భుయ్ సెంచరీ



సేలం (తమిళనాడు): ఆంధ్ర ఆటగాడు రికీ భుయ్ (170 బంతుల్లో 103 నాటౌట్; 10 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ శతకంతో కదంతొక్కాడు. దీంతో దులీప్ ట్రోఫీలో నార్త్‌జోన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సౌత్‌జోన్ భారీస్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 324/2తో శుక్రవారం రెండో రోజు ఆటకొనసాగించిన సౌత్‌జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 172.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 630 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. హనుమ విహారి (134; 10 ఫోర్లు, 2 సిక్సర్లు) తన ఓవర్‌నైట్ స్కోరుకు 27 పరుగులు జతచేసి నిష్క్రమించాడు. అనంతరం రికీ.. కృష్ణప్ప గౌతమ్ (48; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), హైదరాబాద్ క్రికెటర్ టి.రవితేజ (42; 4 ఫోర్లు, 1 సిక్స్)లతో కలిసి జట్టు స్కోరును 600 పరుగుల పైచిలుకు చేర్చాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ ఆట నిలిచే సమయానికి వికెట్ నష్టపోకుండా 19 పరుగులు చేసింది.

కివీస్ 'ఎ' 237 ఆలౌట్

బెంగళూరు: న్యూజిలాండ్ 'ఎ'తో జరుగుతున్న ఆఖరి అనధికారిక టెస్టులో భారత్ 'ఎ' స్పిన్నర్లు సౌరభ్ కుమార్ (4/48), రాహుల్ చహర్ (3/53) తిప్పేశారు. దీంతో కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 71.2 ఓవర్లలో 237 పరుగులకే ఆలౌటైంది. దాంతో భారత జట్టుకు 56 పరుగుల ఆధిక్యం లభించింది. ఆట మొదలవగానే ఓపెనర్లు జో కార్టర్ (8), రచిన్ రవీంద్ర (4)లను శార్దుల్ ఠాకూర్, ముకేశ్ పెవిలియన్ చేర్చారు. తర్వాత చహర్, సౌరభ్ స్పిన్ మ్యాజిక్‌తో 99 పరుగులకే 5 వికెట్లను కోల్పోయింది. ఈ దశలో చాప్‌మన్ (92; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), సీన్ సొలియా (54; 7 ఫోర్లు) ఆరో వికెట్‌కు 114 పరుగులు జోడించడంతో కివీస్ కోలుకుంది. వాళ్లిద్దరు అవుటయ్యాక ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎంతోసేపు పట్టలేదు. అనంతరం రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన భారత్ 'ఎ' రెండో రోజు ఆట నిలిచే సమయానికి ఒక వికెట్ కోల్పోయి 40 పరుగులు సాధించింది. అభిమన్యు ఈశ్వరన్ (4) వెనుదిరగగా... ప్రియాంక్ పాంచాల్ (17 బ్యాటింగ్), రుతురాజ్ గైక్వాడ్ (18 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

నీట్ పీజీ ప్రాథమిక మెరిట్ జాబితా విడుదల

సాక్షి, అమరావతి : వైద్య విద్య పీజీ, డిప్లొమా కోర్సుల్లో కన్వీనర్ కోటా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ప్రాథమిక మెరిట్ జాబితాను శుక్రవారం ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. మెడికల్ విభాగంలో 4,843 మంది, డెంటల్ విభాగంలో 544 మందితో మెరిట్ జాబితాను రూపొందించింది. ఈ జాబితాపై అభ్యంతరాలను తెలియజేసేందుకు సోమవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు గడువు ఇచ్చింది. అభ్యంతరాలు, వాటిని బలపరిచే ధ్రువీకరణ పత్రాలను appgadmissions2021@gmail.comకు నిర్దేశిత గడువులోపు విద్యార్థులు పంపాలి. ప్రాథమిక మెరిట్ జాబితాలో నీట్‌లో 660 స్కోర్‌తో 83వ ర్యాంక్ సాధించిన వి.కీర్తికృష్ణ మెడికల్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. అదే విధంగా 648 స్కోర్‌తో 148 ర్యాంక్ సాధించిన కె.మెహర్ అరవింద్ రెండో స్థానంలో ఉన్నారు. డెంటల్ విభాగానికి సంబంధించి నీట్‌లో 732 స్కోర్‌తో 29వ ర్యాంక్ సాధించిన ఎస్.నవ్యహరిత మొదటి స్థానంలో, 709 స్కోర్‌తో 85వ ర్యాంక్ సాధించిన వి.సాయిసృజన రెండో స్థానంలో నిలిచారు.

జ్యుడిషియల్ ప్రివ్యూ జడ్జి పదవీకాలం పెంపు

సాక్షి, అమరావతి: జ్యుడిషయల్ ప్రివ్యూ జడ్జి బి.శివశంకర రావు పదవీకాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. తొలుత మూడేళ్ల కాలానికి నియమించిన కాలపరిమితి సెప్టెంబర్13, 2022తో ముగియనుండటంతో పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పొడిగించింది. ఈ ఉత్తర్వులు సెప్టెంబర్ 12,2022 నుంచి అమల్లోకి వచ్చినట్లు ఉత్తర్వుల్లో పెట్టుబడులు మౌలిక వసతుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికల్ వలవన్ పేర్కొన్నారు.

విద్యార్థిని కాలితో తన్నిన అధ్యాపకుడు

- విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో ఘటన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్



విద్యార్థిపై దాడిచేస్తున్న అధ్యాపకుడు (ఇన్‌సెట్‌లో) అధ్యాపకుడు రవికుమార్

లబ్బీపేట (విజయవాడ తూర్పు) : తరగతి గదిలో మాట్లాడాడని ఓ విద్యార్థిని అధ్యాపకుడు చెంపలు వాయించడంతో పాటు, కాలితో తన్నిన ఘటన శుక్రవారం కలకలం రేపింది. విజయవాడ బెంజిసర్కిల్ సమీపంలోని శ్రీ చైతన్య కళాశాల భాస్కర్ భవన్ క్యాంపస్‌లో గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించడంతో జిల్లా విద్యాశాఖ అధికారులతో పాటు, చైల్డ్‌లైన్ వారు కూడా రంగంలోకి దిగారు. ఇంటర్ బోర్డు ప్రాంతీయ తనిఖీ అధికారి రవికుమార్, జిల్లా విద్యాశాఖాధికారి రేణుక కళాశాలకు వెళ్లి విచారించారు. విద్యార్థి ఇయర్‌ఫోన్స్‌లో పాటలు వింటుంటే ఎన్నిసార్లు చెప్పినా వినకపోవడంతో క్షణికావేశంలో అలా చేసినట్లు అధ్యాపకుడు చెబుతుండగా.. తమ అబ్బాయి వద్ద ఫోన్‌లేదని విద్యార్థి తల్లిదండ్రులు చెబుతున్నారు. అధ్యాపకుడ్ని కళాశాల యాజమాన్యం శుక్రవారం తొలగించినట్లు ఆర్ఐవో తెలిపారు.

మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు బెయిల్

తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) కేసులో సీబీఐ కోర్టు ముద్దాయిగా తేల్చిన అరకు మాజీ ఎంపీ, బీజేపీ నాయకురాలు కొత్తపల్లి గీతకు తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆమె భర్త రామకోటేశ్వర్‌రావుకు కూడా బెయిల్ ఇచ్చింది. రూ.25వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. తాజాగా సీబీఐకోర్టు ఇచ్చిన తీర్పును నిలిపివేస్తూ హైకోర్టు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. పీఎన్‌బీకి తప్పుడు పత్రాలు సమర్పించి రూ.42.79 కోట్లు రుణం పొందారన్న ఫిర్యాదుతో 2015లో గీత, రామకోటేశ్వర్‌రావుతోపాటు ముగ్గురు బ్యాంక్ అధికారులపై సీబీఐ కేసు నమోదు చేసింది. గీత, రామకోటేశ్వర్‌రావుకు సీబీఐ కోర్టు మంగళవారం ఐదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధించింది. ఈ తీర్పును వీరు హైకోర్టులో సవాల్ చేశారు.

హైకోర్టును కర్నూలుకు తరలించాల్సిందే..

- కర్నూలులో కొనసాగుతున్న న్యాయవాదుల నిరసనలు
- సీఎం వైఎస్ జగన్ వికేంద్రీకరణ నిర్ణయానికి మద్దతు

కర్నూలు(లీగల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టును తక్షణమే అమరావతి నుంచి కర్నూలుకు తరలించాలని కర్నూలు న్యాయవాదులు డిమాండ్ చేశారు. హైకోర్టు సాధన పోరాట కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న గాంధీ విగ్రహం దగ్గర నిరసనలకు దిగారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ రాయలసీమ ముఖద్వారం అయిన కర్నూలు.. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలుకు ఎయిర్‌పోర్టు, కొండారెడ్డి బురుజు తప్ప ఏమీ మిగల్లేదన్నారు. ఏపీ హైకోర్టును కర్నూలుకు తరలించేంత వరకు నిరసన చేస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వికేంద్రీకరణలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని న్యాయవాదులు అన్నారు. న్యాయవాదులకు వైఎస్సార్‌సీపీ నేత వెన్నపూస రవీందర్‌రెడ్డితో పాటు పలు సంఘాల నాయకులు, ప్రముఖులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంఆర్ కృష్ణ, కె.రంగడు, స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ రవి గువేరా తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.